PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ♦

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 319 | విజయవాడ, శనివారం 21 జూన్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 21 June 2025 | Rs

మూడు రెట్లు పెరిగిన నల్లధనం

- స్విస్ బ్యాంకుల్లో దాచిన పెద్దలు
- ఏడాదిలోనే భారీగా తరలింపు
- మోడీ హయాంలో 70 నుంచి 48వ స్థానంలోకి ఎగబాకిన భారత్

7



శుభ్‌మన్, జైస్వాల్ సెంచరీలు

- భారీస్కోర్ దిశగా టీమిండియా
- సాయి సుదర్శన్ అరంగేట్రం

8



ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని జనావాసాలపై ఇజ్రాయిల్ క్షిపణులు దాడి చేసిన దృశ్యం

ఇరాన్ అణు కేంద్రాలపై ఇజ్రాయిల్ భీకర దాడులు

టెల్ అవీవ్, టెహరాన్ : ఇరాన్‌లోని అణు కేంద్రాలు, సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయిల్ భీకర దాడులకు పాల్పడుతోంది. వరుసగా 8వ రోజైన శుక్రవారం కూడా ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య దాడులు కొనసాగుతూనే వున్నాయి. ఇరాన్ అణు, మిలటరీ స్థావరాలే లక్ష్యంగా దాడులకు తెగబడాలని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు తాజాగా ఆదేశాలు జారీ చేశారు. ఇరాన్ ప్రభుత్వ సంస్థలు, కేంద్రాలు, మౌలిక వసతులు, ప్రభుత్వ ఆస్తులే లక్ష్యంగా దాడులను మరింత ఉధృతం చేయాల్సిందిగా ఇప్పటికే ఐడిఎఫ్‌కు, ఇజ్రాయిల్ రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్‌కు కూడా కీలక ఆదేశాలు జారీ అయ్యాయి. ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమంతో సంబంధమున్న అన్ని అణు కేంద్రాలు, స్థావరాలు, శాస్త్రవేత్తలపై దాడులు కొనసాగించాల్సిందిగా ఆదేశించారు. ప్రస్తుతం అమలు చేస్తున్న లక్ష్యాలకు అదనంగా వీటిని కూడా చేపట్టాలని కోరారు. రాజధాని టెహరాన్‌లో ప్రభుత్వ కేంద్రాలపై దాడులను ఉధృతం చేయాలని మిలటరీని ఆదేశించినట్లు రక్షణ మంత్రి కట్జ్ చెప్పారు.

జెనీవాలో దౌత్య ప్రయత్నాలు

మరోవైపు యుద్ధాన్ని ఆపేందుకు తీసుకోవాల్సిన దౌత్య చర్యలు, నిర్ణయాలపై చర్చించేందుకు జెనీవాలో యురోపియన్ విదేశాంగ మంత్రులు ఇరాన్ విదేశాంగ మంత్రితో చర్చలు జరుపుతున్నారు. బ్రిటీష్ విదేశాంగమంత్రి డేవిడ్ లామీ జర్మనీ, ఫ్రాన్స్ విదేశాంగ మంత్రులతో కలిసి ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్‌తో భేటీ అయ్యారు. రాబోయే రెండు వారాల్లో దౌత్య పరిష్కారాన్ని కనుగొనడానికే ఈ ప్రయత్నాలన్నీ అని డేవిడ్ వ్యాఖ్యానించారు.

ఇజ్రాయిల్‌వి యుద్ధ నేరాలే : ఇరాన్

ఇజ్రాయిల్ యుద్ధనేరాలకు పాల్పడుతోందని ఇరాన్ మంత్రి అబ్బాస్ విమర్శించారు. ఇప్పటికే జెనీవా వెళ్లిన ఆయన అక్కడ మానవ హక్కుల మండలి సమావేశంలో మాట్లాడారు. ఐక్యరాజ్య సమితి నిబంధనావళిలో ఆర్టికల్ 2ను ఉల్లంఘించి ఇజ్రాయిల్ ఎలాంటి కవ్వింపు చర్యలు లేకుండానే, అత్యంత ఆటవికంగా దాడులకు, దూకుడు చర్యలకు పాల్పడిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవన్నీ యుద్ధ నేరాలేనని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్ ఆ దాడులను సమర్ధవంతంగా తిప్పికొడుతోందని చెప్పారు. విధుల్లో లేని సైనిక సిబ్బంది, సామాన్య పౌరులపై కూడా అత్యంత విచక్షణారహితంగా దాడులు జరపడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. టికే యుద్ధం జరుగుతున్నందున ఇక అమెరికాతో అణు చర్చలు జరిపేది లేదని తేల్చి చెప్పారు. ఈ యుద్ధం ఆగనంత కాలం అమెరికాతో చర్చలు జరగవని స్పష్టం చేశారు. దౌత్యానికి, చర్చలకు తావు లేదని అన్నారు. ఇజ్రాయిల్‌ను ఇరాన్ ప్రతిఘటిస్తోంది. ఇజ్రాయిల్‌లోని బీర్షబన్ ప్రాంతంలో ఇరాన్ జరిపిన క్షిపణి దాడుల్లో పలు భవనాలు నేలమట్టమయ్యాయి.

భారత్‌కు మరో మూడు విమానాలు

7

ప్రభుత్వరంగంలోనే విశాఖ స్టీల్

- ఆ విధంగా ప్రధానితో చంద్రబాబు, పవన్ ప్రకటన చేయించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్

- యోగా పేరుతో ప్రజలను మోసగించొద్దు
- తిండి, ఉపాధి, గూడుతోనే మానసిక ప్రశాంతత
- గిరిజన ప్రాంత నిరుద్యోగులకు కూటమి సర్కార్ మోసం
- పాఠశాలల కుదింపుతో విద్యావ్యవస్థ కుదేలు



యోగాంధ్రకు సంబంధించి వాట్సాప్‌లో వచ్చిన మెసేజ్‌ను మీడియాకు చూపిస్తున్న వి శ్రీనివాసరావు, చిత్రంలో డి రమాదేవి, బలరాం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాష్ట్రానికి వస్తున్న ప్రధాని మోడీతో మాట్లాడి విశాఖ స్టీలు ప్లాంటు ప్రభుత్వరంగంలో కొనసాగించేలా ప్రకటన చేయించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. యోగా పేరుతో రాష్ట్ర ప్రజలను మోసగించొద్దన్నారు. శుక్రవారం విజయవాడలోని బాలోత్సవభవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరామ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రెండు రోజులుపాటు పార్టీ రాష్ట్ర కమిటీ, రెండురోజులు పార్టీ రాష్ట్ర విస్తృత సమావేశం జరిగాయని పేర్కొన్నారు. వీటిల్లో ప్రస్తుత పరిస్థితులపై చర్చించి భవిష్యత్ కర్తవ్యాలు, ఆందోళనా కార్యక్రమాలు రూపొందించడంతోపాటు పలు తీర్మానాలు చేసినట్లు తెలిపారు. ప్రధాని రాష్ట్రానికి వస్తున్న నేపథ్యంలో ఇక్కడ ఉన్న సమస్యలను ముఖ్యమంత్రి ఆయన దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ముఖ్యంగా విశాఖ స్టీలు ఫ్యాక్టరీ ప్రభుత్వ రంగంలో ఉంటుందా, ప్రైవేటు రంగంలోకి పోతుందా అనే అనుమానాలు పెద్దఎత్తున ఉన్నాయని తెలిపారు. స్టీలు ప్లాంటుకు కేంద్రం కేటాయించిన రూ.11,400 కోట్లు జీతాలకుగానీ, యంత్రాలకుగానీ, ముడిసరుకుగానీ వాడొద్దని ఆంక్ష పెట్టారని, ఇంతకంటే అన్యాయం మరొకటి లేదని అన్నారు. రూ.500 కోట్లు జిఎస్‌టి, రూ.9346 కోట్లు అప్పులకు పోను రూ.1594 కోట్లు మాత్రమే మిగులుతాయని తెలిపారు. ప్యాకేజీ ఇచ్చామని అబద్దాలు చెప్పారని, 5000 మంది కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించి రోడ్డున పడేశారని అన్నారు. బిజెపి, టిడిపి, జనసేన ప్యాకేజీ

మిగతా 7లో



యోగాంధ్ర కార్యక్రమం నేపథ్యంలో విశాఖలోని ఆంధ్ర కళాపరిషత్‌లోని ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో శుక్రవారం సాయంత్రం సూర్యనమస్కారాలు చేస్తున్న గిరిజన విద్యార్థులు. 25 వేల మంది పైగా పాల్గొన్న ఈ కార్యక్రమం గిన్నీస్‌బుస్ రికార్డులకెక్కింది. వార్త 2లో

'యోగాంధ్ర'కు సర్వం సిద్ధం

- విశాఖకు చేరుకున్న ప్రధాని
- 3 లక్షల మందితో యోగాసనాలు
- 11 యుద్ధ నౌకలపై నావికాదళ విన్యాసాలు
- పటిష్ట ఏర్పాట్లు చేసినట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన



విశాఖ చేరుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి స్వాగతం పలుకుతున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

యోగాలో గిన్నిస్ రికార్డు నెలకొల్పడమే లక్ష్యంగా తలపెట్టిన యోగాంధ్ర వేడుకకు విశాఖ సిద్ధమైంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కారక్రమంలో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ శుక్రవారం రాత్రే విశాఖకు చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ తదితరులు స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి ఐఎన్ఎస్ డేగాకు చేరుకున్న ఆయన అక్కడి నుండి నేరుగా నౌకాదళ అతిథిగృహానికి వెళ్లారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం ఆర్‌కె బీచ్‌లో నిర్వహించే యోగసనాల్లో ప్రధాని పాల్గొంటారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల నుండి విస్తృతంగా కసరత్తు చేస్తోంది. యోగాసనాల్లో పాల్గొనే వారి కోసం తీరం వెంబడి రహదారిపై గ్రీన్ కార్పెట్లు పరిచింది. శనివారం తెల్లవారుజాము రెండు గంటల నుంచే ఆర్‌కె బీచ్‌లోని కాళీమాతా టెంపుల్ నుంచి భీమిలి, భోగాపురం తీరం వరకూ జనాలను కంపార్టుమెంట్లలో ఉంచేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే దేశ ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబులతో కూడిన యోగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. 'వన్ ఎర్త్ అండ్ వన్ హెల్త్' స్లోగన్‌తో అవి రూపుదిద్దుకున్నాయి.

11వ యోగా దినోత్సవానికి గుర్తుగా 11 యుద్ధనౌకలు

11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి గుర్తుగా సాగర తీరంలో ప్రధాని మోడీ, ఏపి గవర్నర్, సిఎం, డిప్యూటీ సిఎం ఆశీనులయ్యే సభా వేదికకు ఎదురుగా ఆర్‌కె బీచ్‌లో

మిగతా 7లో

యోగా పేరుతో 3,200 బస్సులు తరలింపు

- ప్రయాణికుల అవస్థలు
- బస్టాండుల్లో గంటల తరబడి నిరీక్షణ

2

ఆయేషా హత్యపై సిబిఐ దర్యాప్తు పూర్తి

- సీల్డ్ కవర్‌లో హైకోర్టుకు నివేదిక

2

విద్యుత్తు బస్సుల ముసుగులో ప్రైవేటుకు ఆర్‌టిసి స్థలాలు!

- తాజాగా 19 డిపోల్లో 950 బస్సులకు ప్రతిపాదనలు
- గుంటూరు నిర్వహణ బాధ్యతలకు ముందుకొచ్చిన ఓ మంత్రి?



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు బస్సులు (పిఎం ఇ-బస్ సేవ స్కీమ్) అమలు ద్వారా ఆర్‌టిసి స్థలాలను ప్రైవేటుకు అప్పగించేందుకు రంగం సిద్ధం చేసింది. విశ్వసనీయ సమాచారం మేరకు గుంటూరు, విజయవాడ డిపోలకు సంబంధించి విద్యుత్తు బస్సుల నిర్వహణను తీసుకునేందుకు ఓ ప్రజాప్రతినిధి ముందుకొచ్చినట్లు తెలిసింది. తొలి విడతలో ప్రవేశపెట్టనున్న విద్యుత్తు బస్సుల కాంట్రాక్టును కన్వర్షన్ ఎనర్జీ సర్వీసెస్ లిమిటెడ్ (సిఇఎస్ఎల్), విద్యుత్తు మంత్రిత్వశాఖ, గోల్ ఆధ్వర్యంలో టెండర్లు పిలిచి ఖరారు చేసినట్లు సమాచారం. ఈ కాంట్రాక్టును పుణెకు చెందిన ఓ కాంట్రాక్టు సంస్థ దక్కించుకున్నట్లు సమాచారం. విశాఖ, తిరుపతి నగరాల్లో కూడా నిర్వహణ బాధ్యతలను తీసుకునేందుకు కార్పొరేట్లు, ప్రజాప్రతినిధులు, ఎన్ఆర్ఐలు, ముందుకొస్తున్నట్లు సమాచారం. విద్యుత్తు బస్సుల నిర్వహణ ముసుగులో ఆర్‌టిసి స్థలాలు, ఆర్‌టిసి భవనాలను ప్రైవేటు వ్యక్తులకు నామమాత్రపు లీజుతో కట్టబెట్టే యోచన ప్రభుత్వం చేస్తున్నట్లు తెలిసింది. స్థలాలకు మంచి గిరాకీ ఉండటంతో నిర్వహణ బాధ్యతలను దక్కించుకునేందుకు పెట్టుబడి సంస్థలు ఆసక్తి చూపడం వెనుక ఇదే మతలబు అనే ప్రచారం నడుస్తోంది. పిఎం-ఇ బస్ సేవ స్కీమ్ కింద తొలి విడతలో రాష్ట్రానికి 750 బస్సులు రానుండగా, తాజాగా మరో 950 బస్సులకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆర్‌టిసి యాజమాన్యం సిటిఎం(ఒ), సిసిఇ అండ్ సిఇ (ఐటి)కి ఉత్తర్వులు జారీ చేసింది.

కొత్తగా 950 బస్సులకు ప్రతిపాదనలు

19 ఆర్‌టిసి డిపోల్లో విద్యుత్తు బస్సులను ప్రవేశపెట్టేందుకు వీలైనంత త్వరగా ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్‌టిసి అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ప్రతిపాదనలు తయారు చేసే డిపోల్లో 950 బస్సులను ఒక్కో డిపోకు 50 సర్వీసుల వంతున ఆర్‌టిసి కేటాయిస్తోంది. నూతన జాబితాలో శ్రీకాకుళం, విజయనగరం, ఏలూరు, మచిలీపట్నం, ఒంగోలు, చిత్తూరు, భీమవరం, గన్నవరం, చీరాల, నరసరావుపేట, మదనపల్లి-1, నంద్యాల, పుట్టపర్తి, కదిరి, ప్రొద్దుటూరు, వాల్తేరు, రాజమండ్రి, ఇబ్రహీంపట్నం, కర్నూలు డిపోలు ఉన్నాయి. ఆయా డిపోల్లో విద్యుత్తు బస్సుల నిర్వహణకు సంబంధించి సివిల్ ఇంజినీరింగ్, ఐటి అండ్ ఒఎపిడి డిపార్టుమెంట్లు డేటా తయారుచేసి

మిగతా 7లో

5 రోజుల పని విధానం పొడిగింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయాలు, రాజధాని అమరావతిలోని ఇతర రాష్ట్రస్థాయి ప్రభుత్వ కార్యాలయాల్లో వారానికి 5 రోజుల పని విధానాన్ని మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 26 నుంచి వారానికి 5 రోజులు పని విధానాన్ని మరో ఏడాది పాటు పొడిగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదేవిధంగా ప్రతిరోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకూ ఆయా కార్యాలయాలు పని చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సచివాలయంలోని అన్ని శాఖలు, విభాగాధిపతులు, ఇతర సంస్థలు ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎడ్‌సెట్ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న విసి గంగాధరరావు, కన్వీనర్ ఎ.వి.వి.ఎస్.స్వామి తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రవ్యాప్తంగా వివిధ కళాశాలలో బిఇడి కోర్సుల్లో ప్రవేశం కొరకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల ఐదున నిర్వహించిన ఎడ్‌సెట్ -2025 ప్రవేశ పరీక్ష ఫలితాలను ఎడ్‌సెట్-2025 చైర్మన్, వైస్ ఛాన్సలర్ కె.గంగాధర్ రావు శుక్రవారం విడుదల చేశారు. ఈ పరీక్షకు మొత్తం 17,795 మంది దరఖాస్తు చేసుకోగా, 14,612 మంది పరీక్షలు హాజరయ్యారు. వీరిలో 14,527 మంది ఉత్తీర్ణత సాధించారు. 99.42 శాతం ఉత్తీర్ణత తోపాటు ప్రవేశం కొరకు అర్హత సాధించారని మీడియాకు గంగాధరరావు తెలిపారు. ఎపి ఎడ్‌సెట్ కన్వీనర్ ఎ.వి.వి.ఎస్.స్వామి మాట్లాడుతూ.. మ్యాథమెటిక్స్ మెథడాలజీ పరీక్షకు 5192 మంది దరఖాస్తు చేసుకోగా 4165 మంది హాజరయ్యారని, వీరిలో 4160 మంది అర్హత సాధించారు. ఫిజికల్ సైన్స్ మెథడాలజీలో 2050 మంది దరఖాస్తు చేసుకోగా 1654 మంది పరీక్షకు హాజరు కాగా 1651 మంది అర్హత సాధించారు. బయలాజికల్ సైన్స్ మెథడాలజీలో 4322 మంది దరఖాస్తు చేసుకోగా 3631 మంది హాజరు కాగా 3602 మంది అర్హత సాధించారు. సోషల్ స్టడీస్ మెథడాలజీకి 5418 మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో 4499 మంది పరీక్షకు హాజరు కాగా 4451 మంది ప్రవేశం కొరకు అర్హత పొందారు. రి

ఇంగ్లీష్ మెథడాలజీకి 813 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో పరీక్షకు హాజరైన 663 మంది సంపూర్ణ ఉత్తీర్ణతను సాధించారని తెలిపారు. ఎడ్‌సెట్ ఫలితాలు, ర్యాంక్ కార్డుల కోసం వెబ్ సైట్ https://cets.apsche.ap.gov.in నుండి పొందవచ్చని తెలిపారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ఆచార్య కె. రత్నషీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, ఆచార్య తులసీదాస్, డాక్టర్ వి సుభాషిని, డాక్టర్ శశిధర్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణంరాజును వెలగపూడికి తీసుకెళ్తున్న పోలీసులు

పోలీసుల కస్టడీకి కృష్ణంరాజు

- మూడ్రోజులపాటు వెలగపూడిలో విచారణ

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

అమరావతి రాజధాని, మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో గుంటూరు జిల్లా జైలులో ఉన్న వివిఆర్ కృష్ణంరాజును పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. మూడురోజులపాటు వెలగపూడిలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో విచారించనున్నారు. తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌కు కృష్ణంరాజును తీసుకువస్తే రాజధాని మహిళా రైతులు, రైతులు, రైతు కార్మికుల నుంచి తీవ్ర ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని, తద్వారా పలు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని, అందుకే వెలగపూడికి తరలించామని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

2024 సార్వత్రిక ఎన్నికల ఖర్చులో 45 శాతం బిజెపిదే

- ఎడిఆర్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ : 2024 సార్వత్రిక ఎన్నికల్లో దేశంలోనే అత్యధిక నిధులను బిజెపి ఖర్చు చేసింది. దేశంలోని అన్ని పార్టీలు చేసిన మొత్తం ఖర్చులో 45 శాతం నిధులను ఆ పార్టీ వ్యయం చేసినట్లు అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) తెలిపింది. ఈ ఎన్నికల కోసం బిజెపి సుమారు రూ.1,494 కోట్లు ఖర్చు చేసిందని, మొత్తం ఎన్నికల వ్యయంలో ఇది 44.56 శాతమని వివరించింది. కాంగ్రెస్ రెండో స్థానంలో నిలిచిందని, ఈ ఎన్నికల కోసం కాంగ్రెస్ రూ.620 కోట్లు ఖర్చు చేయగా, మొత్తం వ్యయంలో 18.5 శాతమని తెలిపింది. 32 జాతీయ, ప్రాంతీయ పార్టీల రికార్డులను విశ్లేషించి ఈ నివేదికను రూపొందించినట్లు వివరించింది. 2024 మార్చి 16 నుండి జూన్ 6 వరకు నిర్వహించిన లోక్‌సభ ఎన్నికలు, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కింలలో అసెంబ్లీ ఎన్నికల కోసం వివిధ పార్టీలు మొత్తంగా రూ.3,352.81కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపింది. ఈ ఖర్చులో జాతీయ పార్టీల వాటా రూ.2,204 కోట్లు (65.75శాతం). మొత్తం నిధులలో.. జాతీయ పార్టీలు రూ.6,930.246 కోట్లు (93.08శాతం) సేకరించగా, ప్రాంతీయ పార్టీలు రూ.515.32 కోట్లు (6.92శాతం) సేకరించాయని నివేదిక పేర్కొంది. సార్వత్రిక ఎన్నికలు జరిగిన 90 రోజుల లోపు, అసెంబ్లీ ఎన్నికలు జరిగిన 75 రోజులలోపు రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్ (ఇసి)కి వ్యయ నివేదికలను దాఖలు చేయాల్సి వుంటుంది. ఈ నివేదికలను విశ్లేషించి నివేదికను రూపొందించినట్లు ఎడిఆర్ తెలిపింది. నివేదిక సమర్పణలో తీవ్రమైన జాప్యం జరిగినట్లు ఎడిఆర్ గుర్తించింది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) 168 రోజుల ఆలస్యంగా, బిజెపి 139 రోజుల ఆలస్యంగా నివేదికలను దాఖలు చేసినట్లు తెలిపింది.

ప్రచారానికే అధిక ఖర్చు

పార్టీలు ప్రకటించిన మొత్తం వ్యయంలో రూ.2,008 కోట్లు లేదా 53 శాతం కంటే ఎక్కువ మొత్తం ప్రచారానికే ఖర్చు చేసినట్లు నివేదిక తెలిపింది. తరువాతి స్థానంలో ప్రయాణ ఖర్చులు రూ.795 కోట్లు, అభ్యర్థులకు ఏకమొత్తం అందించినవి రూ.402 కోట్లు, పార్టీలు వర్చువల్ ప్రచారాల కోసం రూ.132 కోట్లకు పైగా ఖర్చు చేశాయి. నేరచరిత్రలను ప్రచురించడం కోసం రూ.28 కోట్లు వెచ్చించాయి. 32 రాజకీయ పార్టీలు ప్రచారం కోసం చేసిన మొత్తం ఖర్చులో, జాతీయ పార్టీలు రూ.1,511కోట్లు లేదా 75.25 శాతం ఖర్చు చేయగా, ప్రాంతీయ పార్టీలు రూ.496.99 కోట్లు లేదా 24.75శాతం ఖర్చు చేశాయి.

స్టార్ క్యాంపెయినర్లకు భారీగా ప్రయాణ ఖర్చులు

ప్రయాణ ఖర్చులుగా రూ.795 కోట్లు చూపగా, అందులో రూ.765 కోట్లు (96.22 శాతం) స్టార్ క్యాంపెయినర్ల కోసమే ఖర్చు చేశారు. ఇతర నాయకుల కోసం రూ.30 కోట్లు మాత్రమే ఖర్చయింది. నివేదికను తయారు చేసినప్పుడు ఎన్‌సిపి, జెఎంఎం, శివసేన (యుబిటి)సహా 21 పార్టీల వివరాలు ఇసి వెబ్‌సైట్‌లో అందుబాట్లో లేవని ఎడిఆర్ పేర్కొంది. అవకాశమున్న ప్రతి చోటా ఖర్చును చెక్కులు లేదా డిడిలు లేదా ఆర్‌టిజిఎస్ ద్వారా లావాదేవీలకు పరిమితం చేయాలని ఎన్నికల కమిషన్‌ను ఎడిఆర్ కోరింది. అభ్యర్థుల మాదిరిగానే, పార్టీల ఖర్చులను కూడా పర్యవేక్షించేందుకు పరిశీలకులను నియమించాలని విజ్ఞప్తి చేసింది.



సూర్య నమస్కారాలు చేస్తున్న గిరిజన విద్యార్థులు

108 నిమిషాల్లో 108 సూర్య నమస్కారాలు

- 25 వేల మంది గిరిజన విద్యార్థులతో కార్యక్రమం
- గిన్నిస్ రికార్డుగా పేర్కొన్న మంత్రి లోకేష్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

యోగాంధ్రలో భాగంగా విశాఖలోని ఎయు ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో అల్లూరి జిల్లాకు చెందిన 25 వేల మంది గిరిజన విద్యార్థులు ఒకేసారి సూర్య నమస్కారాలు చేశారు. 108 నిమిషాల్లో 108 సూర్య నమస్కారాలు చేసి గిన్నిస్ రికార్డు నెలకొల్పినట్టు మంత్రి లోకేష్ తెలిపారు. ఆ విషయాన్ని శనివారం అధికారికంగా ప్రకటించనున్నారన్నారు. విద్యార్థుల సూర్య నమస్కార కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. యావత్తు దేశం నేడు విశాఖ వైపు చూస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ దేశాన్ని, రాష్ట్రాన్ని, గ్రామాన్ని, కుటుంబాన్ని మార్చాలనే కలలు కని, వాటిని నెరవేర్చుకునేందుకు కష్టపడాలన్నారు. జూన్ 21 తర్వాత అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వారానికి ఒకరోజు యోగా చేసేలా ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఆంధ్రుల కోరికలన్నీ ప్రధాని తీరుస్తున్నారన్నారు. విశాఖకు రైల్వే జోన్ ఇచ్చారని, ప్రజా రాజధాని అమరావతి పనులు ప్రారంభించారని, ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం ఎన్‌టిపిసి లాంటి సంస్థలు ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఆయూష్ శాఖ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్, రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపి సిఎం రమేష్, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, సిఎస్ విజయానంద్, యోగాంధ్ర నోడల్ అధికారి ఎమ్‌.టి.కృష్ణబాబు, అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ పాల్గొన్నారు.

సిఆర్‌టిల కాంట్రాక్టు పునరుద్ధరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీ పోస్టుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్ (సిఆర్‌టి) సర్వీసును పునరుద్ధరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీ పోస్టుల్లో పనిచేస్తున్న 1,268 మంది సిఆర్‌టిల కాంట్రాక్టును ఈ నెల ఒకటి నుంచి 2026 ఏప్రిల్ 30 వరకూ 11 నెలల పాటు పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు. గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ అందించిన ప్రతిపాదనలను పరిశీలించి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఒక నెల బ్రేక్ కాలంలో ఎటువంటి పని ఉండదని, జీతం చెల్లించడం జరగదని పేర్కొన్నారు.

ఎపిఎస్‌ఎంఎస్‌పిఎల్‌కు డైరెక్టర్ల నియామకం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేయస్తున్న ఎపి స్టేట్ మెగా సీడ్ పార్క్ లిమిటెడ్‌కు (ఎపిఎస్‌ఎంఎస్‌పిఎల్) కొత్త డైరెక్టర్లతో కూడిన బోర్డును రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు వ్యవసాయశాఖ ఎక్స్‌అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.
ఎపిఎస్‌ఎంఎస్‌పిఎల్‌కు ఎక్స్ అఫిషియో సభ్యులుగా, డైరెక్టర్ కమ్ ఛైర్మన్‌గా వ్యవసాయశాఖ ఎక్స్‌అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్, విసి అండ్ ఎమ్‌డిగా వ్యవసాయశాఖ కమిషనర్ ఎస్ ఢిల్లీరావు, ఎక్స్‌అఫిషియో మెంబర్ కమ్ డైరెక్టర్లుగా ఆర్థికశాఖ కార్యదర్శి డి రోనాల్డ్ రోస్, ఆచార్య ఎన్‌జి రంగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆర్ శారదా జయలక్ష్మీదేవి, వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కురుబ గోపాల్, ఉద్యానశాఖ కమిషనర్ కె శ్రీనివాసులు, విసి అండ్ ఎమ్‌డిగా ఎపి సీడ్స్ కార్పొరేషన్ ఎస్ ఢిల్లీరావు, కన్వీనర్ అండ్ సిఇఒగా వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావును నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

- డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అసాంఘిక శక్తులపై పోలీసులు ఉక్కుపాదం మోపడంతో పాటు కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం దిశా నిర్దేశం చేసిందని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. అప్రజాస్వామిక ధోరణిలో మాట్లాడేవారిని ప్రజలు ఓ కంట కనిపెట్టాలన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సినిమాల్లో చెప్పే డైలాగులు సినిమా హాలు వరకే బాగుంటాయని, వాటిని ఆచరణలో పెడతాం, ఆ డైలాగులకు అనుగుణంగా ప్రవర్తిస్తామంటే ప్రజాస్వామ్యంలో సాధ్యం కాదన్నారు. ఎవరైనా చట్టం, నియమ నిబంధనలను పాటించాల్సిందేనని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించదని, అలాంటి వారిపై రౌడీ షీట్లు తెరిచి, అసాంఘిక శక్తులను అదుపు చేస్తామని అన్నారు. అసాంఘిక శక్తులకు మద్దతుగా మాట్లాడటం కూడా నేరమే అని మరిచిపోవద్దన్నారు.

రాజు వ్యాఖ్యల కేసులో సాక్షి టివికి ఊరట

ప్రజాశక్తి-అమరావతి

రాజధాని అమరావతిపై జర్నలిస్టు వివిఆర్ కృష్ణంరాజు చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో పోలీసులు పెట్టిన కేసులో సాక్షి టివి యాజమాన్యానికి శుక్రవారం హైకోర్టులో ఊరట లభించింది. సాక్షి టివి యాజమాన్యంపై తుళ్లూరు పోలీసులు నమోదు చేసిన కేసులో తదుపరి చర్యలన్నింటినీ హైకోర్టు నిలిపివేసింది.. ఫిర్యాదుదారు అయిన టిడిపి నేత కంభంపాటి శిరీష కౌంటర్ దాఖలు చేయాలని నోటీసు ఇచ్చింది. విచారణను జులై 24కు వాయిదా వేస్తూ జస్టిస్ నూనెపల్లి హరినాథ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్యానలిస్ట్ వ్యాఖ్యలు చేస్తే సాక్షి టివిపై కేసు నమోదు చేయడం చట్ట వ్యతిరేకమంటూ సాక్షి టివి హోల్ టైం డైరెక్టర్ బి రమణారెడ్డి వేసిన పిటిషన్‌లో ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను, ఫిర్యాదుదారును హైకోర్టు ఆదేశించింది.

యోగా పేరుతో 3,200 బస్సులు తరలింపు

- ప్రయాణికుల అవస్థలు
- బస్టాండుల్లో గంటల తరబడి నిరీక్షణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖపట్నంలో శనివారం నిర్వహించనున్న యోగా కార్యక్రమానికి ప్రభుత్వం 3,200 ఆర్‌టిసి బస్సులను కేటాయించింది. బస్సులన్నీ శుక్రవారం ఆయా డిపోల నుంచి బయలుదేరి ప్రభుత్వం కేటాయించిన జిల్లాలకు చేరిపోయాయి. దీంతో బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. అత్యంత రద్దీగా ఉండే విజయవాడ వంటి బస్టాండుల్లోనూ బస్సులు లేక ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరేందుకు గంటల తరబడి వేచి ఉంటున్నారు. ఆర్‌టిసి బస్సులు సరిపడినన్ని లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10,700 ఆర్‌టిసి బస్సులు ఉండగా, అందులో దాదాపు 30 శాతం బస్సులను వివిధ డిపోల నుంచి విశాఖకు తరలించారు. జిల్లాల వారీ శ్రీకాకుళానికి 150, విజయనగరం 200, అనకాపల్లికి 200, అల్లూరి సీతారామరాజు జిల్లాకు 500, విశాఖపట్నానికి 2,150 బస్సులను ప్రభుత్వం కేటాయించింది. ఆయా డిపోలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలు డిపోల నుంచి బస్సులను సర్దుబాటు చేశారు. విజయవాడ (జోన్-1) పరిధిలోని కాకినాడ డిపో నుంచి 145, తూర్పుగోదావరి నుంచి 160, అంబేద్కర్ కోనసీమ 160, పశ్చిమ గోదావరి 185, ఏలూరు 170, కృష్ణా, 250, ఎన్‌టిఆర్ 350 బస్సులను విశాఖ యోగాకు ప్రజలను తరలించేందుకు కేటాయించింది. ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి ఎఎస్‌ఆర్ జిల్లాకు 50 బస్సులను కేటాయించారు. మొత్తమ్మీద చూస్తే శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, ఎఎస్‌ఆర్, విశాఖపట్నం, అనకాపల్లి డిపోల నుంచి 1,195 బస్సులు, జోన్-1 నుంచి 1,445 బస్సులు, జోన్-2 నుంచి 420, జోన్-3 నుంచి 140 బస్సులను మొత్తం మీద 3,200 బస్సులను కేటాయించారు. యోగాకు వెళ్లిన బస్సులు శనివారం రాత్రికి ఆయా డిపోలకు చేరే అవకాశం ఉంది.

23న కలెక్టరేట్ల ఎదుట ఆందోళనలు

- ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు సంక్షేమ పథకాల అమలు, మినీ సెంటర్లు మెయిన్ సెంటర్లుగా మార్చాలని, వేతనాలను పెంచాలని, ఎఫ్‌ఆర్‌ఎస్ విధానం రద్దు కోరుతూ ఈ నెల 23న అన్ని జిల్లాల కలెక్టరేట్ల ఎదుట ఆందోళనలు చేస్తామని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ తెలిపింది. ఈ మేరకు మహిళా, శిశు సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శికి, యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి బేబిరాణి, కె సుబ్బరావమ్మ వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. అంగన్వాడీలందరూ పేద కుటుంబాలకు చెందిన వారని తెలిపారు. పేద గర్భిణి, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు సేవలందిస్తున్నారని చెప్పారు. అంగన్వాడీలకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగలేదన్నారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని గతంలోనే సర్క్యులర్ జారీ చేశారని చెప్పారు. మరోవైపు నెలకు రూ.12 వేల లోపు ఆదాయం ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలు, తల్లికి వందనం అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అంగన్వాడీ వర్కర్లకు నెలకు రూ.11,500, హెల్పర్లకు రూ.7 వేలు గౌరవ వేతనం మాత్రమే ఇస్తున్నారని, అయినప్పటికీ వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేసిన కారణంగా సంక్షేమ పథకాలు అందడం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ చేస్తే బెనిఫిట్స్ రావడం లేదని, రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేస్తే ప్రభుత్వ ఉద్యోగి అని తిరస్కరిస్తున్నారని తెలిపారు. లబ్ధిదారులకు ఎఫ్‌ఆర్‌ఎస్ అమలు చేయడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.

ఆరోగ్యాంధ్ర సాధనకు మద్యాన్ని కట్టడి చేయండి : జెవివి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రం మద్యాంధ్రగా మారిందని, దీనిని నిజమైన ఆరోగ్యాంధ్రగా మార్చాలని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మొదట మద్యాన్ని నియంత్రించాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు కనిపిస్తున్నాయని, హైస్కూల్ స్థాయిలోనే విద్యార్థులు తాగుడు, డ్రగ్స్, వ్యసనాలకు బానిసలవుతున్నారని వేదిక రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ గేయానంద్, కుర్రా రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వీటిని నిరోధించడం, ప్రభుత్వాల బాధ్యత అని, యోగా దినోత్సవం సందర్భంగానైనా మద్యాన్ని కట్టడి చేస్తామని ప్రకటించాలని కోరారు. లక్షలాది మందితో యోగా సమ్మేళనాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు, అందులో ప్రధాని మోడీ భాగస్వాములవుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. మరోవైపు ఆరోగ్యకరమైన, ప్రశాంతకరమైన జీవనానికి యోగా అవసరమని, పెద్దయెత్తున ప్రచారం చేస్తోందని తెలిపారు. అయితే, యోగా ఒక ప్రాచీన భారతీయ వ్యాయామ ప్రక్రియ అని, వ్యక్తులు తమ ఇష్టాలను అనుసరించి ఇటువంటివి ఆచరిస్తారని చెప్పారు. యోగాలో కొన్ని సమస్యలు కూడా ఉన్నాయని, కొన్ని యోగా వ్యాయామాలు చేసే సందర్భంలో శరీరంలో కండరాలు, కీళ్లు, వెన్నుముక, మెడ ఎముకలు దెబ్బతినే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారని పేర్కొన్నారు. కాబట్టి యోగాకు పరిమితులు ఉన్నాయనే విషయం అందరూ గ్రహించాలని జన విజ్ఞాన వేదిక విజ్ఞప్తి చేస్తోందన్నారు. ఆరోగ్యకరమైన జీవన శైలుల గురించి సైన్స్ అనేక విషయాలను చెబుతుందని, వాటన్నింటినీ కూడా, ఇదే స్ఫూర్తితో ప్రభుత్వం ప్రచారంలో పెట్టాల్సిన బాధ్యత ఉందన్నారు.

పర్యావరణం, సామాజిక రక్షణ పాటించండి

- రాజధాని నిర్మాణంలో కాంట్రాక్టర్లకు అవగాహన
- హాజరైన ప్రపంచబ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ బృందం



సదస్సులో మాట్లాడుతున్న సిఆర్‌డిఎ అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, వేదికపై ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంక్ బృందం

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

రాజధాని అమరావతి నిర్మాణంలో అమలు చేయాల్సిన పర్యావరణ, సామాజిక రక్షణ చర్యలు, కార్మికుల ఆరోగ్యం, భద్రత తదితర అంశాలపై కాంట్రాక్టర్లకు తుళ్లూరులోని హెచ్ఎస్ఆర్ కళ్యాణ మండపంలో ప్రపంచబ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ బందం అవగాహన సదస్సు నిర్వహించింది. రెండు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం అమరావతిలో పర్యటించింది. అవగాహన సదస్సులో అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ సిఎమ్‌డి డి.లక్ష్మీపార్థసారథి మాట్లాడుతూ.. అమరావతి అభివృద్ధి ప్రాజెక్టుల్లో భాగంగా పర్యావరణ, సామాజిక రక్షణ, కార్యకలాపాల అమలు, విధి విధానాలను కాంట్రాక్టర్లకు వివరించారు. సిఆర్‌డిఎ అడిషనల్ కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ మాట్లాడుతూ.. అమరావతి నిర్మాణ కార్యకలాపాల్లో పర్యావరణ పరిరక్షణ, కార్మికుల భద్రత, కార్మికులకు పని ప్రదేశంలో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను గురించి వివరించారు. లింగవివక్ష, బాలకార్మికులకు తావు లేకుండా రాజధాని అమరావతి నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. కాంట్రాక్టు సంస్థలు తమ కార్యకలాపాలను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని, స్థానికంగా విధుల్లో ఉన్న ప్రభుత్వ యంత్రాంగానికి కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు సహకరించాలన్నారు. సదస్సులో భాగంగా సిఆర్‌డిఎలోని పర్యావరణ, సామాజిక రక్షణ కచ్చితంగా పాటించాల్సిన అంశాలను వివరించారు. ప్రధానంగా గుత్తేదారులకు కార్మిక చట్టాలు, కార్మికుల భద్రత గురించి తెలియజేశారు. ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే సంబంధిత సంస్థలు, కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్మికుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యమివ్వాలని, అందుకు అవసరమైన భద్రతా పరికరాలు, అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పని ప్రదేశంలో మహిళల పట్ల లైంగిక వేధింపుల ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, వలస కార్మికులపై అధిక భారం వేసేలా వ్యవహరించకూడదని చెప్పారు. పనుల నిర్వహణలో పర్యావరణ పరిరక్షణ చర్యలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. నిర్మాణ సామగ్రి రవాణా సమయంలో మార్గమధ్యంలో ఉన్న గ్రామాలకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన సందర్భాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. నిర్మాణ వ్యర్థాలను తొలగించేందుకు అధికారులు అందించే ఎస్‌టిపిల ద్వారా ఏర్పాట్లు చేయాలని, పెయింట్లు, పెట్రోల్, డీజిల్ వంటి పదార్థాలను సురక్షితంగా నిల్వ చేసుకోవాలన్నారు. రక్షణ, భద్రతకు సంబంధించిన అన్ని అంశాలను కాంట్రాక్టు సంస్థలు, సంబంధిత ఏజెన్సీలు తప్పనిసరిగా పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించారు. నియమాలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన శిక్షలు అమలవుతాయని తెలియజేశారు. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంక్ బృందంలోని మహిళా ప్రతినిధి జయశర్మ మాట్లాడుతూ... కార్మికులపై లైంగిక దాడి, హింస తదితర ఘటనలు జరిగినప్పుడు పాటించాల్సిన గోప్యత, బాధితులకు అందించాల్సిన సహాయం తదితర అంశాలను వివరించారు. సదస్సులో సిఆర్‌డిఎ, ఎడిసిఎల్‌లోని పలు విభాగాల అధికారులు, కన్సల్టెంట్ సంస్థల ప్రతినిధులు, ఇతర క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియ బలోపేతానికి 23 కొత్త కార్యక్రమాలు

- 1,200 మంది ఓటర్లకే పోలింగ్ బూత్
- కేంద్ర ఎన్నికల సంఘం ఉప సంచాలకులు పవన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ) కొత్తగా 23 కార్యక్రమాలు చేపడుతుందని ఆ సంఘం ఉప సంచాలకులు పి పవన్ తెలిపారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ఆయన నూతన కార్యక్రమాలతో పాటు ఓటర్లు, రాజకీయ పార్టీలు, ఎన్నికల సిబ్బందికి కల్పిస్తున్న సదుపాయాలు వంటి వివరాలను విలేకరులకు వివరించారు. సుమారు 20 ఏళ్ల తరువాత ఉప ఎన్నికలకు ముందు ప్రత్యేక సార్వత్రిక నమోదు (ఎస్ఎస్ఆర్) కార్యక్రమాన్ని చేపడుతున్నామని చెప్పారు. ఓటర్ సమాచార స్లిప్‌లు మరింత ఉపయోగకరంగా మారనున్నాయని, సీరియల్ నెంబర్, పార్ట్ నెంబర్‌ను స్పష్టంగా చూపిస్తామని తెలిపారు. మరణాల నమోదుకు సంబంధించిన డేటాను ఆర్‌టిఐ డేటాబేస్ నుంచి సేకరించి ధ్రువీకరణ తర్వాత ఓటర్లు జాబితాలో మార్పులు చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రానికి గరిష్టంగా 1,200 ఓటర్లకే అనుమతి నిస్తామని, ఓటర్లకు మొబైల్ డిపాజిట్ సదుపాయాన్ని కల్పిస్తామన్నారు. అపార్టుమెంట్లు, కాలనీల్లో అదనపు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేస్తామని వివరించారు. రాజకీయ పార్టీలకు సంబంధించి ప్రచార దూర పరిమితి పోలింగ్ కేంద్ర ప్రవేశ ద్వారానికి 100 మీటర్లకు తగ్గించామని పేర్కొన్నారు. సిఇఒ, డిఇఒ, ఇఆర్ఒ స్థాయిలో దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలతో 4,710 సమావేశాలను నిర్వహించామని, 28 వేల మందికి పైగా ఆయా పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారని చెప్పారు. ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ (ఐఐఐడిఇఎం)లో బీహార్, తమిళనాడు, పుదుచ్చేరికి చెందిన బూత్ స్థాయి ఏజెంట్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఎన్నికల సంఘం ప్రక్రియాత్మక సంస్కరణల్లో భాగంగా ఓటర్ల ట్రెండ్ రిపోర్ట్ (విటిఆర్), ఇండెక్స్ కార్డులు, గణాంక నివేదికల డిజిటలైజేషన్ ద్వారా వేగవంతంగా వ్యాప్తిం చేస్తామన్నారు. ఇసిఐఎన్ఇటి అనే డాష్ బోర్డును ప్రారంభించి 40కి పైగా యాప్‌లు, వెబ్‌సైట్ల స్థానంలో ఒకే యాప్‌ను రూపొందించి అన్ని సేవలను ఒకేచోట ఒకే సమయంలో అందుబాటులోకి తెచ్చామన్నారు. యూనిక్ ఇపిఐసి నెంబర్ పద్ధతి అమలు ద్వారా నకిలీ ఇపిఐసి నెంబర్ల సమస్య పరిష్కరించామన్నారు. ఢిల్లీ ఐఐఐడిఇఎంలో 3 వేల మందికి పైగా బూత్‌స్థాయి సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించామని, రాబోయే కాలంలో లక్షలకు పైగా శిక్షణ ఇస్తామన్నారు. ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచడంలో మీడియా కీలక పాత్ర వహిస్తుందని చెప్పారు. ఓటర్లను చైతన్య పరచడంలో మీడియా ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల సంఘం జాయింట్ సిఇఒ ఎ వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ సిఇఒ పి తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

ఆయేషా హత్యపై సిబిఐ దర్యాప్తు పూర్తి

- సీల్డ్ కవర్‌లో హైకోర్టుకు నివేదిక

ప్రజాశక్తి-అమరావతి

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేకెత్తించిన బి ఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసులో సిబిఐ దర్యాప్తును పూర్తి చేసింది. దర్యాప్తు నివేదికను సీల్డ్ కవర్‌లో హైకోర్టుకు సిబిఐ నివేదించింది. ఈ నివేదికను విజయవాడ సిబిఐ కోర్టులో దాఖలు చేసేందుకు అనమతినివ్వాలన్న సిబిఐ వినతిని హైకోర్టు ఆమోదించింది. ఈ మేరకు జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు వెలువరించారు. సిబిఐ సీల్డ్ కవర్ నివేదికను తమకు ఇవ్వాలని ఆయేషా తల్లిదండ్రుల తరపున న్యాయవాదులు కోరగా, అందుకు నిరాకరించారు. నివేదిక కోసం కింది కోర్టును ఆశ్రయించాలని చెప్పారు.విజయవాడలోని ఓ కాలేజీలో బి-ఫార్మసీ చదివే ఆయేషా మీరా 2007 డిసెంబర్ 27న దారుణ హత్యకు గురయ్యారు. ఆ తర్వాత 9 నెలలకు పిడతల సత్యంబాబును పోలీసులు నిందితునిగా చేర్చారు. దీనిపై కింది కోర్టు సత్యంబాబు దోషి అని తేల్చుతూ 2010లో తీర్పు చెప్పింది. జీవితఖైదు విధించడాన్ని సత్యంబాబు సవాల్ చేసిన వ్యాజ్యాన్ని 2017లో హైకోర్టు అనుమతించింది. సత్యంబాబును నిర్దోషిగా ప్రకటించింది. అసలు హంతకులను తేల్చేందుకు సిబిఐ దర్యాప్తునకు ఆదేశించాలని పిల్ దాఖలైంది. దీనిపై హైకోర్టు 2018లో సిబిఐ దర్యాప్తునకు ఆదేశిస్తూ తీర్పు చెప్పింది. సిబిఐ దర్యాప్తును వేగవంతం చేసేలా ఆదేశాలివ్వాలని ఆయేషా తల్లిదండ్రులు 2023లో హైకోర్టును ఆశ్రయించారు. ఇదే కేసులో సిబిఐ పలుసార్లు దర్యాప్తునకు పిలుస్తోందంటూ సత్యంబాబు మరో పిల్ వేశారు. ఈ నేపథ్యంలో సిబిఐ దర్యాప్తును పూర్తి చేసి సీల్డ్ కవర్‌లో నివేదిక సమర్పించినట్లు సిబిఐ తరపున న్యాయవాది పిఎస్‌పి సురేష్ కుమార్ చెప్పారు. ఈ నివేదికపై కింది కోర్టులో విచారణ జరగనుంది.



యోగాసనాలు వేసి నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ.. యోగాతో నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన యోగా కార్యక్రమం చేపట్టారు. ఉదయం 7.30 నుండి 10.30 గంటల వరకు కార్మిక, ప్రజా సంఘాల నేతలు ఆసనాలు వేస్తూ నిరసన కొనసాగించారు. ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, అక్రమంగా తొలగించిన స్టీల్ కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని నినదించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు అమ్మకాన్ని ఆపుతున్నట్లు నరేంద్ర మోడీ యోగాంధ్రలో ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల్లో నాలుగు వేల మందిని అన్యాయంగా తొలగించడం దుర్మార్గమన్నారు. గంటపాటు జరిగే యోగా కార్యక్రమానికి వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని లూటీ చేయడం సరికాదన్నారు. జెఎసి కన్వీనర్ భోగవిల్లి నాగభూషణం మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను అమ్ముతామంటే రాష్ట్ర ప్రజలు చూస్తూ ఊరుకోరన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షులు ఎన్.కనకారావు, ఎపిఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి దేవా సహా డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా, పెన్షనర్ల సంఘం, మత్స్యకార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

'పోలవరం' నిర్వాసితులకు అత్యవసర ప్రాధాన్యత : సిపిఎం డిమాండ్

- విస్తృత సమావేశంలో పలు తీర్మానాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం నిర్వాసితుల పునరావాసానికి అత్యవసర ప్రాధాన్యత ఇవ్వాలని సిపిఎం విస్తృతస్థాయి సమావేశం డిమాండ్ చేసింది. విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 18,19 తేదీల్లో జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో చేసిన తీర్మానాలను ఆ పార్టీ రాష్ట్రకమిటీ శుక్రవారం విడుదల చేసింది. జులై-ఆగస్టులలో గోదావరికి వరదలు ముంచెత్తే ప్రమాదం దృష్ట్యా వెంటనే పునరావాస చర్యలు చేపట్టి నిర్వాసితులను ఆదుకోవాలని ఈ తీర్మానంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో నేతలు పలుమార్లు ప్రాజెక్టు పనులు పరిశీలిస్తున్నారని కానీ పునరావాస కల్పనకు స్పష్టమైన ప్రకటనలు, కార్యాచరణ లేదని పేర్కొంది. కేంద్రప్రభుత్వం పునరావాస కల్పన నుంచి తప్పించుకోవాలని చూస్తోందని విమర్శించింది. రాష్ట్రంలో దళితులు, చిన్న పిల్లలు, మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, హత్యలను రాష్ట్రప్రభుత్వం అరికట్టాలని తీర్మానించింది. ప్రతి ఏటా ప్రభుత్వ శాఖల్లో ఖాళీ అయ్యే పోస్టులతో కలిపి జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని తీర్మానించింది. 20లక్షల ఉద్యోగాలు కల్పించే వరకు నిరుద్యోగ భృతి అమలు చేయాలని డిమాండ్ చేసింది.

మరికొన్ని తీర్మానాలు

ప్రభుత్వ విద్యను కాపాడాలి

- గ్రామాల్లో బడులు మూసేయ్యవద్దని, ప్రభుత్వ విద్యను కాపాడాలని మరో తీర్మానంలో పేర్కొన్నారు
- వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిలుపుదల చేసి వాటిని ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేసింది.
- జివో 77ను రద్దు చేసి ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలని తీర్మానించింది.
- ఎలాంటి షరతులు లేకుండా అందరికీ తల్లికి వందనం అమలు చేసి రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేసింది.

ఏజెన్సీలో ఉద్యోగ, ఉపాధ్యాయ నియామకం చట్టం

- ఏజెన్సీలో వందశాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియామకం చట్టం చేయాలని తీర్మానించింది.
- జివో 3 స్థానంలో వెంటనే ఆర్డినెన్స్ తేవాలని తీర్మానించింది.

తక్షణమే అన్నదాతా..సుఖీభవ

- సూపర్ సిక్స్‌లో భాగంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అన్నదాతా .. సుఖీభవ పెట్టుబడి సాయం కింద కౌలు రైతు సహా ప్రతి రైతుకు రూ.20వేలు ఖాతాలో జమచేయాలని తీర్మానించింది.
- రాష్ట్రంలో రైతులు పండించిన పంటలకు మద్దతు ధరలు అమలు చేయాలని డిమాండ్ చేసింది.
- రైతుల ఆత్మహత్యలను నివారించాలని, ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేసియా ఇవ్వాలని తీర్మానించింది.
- నూతన కౌలు చట్టం తీసుకొచ్చి కౌలు రైతులకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేసింది.

వెనుకబడిన ప్రాంతాల సాగునీటికి ప్రాధాన్యత

- రాయలసీమ, ఉత్తరాంధ్ర వెనుకబడిన ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న నీటి ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని తీర్మానించింది.
- ఈ ప్రాజెక్టుల నిర్మాణం కోసం బడ్జెట్‌లో అరకొరగా నిధులు కేటాయించి విస్మరిస్తున్నారని విమర్శించింది.

కొల్లేరు 3వ కాంటూరుకు కుదించాలి

- కొల్లేరు, సరస్సుకు, ఎకో సెన్సిటివ్ జోన్‌తో సహా 3వ కాంటూరుకు కుదించాలని,
- 3వ కాంటూరు లోపల సరస్సును అభివృద్ధి చేసి పర్యావరణాన్ని పక్షుల్ని కాపాడాలని సమావేశం డిమాండ్ చేసింది.
- కాలుష్యమై, పర్యావరణం దెబ్బతినడానికి వందల ఏళ్లుగా స్థానికంగా జీవిస్తున్న ప్రజలే కారకులనుకోవడం అసంమంజసమని, కొల్లేరు ప్రజల జీవనోపాధిని దెబ్బతీసే చర్యలకు పూనుకోవడం గర్హనీయమని పేర్కొంది.

భూములు పంచాలి


- అన్ని రకాల ప్రభుత్వ భూములను సంపన్నుల ఆక్రమణ నుంచి స్వాధీనం చేసుకుని దళిత, గిరిజనుల కుటుంబాలకు రెండు ఎకరాలు చొప్పున పంచాలని సమావేశం డిమాండ్ చేసింది.
- పేదల రైతుల భూముల్ని, అసైన్డ్ భూములను ప్రభుత్వం కార్పొరేట్ల పరం చేస్తుందని, వారు పరిశ్రమలు పెట్టడం లేదని, ఉపాధి కల్పించడం లేదని పేర్కొంది.
- భూ పోరాటాల సందర్భంగా పేదలపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే రద్దు చేయాలి

ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చొద్దు

- ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ఈ పథకానికి కేంద్రప్రభుత్వం రూ.2లక్షల కోట్లు కేటాయించి అడిగిన ప్రతి వ్యక్తికి పని కల్పించాలని తీర్మానించింది.
- పట్టణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేసింది.
- చంద్రబాబు ప్రభుత్వం పౌర పంపిణీని ఎత్తివేసి నగదు బదిలీ పథకాన్ని అమలు చేసే ప్రయత్నానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చింది.

యువ రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-ఉరవకొండ


ఆంజనేయులు (ఫైల్)

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... ఆమిద్యాల గ్రామానికి చెందిన అంజనేయులు (22) కు ఐదు ఎకరాల పొలం ఉంది. కుటుంబ సభ్యులతో కలిసి వర్షాధార పంటల కింద వేరుశనగ, పప్పుశనగ పంటలు సాగు చేసేవారు. సాగు నిమిత్తం దాదాపు రూ.పది లక్షలు అప్పులు చేశారు. వర్షాభావం నేపథ్యంలో గడిచిన నాలుగు సంవత్సరాలుగా పంటలు చేతికందలేదు. దీంతో చేసిన అప్పులకు వడ్డీల భారం అధికమైంది. అప్పులు తీరే దారిలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయన్ను గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఉరవకొండ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు పరీక్షించిన వైద్యుడు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడిపై పోక్సో కేసు

ప్రజాశక్తి - గణపవరం (పశ్చిమగోదావరి జిల్లా)

అభం శుభం తెలియని తొమ్మిదేళ్ల చిన్నారిపై మద్యం మత్తులో అదే గ్రామానికి చెందిన రెడ్డి జయరాజు (52) అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన పశ్చిమగోదావరి జిల్లా గణపవరం మండలంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశవరం ఎస్‌సి పేటలోనిపంచాయతీ వద్ద ఆడుకుంటున్న చిన్నారికి తినుబండారాలు కొనిపెడతానని అదే ప్రాంతానికి చెందిన రెడ్డి జయరాజు మాయమాటలు చెప్పి తన ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో జయరాజు కుమారుడు చూసి పెద్దగా కేకలు వేస్తూ తండ్రి నుంచి చిన్నారిని బయటకుతీసుకొచ్చాడు. విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు నిందితుడిని గణపవరం పోలీసులకు అప్పగించారు. అత్యాచారయత్నానికి పాల్పడిన జయరాజు గతంలో కూడా ఇటువంటి అఘాయిత్యాలకు పాల్పడ్డాడని స్థానికులు తెలిపారు. చిన్నారిని వైద్య పరీక్షల నిమిత్తం పోలీసులు తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జయరాజుపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గణపవరం ఇన్‌ఛార్జ్ ఎస్ఐ భగవాన్ తెలిపారు.

బలవంతపు విలీనాన్ని ఆపండి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్
- పివిపురం పాఠశాల ఎదుట నిరసన

ప్రజాశక్తి - రామచంద్రాపురం (తిరుపతి జిల్లా)


పివిపురం పాఠశాల ఎదుట విద్యార్థులతో కలిసి ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్

స్కూల్ చైర్మన్‌కు తెలియకుండా బలవంతంగా పాఠశాలను విలీనం చేయడం ఏమిటని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్ ప్రశ్నించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం పివిపురం పాఠశాల ఎదుట స్కూలును విలీనం చేయొద్దంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు నిరసన తెలిపారు. 'మా స్కూలు మాకే కావాలి' అంటూ విద్యార్థులు ప్లకార్డులతో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రుల కమిటీ, గ్రామస్తుల అభిప్రాయాలను తీసుకోకుండా విలీన ప్రక్రియ చేపట్టడం దుర్మార్గమని అన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్ జయచంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్‌రవి మాట్లాడుతూ 40 మంది ఉన్న పివిపురం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులను 20 మంది విద్యార్థులు ఉన్న బలిజపల్లిలోని మోడల్ పాఠశాలకు మార్చడం ఏంటని ప్రశ్నించారు. ఒకటిన్నర కిలోమీటర్ దూరం చిన్నారులను పంపించడానికి తల్లిదండ్రులు ఏమాత్రం ఒప్పుకోవడం లేదన్నారు. విద్యాశాఖ అధికారుల ఆత్రుత వల్ల డ్రాపౌట్లు పెరిగే అవకాశం ఉందన్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గంలోనే ఈ పరిస్థితి నెలకొందన్నారు. ఇకనైనా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి విలీన ప్రక్రియ ఆపాలని, ప్రాథమిక పాఠశాలను కాపాడాలని, విద్యార్థులను బడికి దగ్గర చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అక్బర్, జిల్లా ఉపాధ్యక్షులు అశోక్, వినోద్, నాయకులు శివ, పాఠశాల కమిటి చైర్మన్ రామదాసురెడ్డి, మలిరెడ్డి పాల్గొన్నారు.

లాజిస్టిక్‌లో అగ్రగామిగా రాష్ట్రం

- మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)


మాట్లాడుతున్న మంత్రి బిసి.జనార్ధన్‌రెడ్డి

లాజిస్టిక్ రంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని, అందులో భాగంగానే ఆ రంగంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.20 వేల కోట్లను కేటాయించామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి అన్నారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సిఐఐ) ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం విశాఖలోని నోవాటల్ హోటల్ వేదికగా పోర్టులు, లాజిస్టిక్స్‌పై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రాన్ని దక్షిణాసియాలోనే లాజిస్టిక్ కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో విశాఖపట్నం ఓడరేవు ఒక్కటే 82.62 మిలియన్ టన్నులు ఎగుమతులు, దిగుమతులు చేపట్టిందన్నారు. కృష్ణపట్నం, గంగవరం కలిసి 54 మిలియన్ టన్నులకుపైగా ఎగుమతులు, దిగుమతులు నిర్వహించాయని తెలిపారు. ఇది బలమైన వృద్ధి, ప్రైవేటు భాగస్వామ్యానికి నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలో లాజిస్టిక్ వ్యవస్థ అభివృద్ధికి 1,040 కిలో మీటర్ల మేర రహదారులు, విసిఐసి రైలు మార్గం వంటి ప్రధాన కారిడార్ల ద్వారా కనెక్టివిటీని మెరుగు పరచడానికి ప్రయత్ని స్తున్నామన్నారు. అది సాకారమైతే లాజిస్టిక్ ఖర్చులను 15.7 శాతం నుంచి 7.8 శాతానికి తగ్గించడానికి వీలవుతుందని తెలిపారు. నెల్లూరులో రూ.26 వేల కోట్లతో దుగ్గరాజపట్నం షిప్ బిల్డింగ్ క్లస్టర్‌ను నిర్మిస్తున్నామని, తద్వారా 35 వేల మందికి ఉద్యోగావకాశాలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ డి.సత్యనారాయణ, విశాఖ పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు, సిఐఐ ఆంధ్రప్రదేశ్ పోర్ట్స్ అండ్ లాజిస్టిక్స్ ప్యానెల్ కన్వీనర్ డాక్టర్ జి.సాంబశివరావు, సిఐఐ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ జి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

జగన్ పర్యటనలను అడ్డుకునేందుకు కుట్ర

- మాజీ మంత్రి విడదల రజిని

ప్రజాశక్తి-చిలకలూరిపేట (పల్నాడు జిల్లా)

వైసిపి అధినేత జగన్ పర్యటనలను అడ్డుకునేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని మాజీ మంత్రి విడదల రజిని అన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని తన నివాసంలో శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. పోలీసుల వేధింపుల వల్ల చనిపోయిన వైసిపి నాయకులు నాగమల్లేశ్వరరావును పరామర్శించడానికి జగన్ వస్తుంటే దాన్ని విఫలం చేయడానికి టిడిపి కూటమి యత్నించిందని, వాహనాలు ఇవ్వొద్దంటూ ట్రావెల్స్ ఏజెన్సీలను టిడిపి నాయకులు బెదిరించారని, హోటళ్లు, పెట్రోల్ బంకులను మూసేయించారని ఆరోపించారు. పర్యటనలో మరణించిన వారి కుటుంబాలను పరామర్శించి, ఆర్థిక సాయాన్నీ అందించామని తెలిపారు. చంద్రబాబు గతంలో సిఎంగా ఉన్నప్పుడు గోదావరి పుష్కరాల సందర్భంగా తన ప్రచారయావతో 29 మందిని బలితీసుకున్నారని, ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఇరుకుసందుల్లో సభలు పెట్టి కందుకూరులో ఎనిమిది మందిని పొట్టనపెట్టుకున్నారని, గుంటూరులో చీరల పంపిణీ పేరుతో సాగిన సభలో ముగ్గురు మహిళల చనిపోయారని, తాజాగా తిరుపతిలో ప్రభుత్వ అసమర్థత వల్ల క్యూలైన్లలో ఆరుగురు యాత్రికులు చనిపోయారని, ఈ అన్ని కుటుంబాలకూ ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

మావోయిస్టు అరుణకు కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి - పెందుర్తి (విశాఖపట్నం)

అల్లూరి జిల్లా రంపచోడవరం ఏజెన్సీలో బుధవారం జరిగిన కాల్పుల్లో మృతిచెందిన మావోయిస్టు పార్టీ నాయకులు అరుణ అంత్యక్రియలు విశాఖ జిల్లా పెందుర్తి మండలంలోని ఆమె స్వగ్రామమైన కరకవానిపాలెంలో అశ్రు నయనాల నడుమ శుక్రవారం సాగాయి. అరుణను కడసారి చూసేందుకు పలు ప్రజా సంఘాల, పార్టీల, అమరవీరుల బంధు మిత్రుల సంఘం నాయకులు తరలివచ్చారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి, విశాఖ జిల్లా కార్యదర్శి షేక్ రెహమాన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం పైడిరాజు, పెందుర్తి ఏరియా కార్యదర్శి ఆర్ శ్రీనివాసరావు, ఎపి మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఎ విమల, సీనియర్ జర్నలిస్టు వేణుగోపాల్ తదితరులు అరుణ పార్థివ దేహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ బూటకపు ఎన్‌కౌంటర్లతో విప్లవాన్ని అడ్డుకోలేరని అన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే వారిని అంతమొందించడమే బిజెపి లక్ష్యంగా కనిపిస్తోందన్నారు. స్థానికులు మాట్లాడుతూ అరుణ కుటుంబంలోని వారంతా ఉద్యమంలో ఉండి ప్రజల కోసం పనిచేయడం తమకు గర్వంగా ఉందన్నారు. చిన్నప్పుడే ఉద్యమంలోకి వెళ్లిపోయి ఇలా అశువులు బాసి రావడం బాధాకరంగా ఉందని పేర్కొన్నారు.

ఏనుగుల నుంచి రక్షణ కల్పించండి

- ఎంపి ప్రసాదరావు

ప్రజాశక్తి - చిత్తూరు (యాదమరి)

ఏనుగుల బారి నుంచి రైతులకు రక్షణ కల్పించాలని అటవీ అధికారులను చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు ఆదేశించారు. చిత్తూరు పార్లమెంట్ పరిధిలో గజరాజులు బీభత్సం సృష్టిస్తున్న నేపథ్యంలో అన్నదాతకు కంటిమీద కునుకు లేకుండా పోయిందని, వారి ప్రాణాలకు భద్రత కరువయ్యిందని, పంట పొలాలను, ప్రజలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గజరాజుల బీభత్సం విషయాన్ని మీడియా ద్వారా తెలుసుకున్న చిత్తూరు ఎంపి శుక్రవారం ఢిల్లీ నుంచి స్పందించారు. ఏనుగుల బారినుంచి కాపాడేందుకు చర్యలు తీసుకుంటూనే ఉన్నా, ఏదో ఒకవైపు నుంచి పంటపొలాలపైకి వస్తూనే ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి సమస్యకు పరిష్కార మార్గాన్ని చూపేందుకు కృషి చేస్తానన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి పటిష్ట చర్యలు తీసుకోవాలని అటవీ శాఖను కోరారు.

విభజన హామీలపై మోడీ స్పష్టతనివ్వాలి : షర్మిల

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు విశాఖ వస్తున్న ప్రధాని మోడీ విభజన హామీలపై స్పష్టత ఇవ్వాలని పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల డిమాండ్ చేశారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఆమె శుక్రవారం పర్యటించారు. తొలుత విశాఖలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో షర్మిల మాట్లాడుతూ విభజన హామీలు అమలు కాకపోవడంతో రాష్ట్ర ప్రజల గుండెలు మండిపోతున్నాయన్నారు. ఏ మొహం పెట్టుకొని రాష్ట్రానికి వస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలను మోడీ మోసగిస్తున్నా చంద్రబాబు, పవన్ మద్దతు ఇస్తూనే ఉన్నారని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో ప్రధాని మాట తప్పారన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరిస్తున్నారని, ఇప్పటికే నాలుగు వేల మంది కాంట్రాక్టు కార్మికులను అన్యాయంగా తొలగించారని తెలిపారు. రాజధాని కడతామని అప్పులు ఇస్తున్నారని, అప్పులతో రాజధాని కట్టాల్సిన అవసరమేంటని ప్రశ్నించారు. ప్రజల సమస్యలు పట్టించుకోకుండా యోగాంధ్ర అవసరమా? అని నిలదీశారు. వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి రెచ్చగొట్టే విధంగా హింసాత్మక వ్యాఖ్యలు చేస్తున్నారని, ఇది ఎంత మాత్రమూ తగదన్నారు. ఆయనకు మోడీ మద్దతు ఉందని తెలిపారు. వివేకా హత్యనే కాకుండా అన్ని విషయాల్లోనూ ఈ మద్దతు స్పష్టమవుతోందని, అందుకే జగన్ ఏమి చేసినా చెల్లుతోందని అన్నారు. సమావేశంలో పిసిసి ప్రధాన కార్యదర్శి గాదం మహేష్, నాయకులు పాల్గొన్నారు.

భోగాపురం ప్రజాశక్తి విలేకరి మృతి

ప్రజాశక్తి-విజయనగరం


శంకరరావు (ఫైల్)

విజయనగరం జిల్లా భోగాపురం మండలం ప్రజాశక్తి విలేకరి నానుబాల శంకరరావు (40) శుక్రవారం మృతి చెందారు. భోగాపురానికి చెందిన శంకర్రావు మూడేళ్లగా ఆ మండల విలేకరిగా పని చేస్తున్నారు. బుధవారం రాత్రి బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. వెంటనే కుటుంబసభ్యులు విజయనగరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మరణించారు. ఆయనకు తల్లి శశమ్మ, భార్య కృష్ణవేణి, కుమార్తె సాత్విక, కుమారుడు నేహాంత్ ఉన్నారు. శంకరరావు మృతి పట్ల ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్, సిజిఎం అచ్చుతరావు, జిల్లా మేనేజర్ సిహెచ్ రాము, ప్రజాశక్తి సిబ్బంది సంతాపం తెలిపారు.

స్ట్రయిట్ కట్ కాలువ విషయంలో వివాదం

- మత్స్యకారుల ఆందోళన
- భూముల్లోకి ఎవరూ ప్రవేశించరాదని కలెక్టర్ ఆదేశాలు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా


మత్స్యకారులతో చర్చిస్తున్న బాపట్ల డిఎస్‌పి రామాంజనేయులు

బాపట్ల జిల్లా చీరాల-బాపట్ల సరిహద్దులోని వాడరేవు, విజయలక్ష్మీపురం గ్రామాల మధ్య ఉన్న ఈపురుపాలెం స్ట్రయిట్ కట్ కాలువ విషయమై రియల్ ఎస్టేట్ వ్యాపారి, మత్స్యకారుల మధ్య నెలకొన్న వివాదం శుక్రవారం ఉద్రిక్తత పరిస్థితులకు దారితీసింది. దీంతో బాపట్ల మండలం అడవి రెవెన్యూ పంచాయతీలోని సర్వేనెంబర్ 499-1,2 లోని 3.50 ఎకరాల వివాదాస్పద భూమిలోకి ఎవరూ ప్రవేశించరాదని జిల్లా కలెక్టర్ వెంకట మురళి ఆదేశాలు జారీ చేశారు. ఈ భూమిపై బిఎన్ఎస్ 163 యాక్ట్ అమలు చేశామని తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకూ అందులోకి ఎవరూ వెళ్లకూడదని పేర్కొన్నారు. దీనిపై సమగ్ర నివేదిక అందజేయాలని చీరాల, బాపట్ల ఆర్‌డిఓలను కలెక్టర్ ఆదేశించారు. బాపట్ల జిల్లా పరిధిలోని చీరాల మండలం వాడరేవు, విజయలక్ష్మీపురం గ్రామాల మధ్య ఈపురుపాలెం స్ట్రయిట్ కట్ కాలువ ఉంది. చీరాల ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు సముద్రంలో కలిసే విధంగా ఈ కాలువను గతంలో నిర్మించారు. కాలువ సముద్రంలో కలిసే చోట తూర్పు వైపు భూములు కలిగి ఉన్న బుర్ల వెంకట్రావు... కాలువ, సముద్రం కలిసే చోట సీమౌత్‌ను చదును చేశాడు. ఈ విషయాన్ని గుర్తించిన మత్స్యకారులు ప్రశ్నించారు. తనకూ సముద్రతీరం వరకూ భూమి ఉందని వెంకట్రావు చెప్పాడు. సముద్రం ముందుకు వచ్చిన కారణంగా తనకు చెందిన 57 సెంట్ల భూమి సముద్రంలో కలిసిందని తెలిపాడు. ఈ విషయమైన గొడవ చోటు చేసుకుంది. దీంతో వారం రోజులుగా వాడరేవు తీరప్రాంతం ఉద్రిక్తంగా మారింది. సీమౌత్ మూసివేసి, తీరంలోని ఇసుక దిబ్బలను చదును చేసిన బుర్ల వెంకటరావు పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మత్స్యకార, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయి. కోస్టల్ రెగ్యులేషన్ జోన్ పరిధిని విస్మరించి అక్కడ రీసార్ట్స్ నిర్మించారంటూ వెంకట్రావుకు చెందిన రిసార్ట్ వద్ద మత్స్యకారులు శుక్రవారం ఆందోళనకు దిగారు. వారికి మత్స్యకార సంఘాలు, ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల వారు మద్దతుగా తెలిపారు. ఈ క్రమంలో బోట్లు సముద్రంలోకి వెళ్లేందుకు వీలుగా బాపట్ల డిఎస్‌పి రామాంజనేయులు జెసిబితో అక్కడ ఉన్న కొండరాళ్ళను తొలగించే ప్రయత్నం చేయగా, ప్రజా సంఘాల నాయకులు, మత్స్యకారులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు మత్స్యకారులకు మధ్య వాగ్వివాదం నెలకొంది. సిమౌత్‌ను పూడ్చివేసిన బుర్ల వెంకట్రావు, అతనికి సహకరించిన అధికారులపై కేసులు నమోదు చేయాలని మత్స్యకారులు డిమాండ్ చేశారు. ఫిర్యాదు ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి రామాంజనేయులు తెలిపారు. మత్స్యకారుల ఆందోళనకు సిపిఎం నేతలు ఎన్.బాబూరావు, పి.కొండయ్య, ఎం.వసంతరావు, బిఎస్‌పి ప్రతినిధులు డి.జగన్మోహనరావు, ధరణికోట మత్స్యకారుల ఐక్యవేదిక ప్రతినిధులు జి.నాగార్జున, కె.రవీంద్ర తదితరులు మద్దతు తెలిపారు.

కుప్పం ఘటనపై నివేదిక ఇవ్వండి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో అప్పు కట్టలేదని ఓ మహిళను చెట్టుకు కట్టేసి దాడిచేసిన ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పందించింది. ఓ దినపత్రికలో ప్రచురించిన వార్తను అనుసరించి, సుమోటోగా కేసు నమోదు చేశామని, ఇదే ఘటనపై తిరుపతి పార్లమెంట్ సభ్యులు మద్దిల గురుమూర్తి ఇచ్చిన ఫిర్యాదునూ ఈ కేసుతో కలిపి పరిగణనలోకి తీసుకున్నామని పేర్కొంది. ఈ ఘటనను మానవ హక్కుల తీవ్ర ఉల్లంఘనగా పరిగణిస్తూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డిజిపిని పూర్తి నివేదికను రెండు వారాలలోగా సమర్పించాలంటూ జాతీయ మానవ హక్కుల కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఇలాంటి అమానుష చర్యలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్నదని కమిషన్ హితవు పలికింది.

ఇక ద్విచక్ర వాహనాలన్నిటిలో ఎబిఎస్

న్యూఢిల్లీ : వచ్చే ఏడాది అన్ని రకాల ద్విచక్ర వాహనాల్లో యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్ (ఎబిఎస్)ను తప్పనిసరి చేయాలని కేంద్రం భావిస్తోంది. ఈమేరకు త్వరలోనే కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వశాఖ నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ద్విచక్ర వాహన ప్రమాదాలు తగ్గించేందుకు ఎబిఎస్ ఉపయోగపడనుంది. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురాలని కేంద్రం భావిస్తోంది. ఎబిఎస్‌ను వాహనాల్లో ఉపయోగించడం ద్వారా సడన్ బ్రేకింగ్ సమయంలో చక్రాలు లాక్ అవ్వకుండా నిరోధిస్తుంది. దీనివల్ల డ్రైవర్‌కు వాహనం మీద నియంత్రణ ఉండటంతో పాటుగా స్కిడ్ కాకుండా ఉంటుంది. ఎబిఎస్‌ను తప్పనిసరి చేయడం ద్వారా ద్విచక్ర వాహన ధరలు రూ.2,500 నుంచి రూ.5,000 వరకు పెరగనున్నాయి.

25 నుంచి హెచ్‌డిబి ఫైనాన్షియల్ పబ్లిక్ ఇష్యూ..


ముంబయి : హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ అనుబంధ బ్యాంకింగేతర విత్త సంస్థ హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ పబ్లిక్ ఇష్యూకు రానుంది. ఈ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ) ఈ నెల 25న ప్రారంభమై 27న ముగియనుంది. రూ.12,500 కోట్ల ఇష్యూలో షేర్ల ధరల శ్రేణీని రూ.700-740గా కంపెనీ నిర్ణయించింది. గరిష్ఠ ధరల శ్రేణి వద్ద కంపెనీ మార్కెట్ విలువ రూ.61,400 కోట్లు కానుంది. ఈ ఇష్యూలో రూ.2,500 కోట్ల విలువైన తాజా షేర్లను, ఆఫర్ ఫర్ సేల్‌లో రూ.10,000 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ విక్రయించనుంది. ప్రస్తుతం హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌కు 94.36 శాతం వాటా ఉంది.

మరోసారి కుర్చీ వివాదం

- కడప నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంపై ఉత్కంఠ
- అరగంట ముందే హాజరైన ఎమ్మెల్యే
- హాజరుకాని మేయర్, వైసిపి కార్పొరేటర్లు

ప్రజాశక్తి-కడప అర్బన్


తన ఛాంబర్ బయట సమావేశం నిర్వహిస్తున్న మేయర్ సురేష్‌బాబు


సమావేశ మందిరంలో కూర్చున్న కడప ఎమ్మెల్యే మాధవి

కడప నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో మరోసారి కుర్చీ వివాదం కొనసాగింది. సర్వసభ్య సమావేశం నిర్వహణపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే రెండుసార్లు జరిగిన సమావేశంలో టిడిపికి చెందిన కడప ఎమ్మెల్యే మాధవికి కుర్చీ లేకుండా చేయడంపై తీవ్ర వివాదం నెలకొన్న సంగతి తెలిసిందే. శుక్రవారం నిర్వహించిన సమావేశానికి మేయర్ కుర్చీ పక్కన ఎక్స్‌అఫిషియో హోదాలో కడప ఎమ్మెల్యే మాధవితోపాటు, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, ఎమ్మెల్సీలు రాంగోపాల్‌రెడ్డి, రామచంద్రారెడ్డికి కుర్చీలు ఏర్పాటు చేశారు. సర్వసభ్య సమావేశానికి కడప ఎమ్మెల్యే మాధవితోపాటు టిడిపి కార్పొరేటర్లు హాజరయ్యారు. సమావేశం జరిగే కౌన్సిల్ హాల్‌లోకి మేయర్ సురేశ్‌బాబు రాకుండా తన ఛాంబర్‌లోనే వైసిపి కార్పొరేటర్లతో సమావేశమయ్యారు. తనకు తెలియకుండా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కుర్చీలు కేటాయించడంపై మేయర్ అభ్యంతరం తెలిపారు. తన ఛాంబర్‌లోనే సమావేశం ఏర్పాటు చేస్తామని కమిషనర్‌కు ఆయన లేఖ రాశారు. సమావేశ మందిరంలోకి రాకుండా మేయర్ తన ఛాంబర్‌లో సమావేశం ఎలా నిర్వహిస్తారని ఎమ్మెల్యే మాధవి, టిడిపి కార్పొరేటర్లు ప్రశ్నించారు. ఈ గందరగోళం నేపథ్యంలో సమావేశం వాయిదా పడింది. దీనిపై స్పందించిన కమిషనర్ మనోజ్‌రెడ్డి.. మేయర్ సురేష్‌బాబుకు నోటీసు జారీ చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు సిబ్బంది వచ్చి మేయర్ ఛాంబర్‌కు నోటీసులు అంటించి వెళ్లారు. సమావేశపు హాల్లో ఉదయం 11 గంటల నుంచి అధికారులు అందుబాటులో ఉన్నా మేయర్, కొందరు కార్పొరేటర్లు సమావేశానికి హాజరు కాలేదని నోటీసుల్లో పేర్కొన్నారు. నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహణపై కమిషనర్ మనోజ్ రెడ్డి, అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం తీరును నిరసిస్తూ మేయర్ సురేష్ బాబు తన ఛాంబర్ ఎదుట వైసిపి కార్పొరేటర్లతో కలిసి సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. కోర్టు ఆదేశాలను అధికారులు లెక్క చేయలేదన్నారు. నగర ప్రథమ పౌరుడు మేయర్‌కు, ప్రజాప్రతినిధులైన కార్పొరేటర్లకు గౌరవం ఇవ్వని కమిషనర్ మనోజ్‌రెడ్డి, అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం, ఎస్ఇ చెన్నకేశవరెడ్డిని ప్రభుత్వానికి సరెండర్ చేయాలని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించిందని చెప్పారు. కోర్టు ఆదేశాలను ధిక్కరించిన కమిషనర్‌పై కోర్టు ధిక్కరణ కేసు వేస్తామని తెలిపారు. అనంతరం అజెండాలోని అంశాలను ఒకటవ డివిజన్ కార్పొరేటర్ చెన్నయ్య చదివి వినిపించగా మరో కార్పొరేటర్ పాక సురేష్ బలపరిచారు. సర్వసభ్య సమావేశంలో అజెండాలోని పలు అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించడంతోపాటు, మరి కొన్నిటిని తిరస్కరించారు.

సంపాదకీయం


ప్రహసనంగా జి-7

కెనడా ఆల్బెర్టాలోని కననాస్కిస్‌లో మూడు రోజుల పాటు జరిగిన జి-7 దేశాధినేతల శిఖరాగ్ర సమావేశం ఎటువంటి ప్రకటనలు లేకుండానే ముగిసింది. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారీ దేశాల్లో నెలకొన్న సంక్షోభం, పరస్పర అపనమ్మకం, పెరుగుతున్న పోటీ వాతావరణం మధ్య జరిగిన ఈ శిఖరాగ్ర సమావేశం పూర్తిగా విఫలమైంది. ప్రపంచం ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యలను చర్చించినట్లు చెబుతున్నప్పటికీ, నేతల మధ్య నెలకొన్న భిన్నాభిప్రాయాల కారణంగా సభ్య దేశాల పూర్తి అంగీకారంతో తుది ప్రకటనను జారీ చేయడం సాధ్యం కాలేదు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, వాణిజ్య సంబంధాలు మరియు రాజకీయ పరిణామాలను సొంత ప్రయోజనాలకు అనుగుణంగా మలుచుకోవడం తప్ప జి-7 దేశాల సమూహానికి ఇతర అంశాలు పట్టవని ఈ సమావేశం మరోసారి స్పష్టం చేసింది.

ఇరాన్, ఉక్రెయిన్‌ల అంశాలపై చర్చించడంతో పాటు 'అభివద్ధికి నిధులు సమకూర్చడం, భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేయడం, వృద్ధి, విలువైన లోహాల సరఫరా కోసం ఒక ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ వ్యవస్థను అభివృద్ధి చేయడం, వలసలు, అక్రమ రవాణాను అరికట్టడం వంటి అంశాలు జి-7 సమావేశపు ఎజెండాగా ఉన్నాయి. ఇంత విస్తృత ఎజెండా ఉన్నప్పటికీ వీటిలో దేనినీ వివరంగా చర్చించిన దాఖలాలు లేవు. 'గాజాలో కాల్పుల విరమణతో సహా మధ్యప్రాచ్యంలో శత్రుత్వాలను తగ్గించాలి' అని పిలుపునిస్తూ ఒక విస్తత ప్రకటన జారీ చేశారు. అదే సమయంలో ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య కాల్పుల విరమణతో సహా ఎటువంటి ప్రతిపాదనలను అందులో ప్రస్తావించలేదు. ఉక్రెయిన్‌కు మద్దతుగా, రష్యాపై సుంకాలు విధించే ప్రతిపాదనను ట్రంప్ తోసిపుచ్చడంతో అది సాధ్యం కాలేదు. 2018లో జి-7 శిఖరాగ్ర సమావేశం నుండి వైదొలిగిన తర్వాత అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మళ్ళీ ఈ సమావేశానికి హాజరైనారు. ఈ సంవత్సరం శిఖరాగ్ర సమావేశంలో ఇండియా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా, ఉక్రెయిన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, మెక్సికో , యుఎఇ దేశాల అధినేతలు కూడా పాల్గొన్నారు.

వాస్తవానికి ఈ సమావేశానికి తొలుత ఇండియాకు ఆహ్వానం రాలేదు. ఈ విషయం విస్తృతంగా చర్చనీయాంశమైన తరువాతే కెనడా ప్రధాన మంత్రి కార్నీ ఆహ్వానం మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈ సమావేశానికి హాజరయ్యారు, కానీ దీనికి పెద్దగా ప్రాముఖ్యత లభించలేదు, జస్టిన్ ట్రూడో ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో రెండు దేశాల మధ్య సంబంధాలు చాలా దెబ్బతిన్నాయి. జి7 వేదికగా ఇద్దరు ప్రధానులు సమావేశం కావడం సంబంధాలను పునరుద్ధరించే అవకాశానికి కొంత మేరకు మార్గం సుగమం చేసిందని చెప్పవచ్చు. అయితే, పరస్పర వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి ఎటువంటి ప్రకటనలు లేవు. ఈ అంశంపై తిరిగి చర్చలు జరపాలని అంగీకరించారు. పరస్పరం సన్నిహిత మిత్రులుగా చెప్పుకునే డోనాల్డ్‌ట్రంప్, మోడీలు ఈ కీలక సమావేశంలో ఒకరినొకరు కలుసుకోలేదు. అత్యవసర పనుల సాకుతో మోడీ రావడానికన్నా ముందే ట్రంప్ అక్కడి నుండి వెళ్లిపోయారు. పాకిస్తాన్ ఆర్మీ చీఫ్‌ను కలవడమే ఆ అత్యవసర పని అని తేలడంతో విస్మయపోవడం భారత ప్రజల వంతైంది. పాకిస్తాన్ సైన్యాధ్యక్షుడికి ట్రంప్ రెడ్ కార్పెట్ స్వాగతం పలికి, విందు ఇచ్చారు. ఈ భేటీకి కొంత ముందు నరేంద్రమోడీతో ఆయన ఫోన్ సంభాషణ చేశారు. ఈ సందర్భంగానే కాల్పుల విరమణతో అమెరికాకు ఎటువంటి సంబంధం లేదని మోడీ స్పష్టం చేసినట్లు వార్తలు వచ్చాయి. అయితే, పాక్ ఆర్మీ చీఫ్ మునీర్‌ను కలవడానికి కొన్ని నిమిషాల ముందు కూడా తన జోక్యం వల్లే పాక్-వివాదం ముగిసిందని ట్రంప్ చెప్పారు. 'ఆ నిప్పులపై నేనే నీళ్లు పోశాను' అని చెబుతూనే ఈ వ్యాఖ్య చేశారని మరి కొన్ని కథనాలు వచ్చాయి. పాకిస్తాన్ ఆర్మీ చీఫ్‌ను, మన దేశ ప్రధానిని ఒకే గాటన కట్టి మాట్లాడటం గమనార్హం. మన దేశ ప్రతిష్టకు పరీక్షగా మారిన ఈ వ్యవహారంలో నిజానిజాలను ప్రజానీకానికి మోడీ సర్కారు వెల్లడించాలి.

మహనీయుల మాట



అన్వేషణ నుంచి, నిరంతరాన్వేషణ నుంచి జ్ఞానం పుట్టుకొస్తుంది! దానికి కావలసింది మానవుడి అవిశ్రాంత ఆశావహ శోధన!! ప్రపంచంలో జీవిస్తూ ప్రపంచంతోనూ పరస్పరంగానూ జరిపే అలుపెరుగని శోధన!!!

- పాలో ఫెయిరీ,
బ్రెజిలియన్ విద్యావేత్త, తత్వవేత్త.

వ్యాఖ్య

50 ఏళ్ల అనంతరం-సరికొత్త తీవ్ర ప్రమాదం

1975 జూన్ 20వ తేదీన అర్ధరాత్రి అంతర్గత అత్యవసర పరిస్థితి ఎమర్జెన్సీ ప్రకటనకు దారి తీసిన అపఖ్యాతికరమైన పరిణామ క్రమం గుర్తుచేసుకోవడం కొంచెం విపరీతంగా కనిపించవచ్చు. ఏమైనా విజ్ఞతా యుతమైన ఈ చిరస్మరణీయ వాక్యాలు మాత్రం మనకు గుర్తుకు వస్తాయి. "చరిత్ర పాఠాలు మరిచిపోయిన వారు మళ్లీ పునరావృతానికి బలి కాక తప్పదు". భారత ప్రజాస్వామ్య చరిత్రలోని ఆ చీకటి అధ్యాయాన్ని మరోసారి దర్శించడాన్ని ఈ మాటలే అనివార్యం చేస్తున్నాయి.

1960లలో కాంగ్రెస్ పార్టీ గుత్తాధిపత్యానికి పెద్ద దెబ్బ తగిలింది. అనేక రాష్ట్రాల్లో ప్రతిపక్షాల కూటములు విజయాలు సాధించాయి. ఇందుకు ప్రతిస్పందనగా శ్రీమతి ఇందిరా గాంధీ ప్రగతిశీలంగా ధ్వనించే బ్యాంకుల జాతీయీకరణ, రాజభరణాల రద్దు వంటి నినాదాల పరంపరతో తన స్థానాన్ని పున: స్థాపించుకున్నారు. సంప్రదాయ రాజకీయ పద్ధతులను విడనాడి తన చేతుల్లోనే అధికారాన్ని ఆమె కేంద్రీకరించుకున్నారు. రాష్ట్ర స్థాయిలోని బలమైన నేతలను బేఖాతరు చేస్తూ నేరుగా జన బాహుళ్యంతో మాట్లాడటం మొదలుపెట్టారు.


ఏక పార్టీ పెత్తనం నుంచి ఎమర్జెన్సీకి

ఈ వైఖరి శ్రీమతి గాంధీకి కొన్ని లాభాలు కలిగించింది గానీ బంగ్లాదేశ్ విమోచన పోరాటం వల్లనే ఆమె రాజకీయ ఆధిపత్యానికి నిజంగా ఊపు వచ్చింది. ఉత్తరోత్తర స్వతంత్ర బంగ్లాదేశ్ ఆవిర్భవించటం, పాకిస్తాన్ నిర్ణయాత్మకంగా ఓడిపోవడం ఆమె స్థాయిని పెంచాయి. పాకిస్తాన్ సైనిక ప్రభుత్వాన్ని కాపాడేందుకోసం అమెరికా జోక్యం చేసుకోకుండా నాడు ఉనికిలో వున్న సోవియట్ యూనియన్ ఆపగలిగిన పరిస్థితి కూడా కీలక పాత్ర వహించింది.

ఇలా నిలదొక్కుకున్న శ్రీమతి గాంధీ స్థాయి పెరగడంతో 1971 సాధారణ ఎన్నికల్లో విజయం సాధించేలా చేసింది. అయినప్పటికీ ఈ మొత్తం అనుకూల పరిస్థితిలోనూ సిపిఐ(ఎం)ను మాత్రం ఆమె ఆపలేకపోయారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో అది ఏకైక పెద్ద పార్టీగా అవతరించింది. కానీ దీన్ని ఆమె సహజంగా సాగనివ్వలేదు. 1972 అసెంబ్లీ ఎన్నికలలో ఘోరంగా రిగ్గింగ్ చేసి ఐదేళ్లపాటు అర్ధ ఫాసిస్టు నిర్బంధానికి బాట వేశారు. ఈ నిరంకుశత్వం కాలం 1975 జూన్ 25న ప్రకటించిన అత్యవసర పరిస్థితితో చాలా నిరాటంకంగా కలగలిసిపోయింది.

ఎమర్జెన్సీ దారుణాలు

ఎమర్జెన్సీ కాలంలో చాలావరకు శ్రీమతి గాంధీ రాజకీయ



ఎమర్జెన్సీ కాలంలో చాలావరకు శ్రీమతి గాంధీ రాజకీయ ప్రత్యర్థులను జైల్లో పెట్టారు. పత్రికలపై సెన్సార్ విధించారు. పాత్రికేయులు, కార్యకర్తలు జైళ్లపాలయ్యారు. ఈలోగా మరోవైపు దేశం ఆర్థిక సవాళ్లు ఎదుర్కోవలసి వచ్చింది. పాకిస్తాన్‌తో అప్పుడే ముగిసిన యుద్ధం, కరువులు, 1973 ప్రపంచ చమురు సంక్షోభం వంటివి, నిరుద్యోగం పెరుగుదల, ద్రవ్యోల్బణం ప్రజల అసంతృప్తికి రాజకీయ ప్రతికూలతకు మరింత ఆజ్యం పోశాయి. ఈ పెరుగుతున్న ఒత్తిళ్లు, శ్రీమతి గాంధీలో పెరిగిన వ్యక్తిగత అభద్రత చట్టపరమైన ఎదురుదెబ్బలు ప్రత్యేకించి లోక్‌సభ సభ్యత్వం కోల్పోయే ప్రమాదం... ఇవన్నీ ఎమర్జెన్సీ విధింపుకు దోహదపడ్డాయి.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

ప్రత్యర్థులను జైల్లో పెట్టారు. పత్రికలపై సెన్సార్ విధించారు. పాత్రికేయులు, కార్యకర్తలు జైళ్లపాలయ్యారు. ఈలోగా మరోవైపు దేశం ఆర్థిక సవాళ్లు ఎదుర్కోవలసి వచ్చింది. పాకిస్తాన్‌తో అప్పుడే ముగిసిన యుద్ధం, కరువులు, 1973 ప్రపంచ చమురు సంక్షోభం వంటివి, నిరుద్యోగం పెరుగుదల, ద్రవ్యోల్బణం ప్రజల అసంతృప్తికి రాజకీయ ప్రతికూలతకు మరింత ఆజ్యం పోశాయి. ఈ పెరుగుతున్న ఒత్తిళ్లు, శ్రీమతి గాంధీలో పెరిగిన వ్యక్తిగత అభద్రత, చట్టపరమైన ఎదురుదెబ్బలు, ప్రత్యేకించి లోక్‌సభ సభ్యత్వం కోల్పోయే ప్రమాదం... ఇవన్నీ ఎమర్జెన్సీ విధింపుకు దోహదపడ్డాయి.

ఈ విధంగా 1975 ఎమర్జెన్సీ అనేక రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాల కలయికతో జరిగింది. యుద్ధం, బయటి నుంచి దురాక్రమణ ప్రమాదం, అంతర్గత కల్లోలం సందర్భంలో ఎమర్జెన్సీ విధించడానికి అవకాశం ఇచ్చే రాజ్యాంగం 352వ అధికరణాన్ని ప్రభుత్వం ప్రయోగించింది. అధికారిక ప్రకటనలో జాతీయ భద్రతకు ముప్పు, ప్రజా జీవితానికి ప్రమాదం అందుకు కారణాలుగా పేర్కొన్నారు. ప్రాథమిక హక్కులు అణచివేయడానికి కార్యనిర్వాహక వర్గం మొత్తం అధికారాలు చేజిక్కించుకోవడానికి ఇది దారి తీసింది.

ఎకెజి ఏం చెప్పారు?

ఎమర్జెన్సీ విధింపునకు దారి తీసిన రాజకీయ పరిణామాలను పార్లమెంట్‌లో సిపిఎం నాయకుడు ఎ.కె.గోపాలన్ ఎండగట్టారు. 1975 జులై 21న ఎమర్జెన్సీ ప్రకటన ఆమోదానికై చట్టబద్ధ తీర్మానం చర్చకు పెట్టినప్పుడు దాన్ని ప్రారంభిస్తూ ఆయన ఇలా చెప్పారు "ఏక పార్టీ నియంతృత్వం వైపుగా పెరుగుతున్న పోకడల గురించి మా పార్టీ చేసిన హెచ్చరిక సరైందని ఎమర్జెన్సీ హఠాత్ ప్రకటనతో నిరూపితమైంది". లోతుగా వేళ్లూనుకున్న వ్యక్తిగత రాజకీయ సంక్షోభం నుంచి తమను, తమ నాయకురాల్ని రక్షించుకోవడానికి పాలక పక్షం ఈ ఆకస్మిక చర్యకు పాల్పడటం బలహీనతను చెప్పేదే తప్ప బలాన్ని సూచించడం లేదన్నారు. ప్రతిపక్షాలు, ప్రజా ఉద్యమాలను గొంతు నొక్కేందుకు ఈ పథకం పన్నినట్లు చెప్పారు. మితవాద, అతివాద దుస్సాహసిక శక్తులను అణచివేసేందుకే ఎమర్జెన్సీ విధించినట్టు సృష్టించిన తప్పుడు కథనాన్ని ఆయన బట్టబయలు చేశారు.

ఈ విధంగా చూస్తే ప్రజాస్వామ్యంపై, రాజ్యాంగ సూత్రాలపై ప్రస్తుత దాడి మరింత ప్రమాదకరమైంది. నిరంకుశత్వం వ్యవస్థీకృతం కావడం కావడానికి ఇది దారి తీసింది. కొంతమంది పరిశీలకులు దీనికే "ఎన్నికలతో నిరంకుశత్వం" అనే పదం వాడుతున్నారు. భారతదేశ సందర్భంలో చూస్తే ఈ నిర్ణయాత్మక మార్పులో ఆర్‌ఎస్‌ఎస్ అగ్రస్థానం వహిస్తున్నది. భారతదేశం అన్న భావననే తలకిందులు చేసే విషపూరిత భావజాలంగా హిందుత్వను జొప్పిస్తున్నది. భారతదేశం అనే ఈ భావన వలసవాద వ్యతిరేక పోరాట క్రమంలో పుట్టింది. ఒక ప్రజాస్వామ్య, లౌకిక, సామాజిక, న్యాయబద్ధమైన సమాఖ్య రిపబ్లిక్‌గా నడిపించింది. ఇప్పుడు జరుగుతున్న ఈ దాడి అందుకనే మరింత విస్తృతమైనది, విచ్ఛిన్నకరమైనది.

తర్వాత కాలంలో అనివార్యంగా జరగాల్సిందే జరిగింది. కాంగ్రెస్‌తో సహా ఇందిరా గాంధీ రాజకీయ ఓటమిని ఆపలేకపోయారు. 18 మాసాల ఎమర్జెన్సీ కాలం సమకాలీన భారతదేశ చరిత్రలో ఒక దారుణమైన అపశృతిగా ప్రజాస్వామ్యాన్ని విచ్ఛిన్నం చేసిన వికృత చర్యగా నిలిచిపోయింది. 1977 లోక్‌సభ ఎన్నికల్లో వివిధ శక్తుల విస్తృత కలయిక దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించ గలిగింది.

మోడీ పాలన పాఠాలు

ఈ రోజున నరేంద్ర మోడీ ఎమర్జెన్సీ యుగాన్ని ప్రస్తావిస్తున్నారు. దాన్ని 1975 జూన్ 25న ప్రకటించటం రాజ్యాంగంపై నల్లని మచ్చగా అభివర్ణిస్తున్నారు "ఎమర్జెన్సీ తర్వాత గడచిన 50 ఏళ్లు మనకు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని సగర్వంగా కాపాడుకోవాలని గుర్తు చేస్తున్నాయి. దేశ ప్రజలు అలాంటి దుస్థితి మళ్ళీ ఎప్పుడూ జరగనివ్వరాదని రానివ్వరాదని ప్రతిజ్ఞ పూనాలి. సజీవమైన ప్రజాస్వామ్యం ఉండేలా, భారత రాజ్యాంగం నిర్దేశించినట్టు సామాన్య ప్రజల స్వప్నాలు సఫలం చేసేందుకు మనం మనం కట్టుబడి ఉండాలి" అని మోడీ ప్రకటిస్తున్నారు. అయితే ఆయన ఇలాంటి భంగిమ దాల్చి ఇవన్నీ చెప్పడం ఒక పెద్ద బూటకం లాగా మారిపోతున్నది. భారత ప్రజాస్వామ్యం పైన దారుణమైన దాడిని కప్పిపుచ్చడానికి ప్రయత్నమే ఇది అని ఆయన హయాంలో గత 11 ఏళ్ల కాలం స్పష్టం చేస్తున్నది.

పొసగని పోలిక

యాభయ్యేళ్ల తర్వాత వెనక్కు తిరిగి చూసుకుంటే ఎమర్జెన్సీ అనేది భారత ప్రజాస్వామ్య వ్యవస్థపై జరిగిన తొలి ప్రధాన దాడిగా కనిపిస్తాయి. పౌర స్వేచ్ఛలను, ప్రజాస్వామిక హక్కులను అది కాలరాచింది. అయితే చాలామంది చేస్తున్నట్టుగా 1975 నాటి ఎమర్జెన్సీని ప్రస్తుత పరిస్థితిని ప్రత్యక్షంగా పోల్చి చూపడం ఒక పొరపాటు అవుతుంది. మోడీ నాయకత్వంలోని గత దశాబ్ది కాలాన్ని "అప్రకటిత ఎమర్జెన్సీ" అనడం తరచూ జరుగుతుంటుంది కానీ అలాంటి పోలిక సరైంది కాదని చెప్పడానికి చాలా కారణాలు ఉన్నాయి.

అంతర్జాతీయంగా పచ్చి మితవాద శక్తులు తిరిగి పుంజుకున్న నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితి ముందుకొచ్చింది. రాజకీయ శక్తుల పొందిక సామ్రాజ్యవాదానికి అనుకూలంగా మారిన నేపథ్యం ఇది. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలను ద్రవ్య పెట్టుబడి నడిపించే యుగం మొదలైన దశ. తీవ్రమైన అసమానతలు, ముమ్మర నిరుద్యోగం ముంచెత్తే కార్పొరేట్ ప్రాబల్యం దీని లక్షణాలుగా వున్నాయి. వీటికి తోడు ఇదివరకెన్నడూ లేని స్థాయిలో అస్తిత్వ ప్రాతిపదికన సమీకరణలు, అంతులేని విద్వేష ప్రచారాలు సాటి పౌరులనే "పరాయి"గా చూపించడం ఆర్థిక, రాజకీయ రంగ ఆర్థిక సామాజిక రంగాలలో సాగిపోతున్నది.

విశ్వాసం పెంచిన పోరాటం

ఈ విధంగా చూస్తే ప్రజాస్వామ్యంపై, రాజ్యాంగ సూత్రాలపై ప్రస్తుత దాడి మరింత ప్రమాదకరమైంది. నిరంకుశత్వం వ్యవస్థీకృతం కావడం కావడానికి ఇది దారి తీసింది. కొంతమంది పరిశీలకులు దీనికే "ఎన్నికలతో నిరంకుశత్వం" అనే పదం వాడుతున్నారు. భారతదేశ సందర్భంలో చూస్తే ఈ నిర్ణయాత్మక మార్పులో ఆర్‌ఎస్‌ఎస్ అగ్రస్థానం వహిస్తున్నది. భారతదేశం అన్న భావననే తలకిందులు చేసే విషపూరిత భావజాలంగా హిందుత్వను జొప్పిస్తున్నది. భారతదేశం అనే ఈ భావన వలసవాద వ్యతిరేక పోరాట క్రమంలో పుట్టింది. ఒక ప్రజాస్వామ్య, లౌకిక, సామాజిక, న్యాయబద్ధమైన సమాఖ్య రిపబ్లిక్‌గా నడిపించింది. ఇప్పుడు జరుగుతున్న ఈ దాడి అందుకనే మరింత విస్తృతమైనది, విచ్ఛిన్నకరమైనది. భారత పౌరసత్వ వ్యవస్థాపక సూత్రాలనే ధ్వంసం చేయడానికి ఉద్దేశించబడింది.


సాధారణ దృష్టితో చెప్పాలంటే ఈ రోజున మనం అనుభవిస్తున్న పూర్తి స్థాయి నిరంకుశత్వంతో పోలిస్తే 1975 ఎమర్జెన్సీ అపరిపక్వ వ్యవహారంగా కనిపిస్తుంది. ప్రస్తుత పాలన వ్యవస్థను తొలగించటం మరింత కష్టమని అనిపించవచ్చు కానీ 1970లలో ఎమర్జెన్సీని ఎదిరించి పోరాడిన అనుభవం గుర్తు చేసుకుంటే విశ్వాసమే కలుగుతుంది. ఆర్‌ఎస్‌ఎస్ ప్రమాదకర భావజాలాన్ని తిప్పి కొట్టాలనే సంకల్పంతో ప్రజానీకం సమైక్యమైతే ప్రజాస్వామ్యాన్ని తిరిగి నిలబెట్టుకోవడం, ప్రస్తుత సవాళ్లను అధిగమించటం సాధ్యమే అవుతుంది.

(జూన్ 18 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

★

సందర్భం

యోగా దినోత్సవం - హిందూత్వ ఎజెండా



డా॥ బి.గంగారావు

పదకొండవ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈసారి విశాఖపట్నంలో యోగాంధ్ర పేర జూన్ 21న జరిపేందుకు సర్వం సిద్ధం చేశారు. విశాఖపట్నంకే పరిమితంకాక టిడిపి కూటమి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా జరుపుతున్నది. సుమారు 2 కోట్ల మంది యోగా దినోత్సవంలో పాల్గొనటానికి పేర్లు నమోదు చేసుకున్నారని ముఖ్యమంత్రి ఇప్పటికే ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గాక పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, 22 దేశాల ప్రతినిధులు పాల్గొనబోతున్నారు.

విశాఖలో ఆర్.కె బీచ్ తీరంలో సుమారు 15 కిలోమీటర్ల పొడవున తలపెట్టిన యోగా కార్యక్రమంలో సుమారు మూడు లక్షల మంది పాల్గొని యోగాసనాలు వేస్తారని ప్రకటించారు. జూన్ 20వ తేదీ ప్రత్యేకంగా 25 వేల మంది గిరిజన విద్యార్థులతో సూర్యనమస్కార కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. యోగా దినోత్సవంలో పాల్గొనే వారికి మ్యాట్, టీ షర్ట్, అల్పాహారం ప్రభుత్వం ఇస్తుంది. గత నెల రోజుల నుండి జిల్లా వ్యాప్తంగా వార్డు సచివాలయ, స్వయం సహాయక సిబ్బంది ఇంటింటికి తిరిగి యోగా నమోదు ప్రక్రియ చేస్తున్నారు. నగరంలో అన్ని ప్రాంతాల్లో, గ్రామాలలో, పరిశ్రమల్లో, ప్రభుత్వ ఉద్యోగులతో ఇలా పెద్ద ఎత్తున యోగా శిక్షణ కొన్ని రోజుల నుండి సాగుతున్నది. దాదాపు 2 వేల మంది యోగా శిక్షకులతో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇందులో పాల్గొనేందుకు నమోదు చేసుకున్నవారిని బీచ్‌కి తరలించడానికి 2010 బస్సులు, వేలాది ఆటోలు, మినీ ప్రైవేట్ వాహనాలను సిద్ధం చేశారు. ఇక ప్రకటనలు, ఎలక్ట్రానిక్ బోర్డులు, కటౌట్లు, ప్రచార మాధ్యమాల్లో ఈ కార్యక్రమాన్ని హోరెత్తిస్తున్నారు. అంతేగాక ఆర్.కె బీచ్‌లో ప్రత్యేకంగా అయోధ్య తరహా తాత్కాలిక రామాలయాన్ని నిర్మించి అక్కడ కూడా యోగా ప్రచారం చేస్తున్నారు.

యోగా అనేది ఒక శారీరక వ్యాయామం. దీనికి ఏ మత విశ్వాసాలతో సంబంధం ఉండకూడదు. ప్రాచీన కాలం నుండి మన దేశంలో సాధన చేస్తున్నారు. మన దేశంతో పాటు ప్రపంచంలో కులం, మతం, లింగ, జాతి, తెగ, ప్రాంతం, రంగు ఇలా ఏ ఒక్క దానికి పరిమితం కాకుండా అనేక దేశాల్లో ప్రజలు యోగాను ఆరోగ్యం, మనశ్శాంతి, మానసిక ఉల్లాసానికి ఒక సాధనగా ఆచరించే వారున్నారు.

కేంద్ర బిజెపి ప్రభుత్వం నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం ఉద్దేశం ఇది కాదు. తన మనువాద హిందూత్వ ఎజెండాలో భాగంగా దీనిని ముందుకు తీసుకొచ్చి అమలు చేస్తున్నది. 2014లో కేంద్రంలో అధికారంలోకి రావడంతోటే మోడీ ప్రోద్బలంతో 2014 డిసెంబర్ 11న జరిగిన ఐక్యరాజ్యసమితి జనరల్ కౌన్సిల్‌లో జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటింపజేశారు. ఈ తేదీ నిర్ణయం యాధృచ్ఛికంగా జరిగింది కాదు. ఆ రోజు రాష్ట్రీయ స్వయం సేవక్ సంస్థ (ఆర్.ఎస్.ఎస్) వ్యవస్థాపకుడు కె.బి.హెగ్డేవార్ మరణించిన రోజు. అందుకే ఆ రోజును అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ఎంచుకున్నారు. హిందూత్వ శక్తులు ప్రతి ప్రభుత్వ కార్యక్రమాలను మతతత్వ భావాలను ప్రజల్లో వెదజల్లటానికి ఉపయోగపడే పురాణ, ఇతిహాస గాథల్లో ఉండే ఘటనలను, తేదీలను, హిందూత్వ సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్లిన వారి పేర్లతో ముడి పెట్టి అమలు చేస్తున్నారు.

ఇప్పటి వరకు నిర్వహించిన యోగా దినోత్సవాలు కేవలం ఎక్కడో ఒక చోట నిర్ణయించిన నగరానికే ప్రజలను సమీకరించి యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. 30 వేలకు మించి సమీకరణలు ఎక్కడా జరగలేదు. ఈసారి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని గతంలో వాటికి భిన్నంగా దేశ వ్యాప్తంగా లక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్నది. గత మార్చి నుండి మూడు నెలల పాటు హిందూ సమాజంలో ఉన్న వివిధ తరగతులను సమీకరించేలా లక్ష్యాన్ని పెట్టుకొని అనేక కార్యక్రమాలు చేస్తున్నది. యోగా సంఘం, యోగా బంధన్, యోగా సమావేశ, యోగా కనెక్ట్, హరిత యోగా, యోగా మహాకుంబ్, సంయోగ... ఇలా అనేక పేర్లతో హిందూ సమాజాన్ని సమీకరిస్తున్నారు. షుగర్, బిపి, ఆస్తమా వంటి జబ్బులున్న వారితో పాటు మహిళలు, సీనియర్ సిటిజన్‌లను లక్ష్యంగా పెట్టుకొని ప్రత్యేక యోగా శిక్షణలు ఇస్తున్నారు.

అందరికీ ప్రాంతాలవారీగా, కాలనీ, గ్రామాలవారీగా యోగా సంఘాలను పెడుతున్నారు. కేంద్ర ప్రభుత్వమే యోగా శిక్షకులను ఉచితంగా పంపుతున్నది. అందుకు ప్రత్యేక ఆన్‌లైన్ ఎన్‌రోల్‌మెంట్, యాప్‌లు వంటివి సృష్టించింది. యోగాలో శిక్షణ పొందే వారి పేర్లతో పాటు యోగా కార్యక్రమాల్లో పాల్గొనే వారందరి పేర్లు ఆన్‌లైన్‌లో బార్ కోడ్‌లో నమోదు చేస్తున్నారు. శిక్షణలో పాల్గొనే వారికి కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ సర్టిఫికెట్ కూడా ఇస్తుంది. విద్యార్థులు, యువకులను కేంద్రంగా చేసుకొని ప్రత్యేకంగా యోగాపై క్విజ్, వ్యాస రచన, డ్యాన్స్, హాస్య, నాటిక, ఈ-పోస్టర్, ఫోటో, సోషల్ మీడియా వంటి పోటీలు నిర్వహిస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులను కూడా యోగాలో నిర్బంధంగా పాల్గొనేలా ఆదేశాలు జారీ చేశారు. ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే వారిని కూడా ఆదేశించారు. ముఖ్యంగా దేశంలోని అన్ని పరిశోధనా సంస్థలను యోగా కార్యక్రమంలో పాల్గొవడం తప్పని సరి చేశారు.


హిందూత్వ మతోన్మాద శక్తులు యోగా ద్వారా మరో ముఖ్యమైన రాజకీయ లక్ష్యాన్ని ఎ.పి లో పెట్టుకున్నట్లు తెలుస్తున్నది. తెలుగుదేశం, జనసేన లను ఉపయోగించుకొని తన భావజాలాన్ని ప్రజల్లోకి వ్యాప్తి చేయడం, ప్రజలపై రాజకీయంగా పట్టు సాధించడం అనే వ్యూహంతో నేడు యోగాను మారుమూల గ్రామాలకు సైతం విస్తరిస్తున్నారు. ఎందుకంటే దక్షిణాది రాష్ట్రాలన్నిటికన్నా బిజెపి చాలా బలహీనంగా ఉన్నది ఆంధ్రప్రదేశ్ లోనే. అధికార కూటమిలో ఉన్నా ప్రజలపై రాజకీయ ఆధిపత్య శక్తిగా లేదు.

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన యోగా ప్రోటోకాల్ పత్రం ప్రకారం యోగా కార్యక్రమం గంట పాటు నిర్వహించాలి. ఇందులో 45 నిమిషాలు 10 రకాల భంగిమలతో కూడిన వ్యాయాయం, మరో 15 నిమిషాలు ఆధ్యాత్మిక ప్రసంగం ఉంటుంది. తొలుత ప్రార్థనతో యోగా ప్రారంభించాలి. ఈ ప్రార్థన బిజెపి శక్తులు ప్రచారం చేస్తున్న ఒకే దేశం, ఒకే భాష, ఒకే దైవం, ఒకే ఎన్నిక అనే భావాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రార్థన భావం చూడండి. "ఓం / అందరూ ఏక రీతిలో నడవండి/ అందరూ ఏక కంఠంతో పలకండి / మనసును ప్రశాంతంగా ఉంచండి / ప్రతి పవిత్ర ప్రయత్నంలో / దైవత్వం ఉట్టిపడుతుంది." అలాగే చివరిగా ఉపనిషత్తులోని "ఓం శాంతి: శాంతి: శాంతి:" అనే శ్లోకంతో యోగా వ్యాయామం ముగుస్తుంది.

రాజ్యం అనేది అన్ని మతాలకు సమ దూరంలో ఉండాలని భారత రాజ్యాంగం ఆదేశిస్తున్నది. అంతేగాక అన్ని మతాలను సమానంగా గౌరవించాలని కూడా తెలుపుతుంది. అధికారంలో ఉన్న ఏ ప్రభుత్వం కూడా ఏ మతానికి అనుకూలంగా ప్రచారం చేయకూడదు. ఎందుకంటే భారత దేశం భిన్న మతస్తులు ఉన్న దేశం. బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా స్వాతంత్రోద్యమంలోనే అన్ని మతాల వారిని కలుపుకునే నేపథ్యంలో లోకికతత్వం అనే భావన దేశంలో రూపుదిద్దుకుంది. హిందూ మతోన్మాద శక్తులు లౌకిక తత్వాన్ని, భావాన్ని ప్రజల్లో లేకుండా చేసి భారతదేశాన్ని హిందూ దేశంగా మార్చాలనే కుట్ర స్వాతంత్రోద్యమ కాలం నుండి సాగిస్తున్నది. అందులో భాగంగా యోగాను ఒక ఆయుధంగా ఎంచుకొని అధికారాన్ని అడ్డం పెట్టుకొని గత దశాబ్ద కాలంగా ప్రజల్లోకి తీసుకెళుతున్నది.

యోగాను ఎంచుకోవడంలో కారణం ఏమిటంటే భారత దేశ ప్రజల దృష్టిలో యోగా హిందూ పౌరాణిక దేవుళ్ళు, ఋషులు, గ్రంథాలతో ముడిపడి ఉంది. ప్రజల్లో ఉన్న ఈ భావనను బీజేపీ, ఆర్.ఎస్.ఎస్ శక్తులు హిందూ పురాణాలను సులభంగా ప్రజల్లోకి తీసుకెళ్లడానికి యోగాను ఒక ఆయుధంగా ఎంచుకున్నాయి. వేదాల పట్ల, ప్రాచీన గ్రంథాల పట్ల గుడ్డి నమ్మకాన్ని ప్రజల్లో పెంచి వీటినే నిజమైన చరిత్రగా నమ్మించడానికి, చలామణి లోకి తీసుకురావటానికి ప్రయత్నం చేస్తున్నాయి. బూజుపట్టిన హిందూ మత క్రతువులు, ఆచారాలు, సాంప్రదాయాలు, మత విశ్వాసాలు, నమ్మకాలు, పవిత్రతలు, విలువల ప్రచార వ్యాప్తి చేయగలుగుతున్నారు. యోగాను వాణిజ్యీకరణ కూడా చేసి పతంజలి వంటి సంస్థలు పెద్దఎత్తున వ్యాపారం సాగిస్తున్నాయి. రాందేవ్ వంటి వారిని దేశవ్యాప్తంగా తిప్పి ప్రదర్శనలు ఇప్పిస్తున్నారు.

యోగా కార్యక్రమంలో అన్ని రకాల మతస్తులు పాల్గోవటానికి ఎలాంటి ఆటంకం లేదనే భావన పైకి కనిపిస్తుంది. కానీ యోగా అభ్యసన హిందూ మత ప్రార్థనతోటే ప్రారంభం అవుతుంది. అలాగే ఇందులో వేసే వివిధ రకాల భంగిమలు, ఉపయోగించే పదాలు అన్నీ హిందూ దేవుళ్ళను ప్రతిబింబిస్తాయి. కనుక ఇతర మతస్తులెవ్వరు స్వచ్ఛందంగానే దీనిలో పాల్గోరు. దీనినే హిందూత్వ శక్తులు కోరుకుంటున్నాయి. దీని ద్వారా ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీల ఎడల సులభంగా ద్వేషాన్ని ఎక్కించగలుగుతున్నారు. ముఖ్యంగా విద్యా సంస్థలను కేంద్రంగా చేసుకొని చిన్న వయస్సు లోనే పిల్లలకు పరమత ద్వేషాన్ని, హిందూత్వ భావనలను ఎక్కించడానికి యోగాను ఉపయోగించుకుంటున్నారు. గత కొన్నేళ్లుగా ఆదివాసీ ప్రాంతాల్లో లక్షల కొలది విద్యార్థులకు సూర్య నమస్కారాలు నేర్పించి ఈ భావనలు కల్పిస్తున్నారు. ఒక్క అల్లూరి గిరిజన జిల్లాలో 25 వేల మంది విద్యార్థులకు సూర్య నమస్కారాలు



నేర్పించి జూన్ 20న విశాఖలో ప్రదర్శన ఇవ్వనున్నారు. ఈ ప్రక్రియను దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నారు.

హిందూత్వ మతోన్మాద శక్తులు యోగా ద్వారా మరో ముఖ్యమైన రాజకీయ లక్ష్యాన్ని ఎ.పి లో పెట్టుకున్నట్లు తెలుస్తున్నది. తెలుగుదేశం, జనసేన లను ఉపయోగించుకొని తన భావజాలాన్ని ప్రజల్లోకి వ్యాప్తి చేయడం, ప్రజలపై రాజకీయంగా పట్టు సాధించడం అనే వ్యూహంతో నేడు యోగాను మారుమూల గ్రామాలకు సైతం విస్తరిస్తున్నారు. ఎందుకంటే దక్షిణాది రాష్ట్రాలన్నిటికన్నా బిజెపి చాలా బలహీనంగా ఉన్నది ఆంధ్రప్రదేశ్ లోనే. అధికార కూటమిలో ఉన్నా ప్రజలపై రాజకీయ ఆధిపత్య శక్తిగా లేదు. అయితే కూటమిలోని తెలుగుదేశం, జనసేన పార్టీలు లౌకిక స్వభావానికి దూరంగా జరుగుతున్నాయి. ఈ పార్టీల అధినాయకులు హిందూత్వ భావనలు, శక్తులను వెనకేసుకు రావడం, ఉద్దేశపూర్వకంగా తిరుపతి లడ్డు కల్తీ, సనాతన ధర్మం వంటి అంశాలు లేవనెత్తడం, పార్లమెంట్‌లో వక్ఫ్ సవరణ వంటి మైనార్టీ తరగతుల వ్యతిరేక బిల్లులకు మద్దతు ఇవ్వడం వంటివన్నీ బిజెపి, ఆర్.ఎస్.ఎస్ శక్తులు బలపడటానికి తురుపుముక్కలుగా ఉపయోగపడుతున్నాయి. ఇప్పుడు యోగాంధ్ర సాకుతో రాష్ట్రంలో 20 వేల మంది యోగా శిక్షకులను తయారు చేసి వారి ద్వారా హిందూత్వ భావజాలాన్ని వ్యాప్తి చేయటానికి సిద్ధమయ్యారు. ఇప్పటికే 5400 మందికి కేంద్ర ప్రభుత్వం శిక్షణ ఇచ్చి యోగాంధ్ర కార్యక్రమంలో టీచర్లుగా నియమించారు. అధికారాన్ని ఉపయోగించుకొని వందల, వేల కోట్లు డబ్బును వినియోగించి ఆంధ్ర రాష్ట్రంలో తన మనువాద హిందూత్వ ఫాసిస్టు వ్యూహంలోకి ప్రజలను లాగటానికి ప్రయత్నం చేస్తున్నారు. ఈ మతతత్వ వ్యూహం రాష్ట్ర ప్రజల సమైక్యతకు, లౌకిక తత్వానికి పెను ప్రమాదాన్ని తెచ్చి పెడుతుంది. ఈ శక్తుల వ్యూహాలను, చర్యలను అన్ని మతస్తులు ఐక్యంగా, బలంగా ప్రతిఘటించడమే నేడు రాష్ట్రం ముందున్న కర్తవ్యం.

(వ్యాసకర్త సెల్ : 9490098792)

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

పిల్లలతో కలిసి తల్లి అదృశ్యం

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

పిల్లలతో కలిసి ఓ తల్లి అదృశ్యమైన ఘటన నగరంలోని ఆర్‌కె నగర్‌లో చోటు చేసుకుంది. త్రీటౌన్ సిఐ శాంతిలాల్ తెలిపిన వివరాల మేరకు.. ఆర్‌కె నగర్‌కు చెందిన కొల్లా కిరణ్‌కుమార్ భార్య కొల్లా అమరావదికి కొడుకు రిత్విక్ కుమార్, కూతురు పూజ ఉన్నారు. ఈనేపథ్యంలో గురువారం రాత్రి భర్తతో గొడవపడిన అమరావది పిల్లలతో కలిసి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు.

IN THE COURT OF III ADDL., CIVIL JUDGE (JUNIOR DIVISION) AT VIJAYAWADA
O.S.NO. 99 /2022

BETWEEN:
IDBI BANK LTD, Governorpet Branch, Vijayawada Represented By Its Deputy General Manager. ....Plaintiff

And

1. Kowtavarapu Dikshith Narayana Rao Prop: Hindustan Elevator Company Gayatrinagar, Vijayawada. 2. Kowtavarapu Durga Rao. ....Defendants

1st Defendant:- Kowthavarapu Dikshith Narayana Rao S/o.Rajeswara Rao, Prop: Hindustan Elevator Company, residing at Door No.59/13/7, Ramachandranagar, Near Babu Textiles, Gayatrinagar, Vijayawada.

2nd Defendant:- Kowtavarapu Durga Rao S/o.Narayana, residing at Door No.59/13/7, Ramachandranagar, Near Babu Textiles, Gayatrinagar, Vijayawada.

Please take Summons that the above Suit is filed against you and the same is posted on 30-06-2025 for your appearance. Therefore you are hereby directed to appear on 30-06-2025 at 10.30 A.M, either in Person or through your Advocate before the Honourable Court and in default the matter will be decided exparte.

(by Order Of The Honourable Court)

MD.HAYAD B.Com., B.L.,
Advocate # 41-9-18, L.R.K. Towers,
SF-2, 2nd Floor, Ramalayam Street,
Naidupeta, Krishna Lanka, Vijayawada-13.

సోలార్‌కు 'సాగు భూములివ్వం..!

- అధికారులకు తెగేసి చెప్పిన బొమ్మేపర్తి రైతులు



ప్రజాశక్తి-రాప్తాడు (అనంతపురం)

'తాతల కాలం నుంచి ఈ భూములపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం.. అలాంటి భూములను ఎంఎస్‌ఎంఇ పార్కుల కోసం బలవంతంగా లాక్కోవాలని చూస్తే సహించం.. ఎట్టి పరిస్థితుల్లోనూ భూములు ఇచ్చేది లేదు.' అంటూ రాప్తాడు మండలం బొమ్మేపర్తి, గొందిరెడ్డిపల్లి గ్రామ రైతులు అధికారులకు తెగేసి చెప్పారు. ఎంఎస్‌ఎంఇ పార్కుల ఏర్పాటు పేరుతో రాప్తాడు మండలం బొమ్మేపర్తి, గొందిరెడ్డి పల్లి గ్రామాల్లో భూములను తీసుకునేందుకు అధికారులు సర్వే చేశారు. దీనిని ముందు నుంచి ఆ గ్రామ రైతులు వ్యతిరేకిస్తున్నారు. భూమలిచ్చేందుకు తమకు ఇష్టం లేదంటూ సిఐటియు, రైతుసంఘం ఆధ్వర్యంలో ఇప్పటికే పలుమార్లు తహశీల్దార్, రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అయినా అధికారులు పదేపదే వస్తుండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం గ్రామానికి వచ్చిన ఆర్‌ఐ, విఆర్‌ఒలపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.రామాంజనేయులు, రైతుసంఘం మండల కార్యదర్శి పోతలయ్య మాట్లాడుతూ.. బొమ్మేపర్తి రెవెన్యూ పొలంలో 27 మంది రైతులకు 120 ఎకరాలను 60 సంవత్సరాల క్రితం ప్రభుత్వం మంజూరు చేసి పట్టాలు ఇచ్చిందన్నారు. ప్రభుత్వం భూములు ఇచ్చిన స్థలంలో అందులో పెద్దపెద్ద గుట్టలు, రాళ్లు ఉండగా రైతులు సాగు కోసం వాటిని ఎంతో శ్రమ, ఆర్థిక పరిస్థితులకు ఓర్చి సాగులోకి తెచ్చుకున్నారని తెలిపారు. ఒక్కో రైతు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చు చేశారన్నారు.

అందులో బోర్లు వేసుకుని పంటలు సాగు చేస్తున్నారన్నారు. ఇప్పుడు ఆ భూములను పరిశ్రమ పేరుతో లాగేసుకుంటే రైతులు రోడ్డున పడుతారన్నారు. రైతులు భూములు ఇచ్చేందుకు సిద్ధంగా లేకున్నా బొమ్మపర్తి పొలంలోని 307 సర్వేనెంబర్‌లో ఉన్న 114 ఎకరాలను ఎపిఐఐసికి అప్పగించడానికి తహశీల్దార్ ఉత్తర్వులు ఇవ్వడం సరికాదన్నారు. రైతులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఇలా భూములు తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. అధికారులు రైతుల పరిస్థితిని అర్థం చేసుకుని భూముల జోలికి రావొద్దని తెలియజేశారు. బలవంతంగా భూములు తీసుకోవాలని చూస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు ముత్యాలప్ప, వన్నూరప్ప, నిర్మల, మౌనిక, పార్వతమ్మ, ఎల్లమ్మ, మల్లికార్జున పాల్గొన్నారు.

నామినేషన్లు వేస్తే అంతు చూస్తా

వైసిపి నాయకులకు ఎమ్మెల్యే గుమ్మనూరు హెచ్చరిక

ప్రజాశక్తి-గుత్తి

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి నాయకులు ఎక్కడైనా నామినేషన్లు వేస్తే అంతు చూస్తానని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో సంస్థాగత ఎన్నికలకు సంబంధించి దరఖాస్తుల ను ఎమ్మెల్యేతోపాటు ఎన్నికల పరిశీలకులు స్వీకరించారు. ఈ సందర్భం గా టిడిపి గుత్తి, పామిడి మండలాల ఇన్చార్జి గుమ్మనూరు ఈశ్వర్, గుత్తి పట్టణ కన్వీనర్ ఎంకె చౌదరి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ...టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిన నియోజకవర్గంలో ఎక్కడా వైసిపి నాయకులపై కేసులు పెట్టలేదన్నారు. అన్ని సర్పంచులు, ఎంపిటిసీలు, ఎంపిపిలు, జెడ్పిటీసీలు స్థానాలను క్లైవసం చేసుకుందామని పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో వైసిపి రౌడీ, గుండా, కూనీకోరు అని అసత్య ప్రచారం చేశారన్నారు. అయినా ఇక్కడి ప్రజలు ఆదరించారన్నారు. అయినా తాను అందరిని ప్రేమించే వాడిని అన్నారు. అయితే వచ్చే సర్పంచి, ఎంపిటిసి, మున్సిపల్ ఎన్నికల్లో ఏ వైసిపి నాయకుడూ నామినేషన్ వేయకుండా చూసుకుందామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి వైసిపి నాయకుడు టిడిపికి జేజేలు కొడితే సరి.. లేదంటే తోక కత్తిరించి సున్నం పెట్టే రోజు వస్తుందన్నారు. అలాకాకుండా మా ప్రభుత్వం నారా లోకేష్ రెడ్‌బుక్ ఫైల్ చేసిన తాను మాత్రం స్థానిక సంస్థ ఎన్నికల తర్వాత ఓపెన్ చేస్తానన్నారు.

జగన్ ఆటలు సాగనివ్వం

టిడిపి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

మాజీముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆటలు ఇక సాగనివ్వమని, తమ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తే అతను బయట తిరగలేని టిడిపి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓటమి నుంచి తమ కార్యకర్తలను తప్పుదోవ పట్టించే వైసిపి మూకల పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవాలని హెచ్చరించారు. అసెంబ్లీకి రాకుండ ప్రజల సమస్యలపై మాట్లాడకుండా కేవలం కుట్ర రాజకీయాలు తెరలేపి జగన్ వర్గాలను చేస్తున్నారని విమర్శించారు. రౌడీ, గంజాయి మూకలను వెనకేసుకొస్తూ వారి పరామర్శలకు వెళ్తున్నారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య హక్కులు ఎక్కడా భంగం కలిగించకుండా తమ ప్రభుత్వం పాలన చేస్తుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా చేసే రాష్ట్రప్రభుత్వాన్ని అభాసుపాలు చేయాలని కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. తాము చెప్పిన హామీలను అమలు చేస్తున్నామని అన్నారు. తమ ప్రభుత్వం రాకముందు జరిగిన సంఘటనను తీసుకొచ్చి ప్రభుత్వానికి అంటగడుతున్నారని పేర్కొన్నారు. గత ఐదేళ్ల రైతులకు ఏం చేశారని జగన్ పొగాకు రైతుల పరామర్శకు వెళ్లారని ప్రశ్నించారు.



చెట్ల కిందే పాఠాలు

ప్రజాశక్తి, వేపాడ

విజయనగరం జిల్లా వేపాడ మండలం కరకవలస పంచాయతీ పరిధి మారిక గిరిజన గ్రామంలో ప్రాథమిక పాఠశాల భవనం నిర్మించకపోవడంతో విద్యార్థులకు చెట్ల కిందే చదువు చెప్పాల్సిన దుస్థితి నెలకొంది. ఓవైపు కార్పొరేట్ విద్యావ్యవస్థకు ధీటుగా ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తున్నామని చెబుతున్న పాలకులు గిరిజన ప్రాంతాల్లో పాఠశాలల పట్ల తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని చెప్పడానికి ఈ దృశ్యమే నిదర్శనం. దీంతో ఉపాధ్యాయులు ఆరుబయట చెట్ల కిందే పిల్లలకు పాఠాలు చెబుతున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో భవన నిర్మాణానికి నిధులు మంజూరు అయినప్పటికీ అప్పటి ప్రజాప్రతినిధులు నిర్మాణం చేపట్టకుండా అశ్రద్ధ చేశారు. నిర్మాణానికి మంజూరైన ఇనుము, సిమెంటు కరకవలస ఎంపిపి పాఠశాలలోనే నిల్వ ఉండిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా భవన నిర్మాణం ప్రారంభించలేదు. ప్రభుత్వాలు మారుతున్నా గిరిజనుల అభివృద్ధి మాటల్లో తప్ప ఆచరణలో కానరావడం లేదు.

ప్రవేశాలు లేక ఐఐటిలు వెలవెల

- నియామకాలూ అంతంత మాత్రమే
- వేధిస్తున్న సిబ్బంది కొరత



న్యూఢిల్లీ : 2015-2016లో ఏర్పాటు చేసిన మూడో తరం ఐఐటిలు ప్రస్తుతం అడ్మిషన్లు లేక వెలవెలపోతున్నాయి. ఉద్యోగ నియామకాలు కూడా సరిగా జరగడం లేదు. మాస్టర్స్, పిహెచ్‌డి ప్రోగ్రామ్స్‌లో అందుబాటులో ఉన్న సీట్ల కంటే తక్కువగానే విద్యార్థులు చేరుతున్నారు. కొన్ని ఐఐటిలు అధ్యాపకుల కొరతను ఎదుర్కొంటున్నాయి. 2015లో కేంద్ర ప్రభుత్వం పాలక్కడ్, భిలాయ్, జమ్ము, ధార్వాడ్, తిరుపతి, గోవాలో ఆరు కొత్త ఐఐటీలను ఏర్పాటు చేసింది. తాత్కాలిక క్యాంపస్‌లలో ఏర్పడిన ఈ ఐఐటీలలో మొదటి సంవత్సరం 180 మంది విద్యార్థులను చేర్చుకోవాలని భావించారు. విద్యార్థుల సంఖ్యలో రెండో ఏడాది 450కి, మూడో సంవత్సరానికి 928కి (840 మంది అండర్ గ్రాడ్యుయేట్లు సహా) పెంచాలని నిర్ణయించారు. అయితే వివిధ కారణాలతో అది సాధ్యపడలేదు.

తగ్గిన ప్రవేశాలు

'మొదటి దశలో భాగంగా 1,200 మంది విద్యార్థుల కోసం శాశ్వత క్యాంపస్ నిర్మించేందుకు 2017 నవంబరులో క్యాబినెట్ ఆమోదం తెలిపింది. కోవిడ్ కారణంగా విద్యార్థుల ప్రవేశ లక్ష్యాలను చేరుకోవడంలో కొంత జాప్యం జరిగింది. రెండో దశకు క్యాబినెట్ ఇటీవలే ఆమోదం తెలిపింది. 2029 నాటికి నిర్మాణం పూర్తవుతుంది. అప్పుడు మరో 1,300 మంది విద్యార్థులను చేర్చుకోవచ్చు. అన్ని ఐఐటీలలోనూ ఇదే పరిస్థితి' అని తిరుపతి ఐఐటి డైరెక్టర్ కె.ఎన్.సత్యనారాయణ తెలిపారు. ఐఐటీ ధార్వాడ్ విషయానికి వస్తే 2023-24లో 1,170 మంది అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు ఉంటారని అంచనా వేయగా ప్రస్తుతం క్యాంపస్‌లో 980 మంది మాత్రమే ఉన్నారు. 'మౌలిక సదుపాయాలు సహా వివిధ పారామితులను దృష్టిలో పెట్టుకొని వార్షిక ప్రవేశాలను పెంచుతాము. నిర్మాణ ప్రాజెక్టులోని 1బీ దశ కింద మరింత విస్తరించాలని అనుకుంటున్నాము. ప్రస్తుతం సంస్థలో పురోగతి నిలకడగా ఉంది' అని ఐఐటీ ఓ ప్రకటనలో తెలిపింది.

ఇక ఐఐటి భిలాయ్ విషయానికి వస్తే 2023-24లో 1,170 మంది విద్యార్థులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 756 మంది అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులే ఉన్నారు. 2017 నాటి అంచనా కంటే కూడా ఇది తక్కువే. 'ది ప్రింట్' పోర్టల్ అడిగిన ప్రశ్నకు ఐఐటీ భిలాయ్ స్పందించలేదు. సమాధానమిచ్చేందుకు ఐఐటీ పాలక్కడ్ నిరాకరించింది. ఐఐటీ జమ్ము మాత్రం స్పందిస్తూ 'మౌలిక సదుపాయాలు, అధ్యాపకులు, వనరుల లభ్యతను పరిగణనలోకి తీసుకొని విద్యార్థుల ప్రవేశాలను పెంచుకుంటూ పోతాం' అని తెలిపింది. ఐదు ఐఐటీలు తమ లక్ష్యాలను చేరుకోకపోయినప్పటికీ మే 7న ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశం మాత్రం విద్య, మౌలిక సదుపాయాల సామర్థ్యాన్ని విస్తరించేందుకు అనుమతించింది. రాబోయే నాలుగు సంవత్సరాలలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, పిహెచ్‌డి ప్రోగ్రాములలో విద్యార్థుల సంఖ్యను 6,500కు పెంచే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకుంది.

సవాళ్లతో సతమతం

గోవా ఐఐటీకి శాశ్వత క్యాంపస్ లేకపోవడంతో కేంద్రం దాని విస్తరణను పరిశీలనలోకి తీసుకోలేదు. ఏర్పాటు చేసిన నాలుగో సంవత్సరంలోనే శాశ్వత క్యాంపస్ నుండి పనిచేయాలని తొలుత ప్రణాళికలు రూపొందించుకున్నారు. అయితే ఈ మూడో తరం ఐఐటీలు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. పోస్ట్ గ్రాడ్యుయేట్, పిహెచ్‌డి ప్రోగ్రామ్స్‌లో సీట్లు ఖాళీగా ఉంటున్నాయి. ఫ్యాకల్టీ పోస్టులు కూడా ఖాళీగానే ఉన్నాయి. ప్రాంగణ నియామకాలు సైతం తగ్గిపోతున్నాయి. ప్రతి సంవత్సరం దాదాపు అన్ని ఐఐటీలలోనూ పోస్ట్ గ్రాడ్యుయేట్, పిహెచ్‌డి ప్రోగ్రామ్స్‌లో సీట్లు ఖాళీగానే ఉండడం గమనార్హం. అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులలో మాత్రం ఈ పరిస్థితి లేదు.

ప్రవేశాల పరిస్థితి

ఐఐటి భిలాయ్‌లో 2017-18, 2024-25 మధ్య 500 పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లు అందుబాటులో ఉండగా 274 మాత్రమే భర్తీ అయ్యాయి. 2018-19, 2024-25 మధ్య 510 పీహెచ్‌డీ సీట్లు అందుబాటులో ఉంటే 315 మాత్రమే భర్తీ అయ్యాయి. ఐఐటీ పాలక్కడ్‌లో 2019-20, 2024-25 మధ్య 452 పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లు అందుబాటులో ఉండగా 384 మాత్రమే భర్తీ అయ్యాయి.

2017-18, 2024-25 మధ్య 802 పిహెచ్‌డి సీట్లు అందుబాటులో ఉంటే 579 మాత్రమే భర్తీ అయ్యాయి. ఐఐటీ తిరుపతి విషయానికి వస్తే 2018-19, 2024-25 మధ్య 713 పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లు అందుబాటులో ఉండగా 534 మాత్రమే భర్తీ అయ్యాయి. 2017-18, 2024-25 మధ్య 542 పీహెచ్‌డీ సీట్లు అందుబాటులో ఉంటే 413 మాత్రమే భర్తీ అయ్యాయి. దీనిపై ఐఐటీ తిరుపతి డైరెక్టర్ స్పందిస్తూ దేశవ్యాప్తంగా అన్ని సంస్థలలోనూ ఎంటెక్, పిహెచ్‌డి ప్రోగ్రామ్స్‌కు దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య తగ్గిందని, ఫలితంగా నాణ్యమైన అభ్యర్థులు కరువయ్యారని చెప్పారు. ఐఐటి ధార్వాడ్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు 2022లో ప్రారంభమయ్యాయి. 2022-23, 2024-25 మధ్యకాలంలో 152 సీట్లు ఉండగా 102 మాత్రమే నిండాయి.

కారణాలు ఇవే

రిజర్వ్‌డ్ కేటగిరీలో అర్హులైన అభ్యర్థులు అందుబాటులో లేకపోవడమే మాస్టర్స్ స్థాయితో సీట్లు ఖాళీగా ఉండడానికి కారణమని తెలుస్తోంది. చాలా మంది విద్యార్థులు యూజీ సర్టిఫికెట్‌తోనో లేదా గేట్ స్కోరు ఆధారంగానో ఉద్యోగాలు పొందుతుండడంతో పీజీ వైపు దృష్టి సారించడం లేదు. అయితే ఐఐటి జమ్మూలో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో సీట్లు కూడా ఖాళీగానే ఉన్నాయి. కొన్ని కొత్త విద్యా సంస్థలలో ఫ్యాకల్టీ పోస్టులను కూడా భర్తీ చేయడం లేదు. ఉదాహరణకు ఐఐటీ తిరుపతిలో 2024-25లో 14.3 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జమ్మూలో 2023-24లో 30 శాతం టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అనేక విద్యా సంస్థలలో దాఖలు చేసిన పేటెంట్లకు, మంజూరైన పేటెంట్లకు మధ్య చాలా వ్యత్యాసం కన్పిస్తోంది.

నియామకాలూ అంతంతే

ఇక ప్రాంగణ నియామకాల విషయానికి వస్తే నూతన ఐఐటీలలో వాటి సంఖ్య పడిపోయిందని డేటా చెబుతోంది. పాలక్కడ్ ఐఐటీలో 2024-25లో 68.83 శాతం నియామకాలు మాత్రమే జరిగాయి. తిరుపతిలో బీటెక్ ఉత్తీర్ణుల నియామకాలు 71.86 శాతానికి పడిపోయాయి. 2021-22, 2023-24 మధ్యకాలంలో ఈ ఐదు ఐఐటీలు సహా దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీలలో ప్రాంగణ నియామకాలు అసాధారణ రీతిలో తగ్గిపోయాయని పార్లమెంటరీ కమిటీ మార్చిలో వేలెత్తి చూపింది. 2023-24లో జమ్మూ ఐఐటీలో 70.25 శాతం, ధార్వాడ్‌లో 65.56 శాతం, భిలాయ్‌లో 72.22 శాతం క్యాంపస్ నియామకాలు మాత్రమే జరిగాయని ఆ కమిటీ తెలిపింది. కొన్ని సందర్భాలలో ఎంపిక చేసిన విద్యార్థులకు ఇవ్వజూపిన వేతనం కూడా తక్కువగానే ఉంది. భిలాయ్ ఐఐటీలో 2021-22లో ఎంపికైన విద్యార్థులకు సగటున రూ.14.12 లక్షల వార్షిక వేతనం లభిస్తే 2023-24 నాటికి అది రూ.12.51 లక్షలకు తగ్గిపోయింది.

వృద్ధులు, వికలాంగులకు ..25 నుంచి 30వ తేదిలోపు సరుకులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వికలాంగులు, 65 ఏళ్లు దాటిన వృద్ధులకు ప్రతినెల 26నుంచి 30వ తేదీ లోపు సరుకులను అందజేయాలని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. విజయవాడ కానూరులోని సివిల్ సప్లై భవనంలో చౌకధరల దుకాణదారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. జూన్1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించిన రేషన్ సరుకుల పంపిణీ మొదటి 15 రోజుల్లోనే 89.64శాతం విజయవంతంగా పూర్తి కావడం ప్రజా పంపిణీ చరిత్రలో ఓ గొప్ప మైలు రాయిగా నిలిచిందన్నారు.

గిరిజన, ఏజెన్సీ ప్రాంతాలు, కొండలపైన ప్రజలకు రేషన్ షాప్‌కు దూరంలో ఉన్న ప్రజలకు సరుకులు అందించే విషయంలో డీలర్లు చొరవ చూపాలనిఅందుకు క్యాలెండర్‌ను డిస్‌ప్లే చేయాలన్నారు. షాపు బయట స్టాక్ బోర్డు, ఫీడ్ బ్యాక్ కోసం క్యూఆర్‌కోడ్‌తో కూడిన పోస్టర్‌ను విధిగా ఏర్పాటు చేయాలన్నారు.

రైతులకు లాభం చేకూరేలా మిల్లర్లు సమిష్టిగా పనిచేయాలి: నాదెండ్ల మనోహర్

రైతులకు లాభం చేకూరేలా ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండామిల్లర్లు సమిష్టిగా పనిచేయాలని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. విజయవాడ కానూరు సివిల్ సప్లై కార్యాలయంలో శుక్రవారం ఆయన రైస్ మిల్లర్లతో సమావేశమయ్యారు. రైతులు, ఖరీఫ్ సీజన్‌లో ప్రజలు కోరుకునే సన్న బియ్యం పండించేలా రైస్ మిల్లర్లు ప్రోత్స హించాలన్నారు. ప్రభుత్వం ప్రజల ఆహారపు అలవాట్లను దృష్టిలో పెట్టుకుని సన్న బియ్యం వినియోగాన్ని ప్రోత్సహిస్తోందని, అందుకే రైతులు ఆ దిశగా మొగ్గు చూపేలా రైస్ మిల్లర్లు కీలకపాత్ర పోషించాలని ఆయన తెలిపారు.

తొమ్మిది నెలల కనిష్టానికి కీలక రంగాల ఉత్పత్తి

న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థలో మందగమనం స్పష్టమవుతోంది. ఈ ఏడాది మేలో అత్యంత కీలకమైన ఎనిమిది ప్రధాన పరిశ్రమల రంగాల ఉత్పత్తి పడకేయడమే ఇందుకు నిదర్శనం. గడిచిన నెలలో మౌలిక వసతుల రంగాలు ఉత్పత్తి ఏకంగా 0.7 శాతానికి మందగించినట్లు శుక్రవారం కేంద్ర ప్రభుత్వ గణంకాలు వెల్లడించాయి. ఇది తొమ్మిది నెలల కనిష్ట స్థాయి కావడం గమనార్హం. సిమెంట్, ముడి చమురు, సహజ వాయువు, ఎరువులు, విద్యుత్, బొగ్గు, స్టీల్, రిఫైనరీ తదితర ప్రధాన రంగాలు గతేడాది ఇదే మేలో ఏకంగా 6.9 శాతం వృద్ధిని కనబర్చాయి. ఇంతక్రితం 2024 ఆగస్టులో అత్యల్పంగా మైనస్ 1.5 శాతం వృద్ధి చోటు చేసుకుంది. ఆ తర్వాత భారీ స్థాయిలో పడిపోవడం ఇదే తొలిసారి. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో వీటి వాటా 40.27 శాతంగా ఉంది. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ శుక్రవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. ముడి చమురు, సహజ వాయువు, ఎరువులు, విద్యుత్ రంగాల ఉత్పత్తి భారీగా పడిపోయింది. ఈ ఏడాది మేలో సిమెంట్ రంగం 9.2 శాతం వృద్ధిని కనబర్చింది. స్టీల్ ఉత్పత్తి 6.7 శాతంగా పెరిగింది. బొగ్గు, రిఫైనరీ ఉత్పత్తులు వరుసగా 2.8 శాతం, 1.1 శాతం చొప్పున రాణించాయి. ముడి చమురు ఉత్పత్తి 1.8 శాతానికి మందగించింది. సహజ వాయువు 3.6 శాతానికి తగ్గింది. ఎరువుల ఉత్పత్తి 5.9 శాతానికి, విద్యుత్ 5.8 శాతానికి పరిమితమయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి మే కాలంలో కీలక రంగాల ఉత్పత్తి ఏకంగా 0.8 శాతానికి క్షీణించింది. ఇంతక్రితం ఏడాది ఇదే సమయంలో 6.9 శాతం రికార్డ్ వృద్ధి చోటు చేసుకుంది. అధిక ధరలు, నిరుద్యోగం, ప్రజల ఆదాయాలు తగ్గడం తదితర పరిణామాలు వస్తు డిమాండ్‌ను దెబ్బతీస్తున్నాయి. దీంతో కొనుగోళ్లు తగ్గుతున్నాయి.

రేగులగూడలో ఏనుగుల సంచారం

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట మండలంలో గత రెండు రోజులుగా రేగులగూడ పరిసర ప్రాంతాల్లో ఏనుగులు తిష్టవేయడంతో గిరిజనులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే అటవీశాఖ అధికారులు అప్రమత్తం చేసినప్పటికీ ఆందోళన తప్పడం లేదు. రాత్రివేళలో ఇళ్లలోకి చొరబడతాయని ఆందోళన చెందుతున్నారు. ఆ గ్రామ సమీపం నుండి వెళ్లాలంటే ఏనుగులు దాడి చేస్తాయని వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇక రాత్రివేళ అయితే చెప్పనవసరం లేదు.

ఎకో జోన్‌ను వ్యతిరేకిస్తూ గ్రామసభల్లో తీర్మానం

ప్రజాశక్తి - వి.ఆర్.పురం (అల్లూరి జిల్లా)

పాపికొండల నేషనల్ పార్క్‌కు అనుబంధంగా ఎకో సెన్సిటివ్‌జోన్ పేరిట రేఖపల్లి పంచాయతీ పరిధిలోని అన్నవరం, ఉమ్మడివరం, రేఖపల్లి గ్రామాల్లో ఫారెస్ట్ అధికారులు గ్రామ పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ ఎకో సెన్సిటివ్‌జోన్ పేరిట పాపికొండల నేషనల్ పార్కు కు అనుబంధంగా మీమీ గ్రామ పరిసరాల్లో భూమిని కొంతభాగం సేకరించడం గ్రామసభ లక్ష్యమని గ్రామస్తుల అందరి అంగీకారం మేరకే ఈ సభ తీర్మానం చేస్తుందని తెలియజేశారు. ఫారెస్ట్ అధికారులు మాట్లాడుతూ ఎకోజోన్ పేరిట గ్రామసభల ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నామని తెలియజేశారు. స్థానిక గిరిజనులు ఓ ప్రక్క పోలవరం ప్రాజెక్టులో కొద్ది భూమి మునిగి పోతుంటే మరో ప్రక్క ఎకోసెన్సిటివ్ జోన్ పేరిట ఫారెస్ట్ అధికారులు భూమిని సేకరించడానికి ప్రయత్నించడం పద్ధతి కాదని, భూమిపై తమకు ఎంతో హక్కు ఉందన్నారు. భూములు సేకరించడానికి చేసే ప్రయత్నాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఎకోజోన్‌కు వ్యతిరేకంగా గ్రామసభ తీర్మానం చేయాలని ఆయా గ్రామాల ప్రజలందరూ ఏకగ్రీవంగా నిర్ణయించి తీర్మానించారు. గ్రామసభల్లో పంచాయతీ సర్పంచ్ పూనేమ్ సరోజిని, ఎంపిటిసి బంధం విజయలక్ష్మి, ఉప సర్పంచ్ పాయం లక్ష్మణరావు, పీసా కమిటి ఉపాధ్యక్ష, కార్యదర్శులు పాండ్రాజు, వేటగానిసూరి, పాయం సుబ్బారావు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ నరమేధం

- మరో 60 మంది పాలస్తీనీయుల మృతి
- ఈ వారంలో 265 మంది బలి

గాజా : పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆగడం లేదు. రోజుల తరబడి ఆహారం అందక అలమటిస్తూ... సహాయ పంపిణీ కేంద్రాల వద్దకు వచ్చిన వారే లక్ష్యంగా ఇజ్రాయిల్ దాడులకు పాల్పడుతూ నరమేధం సృష్టిస్తోంది. శుక్రవారం ఇజ్రాయిల్ చేసిన దాడుల్లో 60 మంది మరణించినట్లు పాలస్తీనా అధికారులు తెలిపారు. నెట్‌జారిమ్ కారిడార్ సమీపంలోని సహాయ పంపిణీ కేంద్రం వద్ద 26 మంది, దక్షిణ గాజా స్ట్రిప్‌లోని ఒక సహాయ కేంద్రం వద్ద 24 మంది పాలస్తీనీయులు మరణించినట్లు చెప్పారు. సహాయ కేంద్రాల వద్ద ఆహారం కోసం ప్రతిరోజు వందలాది మంది ఆశతో చేరుకుంటున్నారు. వీరిలో అనేక మంది ఇజ్రాయిల్ దాడులకు బలవుతున్నారు. ఈ వారంలో ఇప్పటి వరకూ 265 మంది మరణించారు. ఈ నెల 16న అంటే సోమవారం రఫాలోని కేంద్రం వద్ద 20 మంది మరణించారు. తరువాత రోజు మంగళవారం 80 మంది చనిపోయారు. ఖాన్ యూనిసిస్ వద్ద 50 మంది, రఫాలోని అల్ అలాంలోని కేంద్రం వద్ద 30 మంది మృతి చెందారు. బుధవారం సెంట్రల్ గాజాలోని ఒక సహాయ పంపిణీ కేంద్రం వద్ద ఉన్న క్యూలైన్‌పై షెల్స్‌తో జరిపిన దాడిలో 33 మంది మరణించారు. గురువారం గాజాలోని పలు ప్రాంతాల్లో జరిపిన దాడుల్లో 72 మంది బలయ్యారు.

హోండా నుంచి న్యూ సిటీ స్పోర్ట్ కారు

న్యూఢిల్లీ : ప్రీమియం కార్ల తయారీదారు హోండా కార్స్ ఇండియా లిమిటెడ్ (హెచ్‌ఎంఐఎల్) తన మిడ్ సైజ్ సెడాన్‌కు సంబంధించిన కొత్త వేరియంట్ 'న్యూ సిటీ స్పోర్ట్' విడుదల చేసింది. ఈ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ కారు రేడియంట్ రెడ్ మెటాలిక్, ప్లాటినం వైట్ పెర్ల్, మీటియొరాయిడ్ గ్రే మెటాలిక్ అనే 3 రంగుల్లో లభిస్తుందని తెలిపింది. 1.5 ఐ-విటెక్ పెట్రోల్ ఇంజిన్ కలిగిన ఈ కారు ఎక్స్‌షోరూం ప్రారంభ ధరను రూ.14,88,900గా నిర్ణయించింది.

విద్యానిధి కళాశాలలో విద్యార్థులతో పనులు

ప్రజాశక్తి-పరిగి

పరిగి మండల పరిధిలోని కాలువపల్లి సమీపంలో ఉన్న విద్యానిధి జూనియర్ కళాశాలలో విద్యార్థుల చేత పనులు చేయించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ కళాశాలకు సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులు వచ్చి చదువుకుంటున్నారు. కళాశాల పున:ప్రారంభం నేపథ్యంలో యాజమాన్యం కళాశాలలో మరమ్మతులు, పరిశుభ్రత పనులకు ఉపక్రమించింది. ఈ క్రమంలో కళాశాల ప్రాంగణంలో ఉన్న పలు వస్తువులను విద్యార్థుల చేత అక్కడి నుంచి ఇక్కడికి మోయించడం చూసిన ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు యాజమాన్యం వైఖరిపై మండిపడుతున్నారు.

డిఎన్‌ఎ పరీక్షల్లో 220 మంది గుర్తింపు, 202 మృతదేహాల అప్పగింత

అహ్మదాబాద్ : డిఎన్ఎ పరీక్షల్లో ఇప్పటివరకు 220 మంది బాధితులను గుర్తించామని, 202 మంది మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించామని గుజరాత్ ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. ఎనిమిది రోజుల క్రితం గుజరాత్‌లోని అహ్మదాబాద్ విమానాశ్రయంలో ఎయిరిండియా విమానం ప్రభుత్వ మెడికల్ కాలేజీపై కూలిపోయిన సంగతి తెలిసిందే. ఇప్పటివరకు 220 డిఎన్ఎ నమూనాలను గుర్తించారని, బాధితుల బంధువులను సంప్రదించారని రాష్ట్ర ఆరోగ్య మంత్రి రుషికేష్ పటేల్ తెలిపారు. 202మంది మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించారని, మిగిలిన వారి గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని అన్నారు. 202మందిలో 160 మంది భారతీయులు ఉన్నారని, వారిలో 151 మంది ప్రయాణికులు కాగా, తొమ్మిది మంది స్థానికులని అన్నారు. వీరిలో ఏడుగురు పోర్చుగీస్ జాతీయులని, 34మంది బ్రిటన్ వాసులని, ఒకరు కెనడియన్ ఉన్నట్లు తెలిపారు. 15 మృతదేహాలను విమానంలో తరలించగా, 187 మృతదేహాలను రోడ్డుమార్గం ద్వారా పంపినట్లు రుషికేష్ వెల్లడించారు. ఇప్పటివరకు బిజెపి నేతృత్వంలోని గుజరాత్ ప్రభుత్వం మృతుల సంఖ్యను అధికారికంగా ధ్రువీకరించలేదు. ప్రయాణికులు, మెడికల్ కాలేజీ విద్యార్థులు సహా 250 మంది బాధితుల నుండి డిఎన్ఎ నమూనాలను పరీక్ష కోసం సేకరించినట్లు గతంలో అధికారులు ప్రకటించారు.

గౌతమ్ నవ్‌లఖా ఢిల్లీలో నివసించేందుకు కోర్టు నిరాకరణ

ముంబయి : ఎల్గార్ పరిషద్ కేసులో నిందితుడైన గౌతమ్ నవ్‌లఖా ఢిల్లీలో నివసించేందుకు ముంబయి కోర్టు అనుమతి నిరాకరించింది. ఎల్గార్ పరిషద్ కార్యకర్త గౌతమ్ పెట్టుకున్న పిటిషన్‌ను ఎన్ఐఎ ప్రత్యేక న్యాయమూర్తి చాకర్ బవిస్కర్ తిరస్కరించారు. కోర్టు పరిధి దాటి ప్రయాణించడానికి నిందితుడికి అనుమతినివ్వడమనేది ఒక అంశమైతే, అలాకాకుండా కోర్టు పరిధులను దాటి నిందితుడు శాశ్వతంగా నివసించడానికి అనుమతించడమనేది పూర్తిగా భిన్నమైన అంశమని, ఇది కుదరదని న్యాయమూర్తి పేర్కొన్నారు. గౌతమ్ బెయిల్ షరతులను నిర్దేశిస్తూ, అటువంటి స్వేచ్ఛను ఆయనకు మంజూరు చేయడం లేదని బాంబే హైకోర్టు పేర్కొంది. ఈ సందర్భంగా ఈ అనవసరమైన దరఖాస్తును తిరస్కరిస్తున్నట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు. ఢిల్లీ నివాసి అయిన నవ్‌లఖా (72) 2020 ఏప్రిల్‌లో ఈ కేసులో అరెస్టయ్యారు. 2024 మేలో సుప్రీంకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. ప్రత్యేక ఎన్ఐఎ కోర్టు అనుమతి లేకుండా ముంబయి వదిలి వెళ్లరాదన్నది ఆయన బెయిల్ షరతుల్లో ఒకటిగా వుంది. దాంతో ఆయన తన జీవిత భాగస్వామితో కలిసి ముంబయిలోనే నివసిస్తున్నారు. ఇక్కడ సుస్థిర జీవన శైలి తనకు కుదరడం లేదని, అందువల్ల ఢిల్లీలో నివసించేందుకు అనుమతించాలని కోరుతూ ఆయన పిటిషన్ పెట్టుకున్నారు. దాన్ని తాజాగా ముంబయి కోర్టు తిరస్కరించింది.

ముంబయి లోకల్ రైళ్లలో ప్రమాదాలు ఆపండి

- ఆటోమేటిక్ తలుపులు పెట్టాలని బాంబే హైకోర్టు సూచన

ముంబయి : ముంబయి లోకల్ రైళ్లలో ప్రయాణికుల మృతి పట్ల బాంబే హైకోర్టు శుక్రవారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. జనంతో కిక్కిరిసి వున్న సబర్బన్ రైల్లో నుండి పడిపోయి ఐదుగురు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో న్యాయస్థానం ఈ పరిస్థితిని తీవ్ర ఆందోళనకరమైనదిగా అభివర్ణించింది. ముంబయి లోకల్ రైళ్లలో ఆటోమేటిక్‌గా తలుపులు మూసుకుపోయే యంత్రాంగం నెలకొల్పాలని కోర్టు సూచించింది. అప్పుడు ఈ మరణాలు నివారించవచ్చని అభిప్రాయపడింది. తమది కేవలం సూచన మాత్రమేనని, రైల్వే శాఖ నిపుణులు ఈ అంశంపై కూలంకషంగా సమీక్షించి నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొంది. భవిష్యత్తులో ముంబయి సబర్బన్ నెట్‌వర్క్‌లో ఇలాంటి విషాదకర సంఘటనలు పునరావృం కాకుండా చూసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఆరాధె, జస్టిస్ సందీప్ మార్నెలతో కూడిన డివిజన్ బెంచ్ పేర్కొంది.

కెనడాలో భారతీయ విద్యార్థిని మృతి



వాంకోవర్ : కెనడాలో భారతీయ విద్యార్థిని తాన్యా త్యాగి మరణించారు. ఇప్పటివరకు కెనడా అధికారులు ఆమె మృతికి సంబంధించి సమాచారాన్ని అధికారికంగా ప్రకటించలేదు. ఆమె మృతికి గల కారణాలనూ వివరించలేదు. ఆమె మృతిని వాంకోవర్‌లోని భారత కాన్సులేట్ జనరల్ గురువారం ధ్రువీకరించింది. తాన్యా త్యాగి ఈశాన్య ఢిల్లీకి చెందినవారు. కెనడాలోని కాల్గరి యూనివర్సిటీలో ఉన్నత చదువులు చదువుకునేందుకు భారత్ నుంచి వచ్చారు. ఆమెకి తీవ్రమైన గుండెపోటు రావడంతో మరణించారని భారత కాన్సులేట్ అనుమానం వ్యక్తం చేసింది. ఆమె మృతికి కాన్సులేట్ సంతాపం ప్రకటించింది. అధికారులతో సంప్రదింపులు జరిపి.. త్యాగి కుటుంబ సభ్యులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు భారత కాన్సులేట్ జనరల్ ఎక్స్ పోస్టులో తెలిపింది. తాన్యా త్యాగి ఈ 17న గుండెపోటుతో మరణించారని, ఆమె మృతదేహాన్ని భారత్‌కి చేర్చడానికి తగిన సహాయం అందించాలని ఆమె కుటుంబ సభ్యులు, స్నేహితులు ప్రధాని మోడీకి విజ్ఞప్తి చేసినట్లు భారత కాన్సులేట్ జనరల్ ఎక్స్ పోస్టులో పేర్కొంది.

విద్యుత్తు బస్సుల ముసుగులో ప్రైవేటుకు ఆర్‌టిసి స్థలాలు!

(మొదటిపేజీ తరువాయి)
వీలైనంత త్వరగా పంపాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

3 కేటగిరీలుగా గుర్తించాల్సిన విషయాలు

విద్యుత్తు బస్సుల స్టేషన్ల ఏర్పాటుకు మూడు కేటగిరీలుగా ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు ఫార్మెట్‌ను వినియోగిస్తున్నారు. ఇందులో సివిల్ ఇంజినీరింగ్ సమాచారం, టెక్నాలజీ డిపార్టుమెంట్ సమాచారం, ఉపరేషన్స్ డిపార్టుమెంట్‌కు సంబంధించిన సమాచారాన్ని నమోదు చేయాల్సి ఉంటుంది. సివిల్ ఇంజినీరింగ్ సమాచారంలో సిటి/టౌన్ క్లస్టర్, గుర్తించిన డిపో లొకేషన్, ప్రతిపాదించిన బస్సులు, ఏరియా (హెక్టార్లు), బస్సులు నిలుపుదలకు స్థలం, గ్రీన్‌ఫీల్డ్ అభివృద్ధి చేయాల్సిన స్థలం, అందుబాటులో ఉన్న గుర్తించిన స్థలం వివరాలు నమోదు చేయాలని కోరారు. టెక్నాలజీ డిపార్టుమెంట్ విషయానికొస్తే ఆటోమేటెడ్ వెహికల్ లొకేషన్ సిస్టమ్ (ఎవిఎల్ఎస్), ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టమ్ (ఎఫ్‌సిఎస్), పిపిపి కాంట్రాక్టు మేనేజ్‌మెంట్ మాడ్యూల్‌కు సంబంధించిన వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది.

విద్యుత్తు బస్సుల్లో ఆర్‌టిసి డ్రైవర్లు, కండక్టర్లు ఉండాల్సిందే : ఎస్‌డబ్ల్యుఎఫ్

త్వరలో రోడ్ల మీదకు రానున్న విద్యుత్తు బస్సుల్లో కచ్చితంగా డ్రైవర్లు, కండక్టర్లు ఆర్‌టిసి సిబ్బంది తప్పనిసరిగా ఉండాల్సిందేనని ఎస్‌డబ్ల్యుఎఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మొదటి విడతలో కేటాయించే 750 బస్సుల్లో డ్రైవర్ల వరకు ఆర్‌టిసి ఉద్యోగులు ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోందని, కండక్టర్లను కూడా నియమించాల్సిందేనని పేర్కొంది. విద్యుత్తు బస్సులకు కేంద్రం ఇచ్చే రాయితీలను నేరుగా ఆర్‌టిసిలకే ఇవ్వాలని డిమాండ్ చేసింది.

మూడు రెట్లు పెరిగిన నల్లధనం

- స్విస్ బ్యాంకుల్లో దాచిన పెద్దలు
- ఏడాదిలోనే భారీగా తరలింపు
- మోడీ హయాంలో 70 నుంచి 48వ స్థానంలోకి ఎగబాకిన భారత్



ప్రజాశక్తి - బిజినెస్ డెస్క్

"భారతదేశ ఆర్థిక వ్యవస్థకు నల్లధనం పెద్ద ముప్పుగా మారింది. ఇది పన్ను ఎగవేత, అవినీతి, ఆర్థిక అసమానతలకు కారణం. గత ప్రభుత్వాల్లో దోచిన డబ్బును దేశ సంపదను విదేశాలకు తరలించడం ద్వారా సామాన్య ప్రజలకు ఆర్థిక ప్రయోజనాలు అందకుండా చేస్తున్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే స్విస్ బ్యాంకుల్లో దాచిన నల్లధనాన్ని తిరిగి తీసుకొచ్చి ప్రతి భారతీయుడి బ్యాంక్ ఖాతాలో రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలు వేస్తాము." అని 2014 ఎన్నికల ప్రచారంలో నరేంద్ర మోడీ పదే పదే ప్రజలకు హామీ ఇచ్చారు. ఇది జుమ్లాగానే మిగిలిపోయిందని మరోమారు నిరూపణ అయ్యింది. స్విస్ బ్యాంక్‌ల్లో ఉన్న నల్లధనాన్ని తేకపోగా.. అది మరింత పెరుగుతుంటే మోడీ సర్కార్ కళ్లప్పగించి చూస్తోంది.

రాజకీయ పెద్దలు, కార్పొరేట్లు అక్కడ రికార్డు స్థాయిల్లో డిపాజిట్లు చేయడం ద్వారా గడిచిన 2024లో స్విస్ బ్యాంకుల్లో భారతీయుల ధనం అమాంతం పెరగడం ఆశ్చర్యం కలిగిస్తోంది. స్విస్ నేషనల్ బ్యాంకు (ఎస్ఎన్‌బి) తాజా గణాంకాల ప్రకారం.. స్విట్జర్లాండ్ బ్యాంకుల్లో భారతీయుల డబ్బు 2024లో మూడు రెట్లు పెరిగి సుమారు రూ.37,000 కోట్ల (3.5 బిలియన్ స్విస్‌లు)కు పైగా చేరుకుంది. ఇది 2021 తర్వాత అత్యధికం కావడం గమనార్హం. 2023లో 1.04 బిలియన్ స్విస్ ఫ్రాంక్‌లు (రూ.9,800 కోట్లు)గా ఉంది. 2021లో 3.83 బిలియన్ స్విస్ ఫ్రాంక్‌లు (సుమారు రూ. 30,500 కోట్లు) స్విస్ బ్యాంకుల వద్ద ఉంది. సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతోన్న వేళ ఖర్చుల కోసం పెద్దలు ఒక్క సారిగా స్విస్ బ్యాంకుల నుంచి డబ్బులు ఉపసంహరించుకున్నారనే అనుమానాలు తలెత్తుతున్నాయి. దీంతో 2023లో 70 శాతం తగ్గిపోయింది. ఎన్నికల అనంతరం తిరిగి అనూహ్యంగా పెరగడం విశేషం.

స్విస్ బ్యాంకుల్లో భారతీయ డబ్బు వివిధ రూపాల్లో ఉంది. కస్టమర్ డిపాజిట్‌ల రూపంలో 346 మిలియన్ స్విస్ ఫ్రాంక్‌లు (సుమారు రూ.3,675 కోట్లు) ఉన్నాయి. ఇతర బ్యాంకుల ద్వారా స్విస్ బ్యాంకుల్లోకి వచ్చిన 3.02 బిలియన్ స్విస్ ఫ్రాంక్‌లుగా నమోదయ్యాయి. ట్రస్ట్‌ల ద్వారా 41 మిలియన్ స్విస్ ఫ్రాంక్‌లు జమ అయ్యాయి. బాండ్లు, సెక్యూరిటీలు, ఇతర ఆర్థిక సాధనాల ద్వారా 135 మిలియన్ స్విస్ ఫ్రాంక్‌లు వచ్చి చేరాయి. స్విట్జర్లాండ్ అధునాతన ట్రస్ట్ చట్టాలు సంపన్న కుటుంబాలు తమ ఆస్తులను బినామీల ద్వారా డిపాజిట్ చేసుకుని రక్షించుకోవడానికి అవకాశం కల్పిస్తున్నాయి. ఇలాంటి వాటిని స్విస్ నల్లధనంగా భావించదు. స్విస్ బ్యాంక్‌ల్లో డిపాజిట్లలో భారత్ 2023లో 67వ స్థానంలో ఉండగా.. 2024లో 48వ స్థానానికి పెరిగింది. 2015లో ఈ ర్యాంక్ 75గా ఉండటం విశేషం. 2012లో 71వ ర్యాంక్‌లో ఉంది. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాతే స్విస్ బ్యాంక్‌ల్లో భారత డిపాజిట్లు అమాంతం పెరిగాయని స్పష్టమవుతోంది. 70లో ఉన్న భారత ర్యాంక్ 48వ స్థానానికి ఎగబాకడం తీవ్ర ఆందోళకరం. స్విస్ బ్యాంకులో డబ్బులు దాచిన ప్రపంచ దేశాల జాబితాలో బ్రిటన్ 222 బిలియన్ స్విస్ ఫ్రాంక్స్‌తో మొదటి స్థానంలో కొనసాగుతుంది. 89 బిలియన్ స్విస్ ఫ్రాంక్స్‌తో రెండవ స్థానంలో అమెరికా ఉంది. భారత్ పొరుగు దేశాలైన పాకిస్తాన్ 272 మిలియన్లు, బంగ్లాదేశ్ 589 మిలియన్ల స్విస్ ఫ్రాంక్‌ల డిపాజిట్లు కలిగి ఉన్నాయి. రాజకీయ నాయకులు, బడా కార్పొరేట్లు పన్నులు ఎగవేసి, అక్రమ మార్గాల ద్వారా సంపాదించింది స్విస్ బ్యాంకులో దాచుకుంటున్నారు. ఇరు దేశాలు 2016వ సంవత్సరంలో ఆటోమేటిక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ (ఎఇఒఐ) ఒప్పందం చేసుకున్నాయి. దీని ప్రకారం 2018 నుంచి సమాచారాన్ని భారత ప్రభుత్వానికి అందిస్తున్నామని స్విస్ అధికారులు తెలిపారు.

'ప్రవేశ పరీక్షల'పై పరిశీలనకు తొమ్మిది మందితో ప్యానెల్

- కేంద్ర విద్యామంత్రిత్వశాఖ నిర్ణయం

న్యూఢిల్లీ : వివిధ ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు కోసం నిర్వహించే ఎంట్రన్స్ ఎగ్జామ్‌లపై పరిశీలనకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ తొమ్మిది మంది సభ్యులతో ఒక ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది. కేంద్ర ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి వినీత్ జోషి నేతృత్వంలో ఏర్పాటైన ఈ ప్యానెల్ ప్రవేశ పరీక్షల న్యాయబద్ధతతో పాటు, విద్యార్థులపై ప్రవేశ పరీక్షల ప్రభావాన్ని, ప్రవేశ పరీక్షల కోసం విద్యార్థులు కోచింగ్ సెంటర్లపై ఆధారపడటాన్ని పరిశీలిస్తుంది. 'విద్యార్థులు కోచింగ్ సెంటర్లపై ఆధారపడటానికి దోహదపడే ప్రస్తుత విద్యా వ్యవస్థలోని అంతరాలను ఈ ప్యానెల్ పరిశీలన చేస్తుంది' అని విద్యా మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. అధికారిక పాఠశాల విద్యను పణంగా పెట్టి మరీ, విద్యార్థులు పూర్తి సమయాన్ని కోచింగ్ సెంటర్లకు కేటాయించడంపై ప్యానెల్ ప్రధానంగా అధ్యయనం చేస్తుందని అధికారి చెప్పారు. డమ్మీ స్కూల్స్ (కోచింగ్ సెంటర్లు) ఆవిర్భావం వెనుక కారణాలను కూడా ప్యానెల్ పరిశీలన చేస్తుందని తెలిపారు. వివిధ కెరీర్ మార్గాల గురించి విద్యార్థులు, తల్లిదండ్రులకు ఉన్న అవగాహన స్థాయిలను అంచనా వేయడం, కొన్ని ఉన్నత సంస్థలపై అతిగా ఆధారపడటానికి గల కారణాలను ఈ ప్యానెల్ పరిశీలిస్తుంది. పాఠశాలలు, కళాశాలలలో ప్రస్తుతం ఉన్న కెరీర్ కౌన్సెలింగ్ సేవల లభ్యత, ప్రభావాన్ని ఈ ప్యానెల్ అంచనా వేస్తుందని ఆ అధికారి తెలిపారు.

పాఠ్యాంశంగా 'గవర్నర్ పాత్ర, రాజ్యాంగ పరిమితులు'

- కేరళ విద్యాశాఖ నిర్ణయం

తిరువనంతపురం : 'గవర్నర్ పాత్ర, అధికారాలు – రాజ్యాంగ పరిమితులు' అంశాన్ని ఉన్నత మాధ్యమిక తరగతుల సిలబస్‌లో చేర్చనున్నట్లు కేరళ విద్యాశాఖ ప్రకటించింది. రాష్ట్ర గవర్నర్ అధికారిక పాత్ర, నిర్దేశించిన రాజ్యాంగ పరిమితులు సహా దేశ సమాఖ్య రాజకీయాల గురించి తెలియజేసే ప్రజాస్వామ్య, రాజ్యాంగ ప్రక్రియల గురించి విద్యార్థులు తెలుసుకోవడం సామాజికంగా అత్యవసరమని విద్యామంత్రి వి.శివన్‌కుట్టి శుక్రవారం మీడియాకు తెలిపారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ముఖ్యమంత్రి, మంత్రి మండలి, అసెంబ్లీలకు ప్రజల పట్ల ఉన్న సమిష్టి బాధ్యతల గురించి యువత తెలుసుకోవాల్సిన అవసరముందని చెప్పారు. ఆర్ఎస్ఎస్ కార్యక్రమాల్లో భారతమాతగా పేర్కొంటూ ప్రదర్శించే సింహంపై కాషాయ జెండాతో ఉన్న మహిళ చిత్రాన్ని అధికారిక కార్యక్రమంలో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ప్రదర్శించడాన్ని నిరసిస్తూ కేరళ విద్యాశాఖ మంత్రి వి.శివన్‌కుట్టి వాకౌట్ చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్ర నిధులతో నడిచే యూనివర్శిటీల నిర్వహణలో ఛాన్సలర్‌గా గవర్నర్ జోక్యం చేసుకోవడం, అసెంబ్లీ తీర్మానించిన బిల్లుల ఆమోదానికి నిరాకరించడం, రాష్ట్రపతి ఆమోదం కోసం రిజర్వ్ చేయడం ద్వారా కీలక బిల్లులను ఆలస్యం చేయడం, రాష్ట్ర కార్యక్రమాల్లో రాజకీయ పార్టీల చిహ్నాలను ప్రదర్శించడాన్ని కేరళ ప్రభుత్వం వ్యతిరేకిస్తోంది. ఆర్ఎస్ఎస్ సందేశాలకు కేంద్ర ప్రభుత్వం రాజ్‌భవన్‌ను వేదికలా మార్చిందని విమర్శించింది.

ట్రంప్ కంపెనీతో ముకేష్ అంబానీ ఒప్పందం

న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు చెందిన రియల్ ఎస్టేట్ కంపెనీతో భారత బిలియనీర్ ముకేష్ అంబానీ కీలక ఒప్పందం కుదర్చుకున్నట్లు వెల్లడయ్యింది. ఈ విషయం డోనాల్డ్ ట్రంప్ వార్షిక ఆర్థిక నివేదిక ద్వారా వెలుగులోకి వచ్చింది. ఈ నివేదిక ట్రంప్ ఆర్గనైజేషన్ అందుకున్న విదేశీ లైసెన్సింగ్, అభివృద్ధి రుసుములను వెల్లడించింది. ట్రంప్ రియల్ ఎస్టేట్ సంస్థతో 10 మిలియన్ డాలర్ల (దాదాపు.86 కోట్లు)కు రిలయన్స్ సంస్థ 4ఐఆర్ రియాల్టీ డెవలప్‌మెంట్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఇందులో భాగంగా అంబానీ ముంబయిలో తమ రాబోయే ప్రాజెక్ట్ కోసం 'ట్రంప్' బ్రాండ్ పేరును ఉపయోగించుకోనున్నారని తెలుస్తోంది.

ఇజ్రాయిల్‌పై పెల్లుబికిన ఆగ్రహం!

- ఇరాన్, ఇరాక్, వెనిజులాలో భారీ ప్రదర్శనలు


ఇరాన్, పాలస్తీనాకు మద్దతుగా ప్రదర్శన నిర్వహిస్తున్న వెనిజులా వాసులు

టెహరాన్ : ఎలాంటి కవ్వింపు చర్యలు లేకుండానే ముందస్తు దాడులకు పాల్పడిన ఇజ్రాయిల్ తీరును ఖండిస్తూ ఇరాన్‌తోపాటు ఇరాక్, వెనిజులాలో ఆగ్రహం పెల్లుబుకుతోంది. వందలు వేల సంఖ్యలో ప్రజలు వీధుల్లోకి వచ్చి ఇజ్రాయిల్ పట్ల ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ శుక్రవారం భారీ ప్రదర్శనలు నిర్వహించారు. ఇరాన్ రాజధాని నగరం టెహరాన్, తబ్రిజ్, గిలాన్, ఇస్ఫాహన్‌లతో సహా దేశవ్యాప్తంగా పలు పెద్ద, చిన్న నగరాల్లో కనివినీ ఎరుగని రీతిలో భారీ ప్రదర్శనలు జరిగాయి. ఇజ్రాయిల్ దాడులు కొనసాగుతున్నా లెక్కచేయకుండా ఈ ప్రదర్శనలు జరగడం విశేషం. టెహరాన్ యూనివర్శిటీలో శుక్రవారం ప్రార్థనల అనంతరం పెద్ద సంఖ్యలో ప్రజలు ఇరాన్, పాలస్తీనా, హిజ్బుల్లా పతాకాలు చేబూని నినాదాలు చేయడం కనిపించింది.

ఇజ్రాయిల్ దాడులను సమర్థవంతంగా తిప్పికొడుతూ ఇరాన్ ప్రతీకారంతో జరుపుతున్న దాడులను సమర్థిస్తున్నామని వారు నినాదాలు చేశారు. ఇజ్రాయిల్ దాడుల వేళ దేశ ప్రజలంతా సమైక్యంగా వుండాలంటూ ఇరాన్ సుప్రీం నేత ఖమేనీ పిలుపునిచ్చిన నేపథ్యంలో కొంతమంది ఖమేనీ ఫోటోలను కూడా పట్టుకోవడం ప్రదర్శనల్లో కనిపించింది. మరికొంతమంది ఈ దాడుల్లో చనిపోయిన కమాండర్ల ఫోటోలను ప్రదర్శించారు. టెహరాన్ ప్రదర్శనల్లో ఇరాన్ చీఫ్ జస్టిస్ గులామ్ హుస్సేన్, ఐఆర్‌జిసి మాజీ కమాండర్ మేజర్ జనరల్ మహ్మద్ అలీ జఫరీ, పలువురు మంత్రులు, పార్లమెంట్ డిప్యూటీ స్పీకర్ ప్రభృతులు పాల్గొన్నారు.

బాగ్దాద్, బీరుట్‌ల్లోనూ ప్రదర్శనలు

ఇరాక్‌లో కూడా ఇరాన్‌కు మద్దతుగా వేలాదిమంది ప్రదర్శనలు చేపట్టారు. బాగ్దాద్‌లోని సదర్ ప్రాంతంలో శుక్రవారం ప్రార్థనల అనంతరం ప్రజలు అమెరికా, ఇజ్రాయిల్‌లకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రదర్శనల్లో పాల్గొన్నారు. విప్లవ నగరంగా పేరుబడిన సదర్ సిటీ బాగ్దాద్‌కు శివారు ప్రాంతంగా వుంది. దక్షిణ బీరుట్ నగరంలో కూడా ఇరాన్ అనుకూల ర్యాలీ జరిగింది.

వెనిజులాలో...

ప్రపంచ శాంతిని కోరుతూ, ఇరాన్, పాలస్తీనాలకు మద్దతుగా, ఇజ్రాయిల్ వైఖరిని ఖండిస్తూ వెనిజులా వాసులు గురువారం భారీ ప్రదర్శన నిర్వహించారు. వేలాదిమంది కారకస్ వీధుల్లోకి వచ్చి నినదించారు. విదేశీ దురాక్రమణ చర్యలను ఖండిస్తూ... తక్షణమే ఈ యుద్ధాలను ఆపేందుకు అంతర్జాతీయ సమాజం ఏకతాటిపైకి రావాలని వెనిజులా నేతలు కోరారు. పాలక యునైటెడ్ సోషలిస్టు పార్టీ ఆఫ్ వెనిజులా (పిఎస్‌యువి) సెక్రటరీ జనరల్ డిసోడాడో కాబెల్లో ఈ ప్రదర్శనకు నాయకత్వం వహించారు. ఆత్మరక్షణ కోసం, తమ భూభాగ రక్షణ కోసం పోరాడే హక్కు ఇరాన్‌కు వుందని అన్నారు. వెనిజులా నేషనల్ అసెంబ్లీ అధ్యక్షుడు జార్జి రొడ్రిగజ్ మాట్లాడుతూ మన చిన్నారులకు అందమైన, ప్రశాంతమైన ప్రపంచాన్ని ఇవ్వాల్సిన అవసరం వుందని అన్నారు.

సహకారంపైనే ప్రధానంగా దృష్టి

- న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టొఫర్‌తో చైనా నేత జిన్‌పింగ్ భేటీ

బీజింగ్ : ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవాలని చైనా, న్యూజిలాండ్ నిర్ణయించాయి. న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టొఫర్ లక్సాన్ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరుదేశాలు సహకారంపై ప్రధానంగా దృష్టి సారించాలని జిన్‌పింగ్ కోరారు. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 50ఏళ్లకి పైనే అయిందని అన్నారు. ఇరు దేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం నెలకొందన్నారు. ఈ భాగస్వామ్యాన్ని మరింత పెంచుకునేందుకు, ఇరు దేశాల ప్రజల ప్రయోజనాలకు ఉపయోగపడేందుకు కృషిచేయాలని జిన్‌పింగ్ కోరారు. ద్వైపాక్షిక సంబంధాల్లో సహకారానికి ప్రాధాన్యతనివ్వాలన్నారు. వాణిజ్య, పెట్టుబడుల సహకారం పెరగాలన్నారు. శాస్త్రీయ, సాంకేతిక, వాతావరణ మార్పులు, మౌలిక వసతులు వంటి రంగాల్లో సహకారానికి గల అవకాశాలను అన్వేషించాలన్నారు. చైనాతో గల వాణిజ్య సంబంధాల ప్రాముఖ్యతను లక్సాన్ నొక్కి చెప్పారు. 2023 చివరిలో ప్రధాన మంత్రి బాధ్యతలు చేపట్టిన లక్సాన్ చైనాలో తొలిసారిగా శుక్రవారం పర్యటించారు. చైనా వాణిజ్య కేంద్రమైన షాంఘైలో అధికార, వాణిజ్య నేతలతో రెండు రోజులుగా సమావేశాలు, చర్చలు జరిపిన అనంతరం లక్సాన్ బీజింగ్ వచ్చారు. చైనాతో ఆరోగ్యకరమైన వాణిజ్య సంబంధాలను సాగించాలని తాము కోరుకుంటున్నామన్నారు. న్యూజిలాండ్ ఉత్పత్తులకు చైనా కీలకమైన మార్కెట్ అని అన్నారు. ప్రాంతీయ, అంతర్జాతీయ భద్రతా అంశాలపై అభిప్రాయ భేదాలు వున్నప్పటికీ ఆ దేశంతో వాణిజ్యాన్ని నెరపాలనుకుంటున్నామని చెప్పారు.

యోగాంధ్రకు సర్వం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

సముద్రంపై 11 యుద్ధనౌకలను నేవీ సిద్ధం చేసి ఉంచింది. యోగా ప్రారంభానికి ముందు ఉదయం 6.30 గంటలకు ప్రధాని సమక్షంలో నావికాదళ సిబ్బంది విన్యాసాలు చేపట్టనున్నారు. శుక్రవారం రాత్రంతా నౌకలు విద్యుద్దీపాలంకరణతో కళకళలాడాయి. ఒక్కో యుద్ధనౌకపై ఒక్కో యుద్ధ విమానాన్ని త్రివిధ దళాల సేనలు విన్యాసాలకు వీలుగా ఏర్పాట్లు చేశాయి. శనివారం ఉదయం 6.30 గంటలలోపే ప్రధాని, గవర్నర్, సిఎం, డిప్యూటీ సిఎం, మంత్రులు, రాష్ట్ర స్థాయి అధికారులు కాళీమాత టెంపుల్ వద్దకు చేరుకోనున్నారు. 6.30 గంటల నుంచి 8.15 గంటల వరకూ యోగా విన్యాసాలు సాగరతీరం అంతటా జరుగనున్నాయి. ఐదు లక్షల మంది ఈ యోగాలో పాల్గొంటారని రాష్ట్ర, జిల్లా అధికారులు చెబుతున్నారు.

తీరం వెంబడి ఏర్పాట్లు

ఆర్‌కె బీచ్ నుంచి భోగాపురం తీరం వరకూ 30.16 కిలోమీటర్లలో కంపార్టుమెంట్లు ఏర్పాటు చేసి ఒక్కోదానిలో వెయ్యి మందిని నింపేందుకు ఏర్పాట్లు చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి జనాన్ని తరలించేందుకు సుమారు 9,900 వాహనాలను ఏర్పాటు చేశారు. 80 చోట్ల విశాఖ నగరంలో పార్కింగ్ స్థలాలను కేటాయించారు. 307 ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలు, 50 మెడికల్ శిబిరాలు, 116 అంబులెన్సులను సిద్ధం చేశారు. యోగాభ్యాసకులు శనివారం వేకువజామున 5.30 గంటలకల్లా వారికి కేటాయించిన కంపార్టుమెంట్లలోకి రానున్నారు. 3.50 లక్షల మ్యాట్‌లను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఐదు లక్షల టీ షర్టులను యోగాసనాలు వేసేవారికి అందించనున్నారు. ఎయు ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో అల్లూరి జిల్లాకు చెందిన 26, 400 మంది గిరిజన విద్యార్థులతో సూర్య నమస్కారాలకు ఏర్పాట్లు చేశారు.

తొలుత ప్రముఖుల ప్రసంగాలు

యోగా డే సందర్భంగా శనివారం ఉదయం యోగా విన్యాసాలకు ముందే ప్రముఖులు ప్రసంగించనున్నారు. తొలుత కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ నాలుగు నిమిషాలు, ఆ తర్వాత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రెండు నిమిషాలు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాలుగు నిమిషాలు ప్రసంగించనున్నారు. అనంతరం ప్రధాని మోడీ 15 నిమిషాలు ప్రసంగిస్తారు. ఇలా ఏడు గంటలకల్లా ప్రసంగాలు ముగుస్తాయి. ఎనిమిది గంటల వరకూ యోగా విన్యాసాలుంటాయి. ప్రముఖులంతా విశాఖకు చేరుకోవడంతో 12 వేల మంది పోలీసులు బందోబస్తు విధుల్లో ఉన్నారు. 1300 సిసి కెమెరాలతో నిఘా ఉంచారు.


సంఘ్ గూండాల దాడిలో గాయపడిన దిండిగల్ తాలూకా కార్యదర్శి శరత్‌కుమార్

తమిళనాడులో సిపిఎం కార్యకర్తలపై 'సంఘ్' గూండాల దాడి

చెన్నై : తమిళనాడులో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సిపిఎం కార్యకర్తలపై సంఘ్ పరివార్‌కు చెందిన గూండాలు దాడి చేశారు. దిండిగల్ జిల్లా బర్డోర్స్ ప్రాంతంలో ఈ దారుణం జరిగింది. పరివార్ గూండాల దాడిలో సిపిఎం దిండిగల్ తాలూకా కార్యదర్శి శరత్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మిగిలిన పార్టీ కార్యకర్తలకు కూడా ఈ దాడిలో గాయాలయ్యాయి. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని డిఎంకె ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ తమిళనాడు వ్యాప్తంగా ఈ నెల 11 నుంచి 20 వరకూ సిపిఎం ఆధ్వర్యాన ఆందోళనలు నిర్వహిస్తున్నారు. బర్డోర్స్‌లో ఆందోళన నిర్వహిస్తున్న సమయంలో సిపిఎం కార్యకర్తలపై ఆర్ఎస్ఎస్ గూండాలు దాడికి దిగారు. దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం నాయకులు జాతీయ రహదారిని దిగ్బంధించారు.


దాడిచేస్తున్న సంఘ్ గూండాలు

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

- మహిళా మావోయిస్టు మృతి

కాంకేర్ : ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో శుక్రవారం ఉదయం భద్రతా సిబ్బందితో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక మహిళా మావోయిస్టు మరణించారు. జిల్లా రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి), బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బిఎస్ఎఫ్) సంయుక్త బృందం నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌కు బయలుదేరింది. చోటెబెథియా పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ కొండపై కాల్పులు జరిగాయని కాంకేర్ పోలీస్ సూపరింటెండెంట్ ఇందిరా కళ్యాణ్ ఎలెసెలా తెలిపారు. కోత్రి నదికి అవతలి వైపు మావోయిస్టులు ఉన్నారనే సమాచారం ఆధారంగా అమతోలా , కల్పర్ గ్రామాల మధ్య ఆపరేషన్ ప్రారంభించినట్టు ఎస్‌పి తెలిపారు. 'ఎన్‌కౌంటర్ స్థలం నుంచి ఇప్పటివరకు ఒక మహిళా మావోయిస్టు మృతదేహం, ఒక ఆయుధం లభించాయి. ఆ ప్రాంతంలో ఇంకా కాల్పులు కొనసాగుతున్నాయి' అని చెప్పారు.

మారుతి స్విఫ్ట్‌కు 20 ఏళ్లు

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి తన స్విఫ్ట్ మోడల్‌ను ఆవిష్కరించి 20 ఏళ్లు అవుతుందని వెల్లడించింది. మే 2025లో విడుదల చేసిన ఈ మోడల్‌లో ఇప్పటి వరకు 30 లక్షల యూనిట్ల విక్రయాలు చేసినట్లు తెలిపింది. తమ కంపెనీ మొత్తం విక్రయాల్లో స్విఫ్ట్ వాటా 10 శాతంగా ఉందని పేర్కొంది.

భారత్‌కు మరో మూడు విమానాలు

న్యూఢిల్లీ : ఇరాన్ నుండి శుక్రవారం రాత్రి మరో మూడు విమానాల్లో వెయ్యి మందికి పైగా భారతీయులను తీసుకుని వస్తున్నట్లు ఇరాన్ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ జావేద్ హుస్సేన్ తెలిపారు. ఆ విమానాల కోసం ఇరాన్ తన గగనతలాన్ని అనుమతించింది. శనివారం తెల్లవారు జామునకు ఈ విమానాలు ఢిల్లీలో ల్యాండ్ అవుతాయని భావిస్తున్నారు.

ప్రభుత్వరంగంలోనే విశాఖ స్టీల్

(మొదటిపేజీ తరువాయి)

పేరుతో రాష్ట్ర ప్రజలను మోసం చేశాయని, ఇంతకంటే ద్రోహం, వంచన మరొకటి లేదని విమర్శించారు. అదే సమయంలో ప్రైవేటుకు చెందిన మిట్టల్ ప్లాంటుకు గనులు, సీపోర్టు కేటాయింపులు చేశారని అన్నారు. ఈ సమయంలో విశాఖ వస్తున్న ప్రధానితో వైజాగ్ స్టీల్‌ను ప్రైవేటీకరించబోమని ప్రకటన చేయిస్తే రాష్ట్ర ప్రజలు హర్షిస్తారని అన్నారు.

యోగా పేరుతో ప్రజాధనం వృధా

రాష్ట్రంలో మానసిక ప్రశాంతత పేరుతో యోగా చేయించడంపై అభ్యంతరం లేదని, అదే సమయంలో దీనికోసం రూ.70 కోట్లు వృధా ఖర్చు చేయడం సరికాదని అన్నారు. రాష్ట్రంలో ప్రజలకు ఉపాధి లేదని, నిరుద్యోగం పెరుగుతోందని, ఉన్న ఉద్యోగాలు పీకేస్తున్నారని, తిండి, ఉండటానికి గూడులేని పరిస్థితుల్లో మానసిక ప్రశాంతత ఎక్కడ నుండి వస్తుందని ప్రశ్నించారు. వాటిని కల్పించడంతోపాటు పనిభద్రత ఉంటే ప్రశాంతత ఉంటుందని, ప్రభుత్వం ఆ పనిచేయడం లేదని అన్నారు. యోగా కోసం ఖర్చు చేసే రూ.70 కోట్లను పిల్లల పౌష్టికాహారానికి అందిస్తే మరింత ఉపయుక్తంగా ఉండేదని తెలిపారు. ప్రభుత్వ విధానాల వల్ల వచ్చే శారీరక, మానసిక రుగ్మతలు పోవాలంటే ప్రభుత్వ విధానాలు మారాలి తప్ప యోగా వల్ల ఉపయోగం లేదని అన్నారు. అలాగే రెండుకోట్లమంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని చెబుతున్నారని, వాటిల్లో చాలా వరకూ బోగస్‌వేనని అన్నారు. గిన్నీస్ బుక్ రికార్డు కోసం ప్రభుత్వమే అందరికీ రిజిస్ట్రేషన్లు చేసేసిందని తెలిపారు. దీనికి సంబంధించిన ఆధారాలను ప్రదర్శించారు.

గిరిజన యువతకు అన్యాయం

గిరిజన ప్రాంతంలో ఉన్న ఉపాధ్యాయ పోస్టుల విషయంలో ప్రభుత్వం మోసం చేసిందని, గిరిజన నిరుద్యోగులకు ఇవ్వాల్సిన పోస్టులను వేరేవారికి ఇచ్చిందని చెప్పారు. డిఎస్‌సి ద్వారా వందలాది పోస్టులు భర్తీ చేయాల్సి ఉండగా కేవలం 84 పోస్టులు మాత్రమే గిరిజనులకు కేటాయించిందని తెలిపారు. దీనిపై గిరిజన సలహా మండలి ఇంతవరకు స్పందించలేదని, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు పట్టించుకోవడం లేదని తెలిపారు. పైగా కార్పొరేట్లకు మైనింగ్ కట్టబెట్టేందుకు ఆ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ల పేరుతో గ్రామాల్లో నుండి గిరిజనులను తరిమేస్తోందని తెలిపారు. కేంద్రం ఒత్తిడితో చంద్రబాబు ప్రభుత్వం ఏజెన్సీలో అశాంతిని సృష్టిస్తోందని అన్నారు. ఇప్పటి వరకూ జరిపిన ఎన్‌కౌంటర్లపై విచారణ జరపాలని శ్రీనివాసరావు కోరారు. 2023లో రాష్ట్రంలో 40 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పార్లమెంటులో కేంద్రం ప్రకటిస్తే వైసిపి ప్రభుత్వం వాటిని 18వేలకు కుదించిందని, టిడిపి ప్రభుత్వం 16,400 పోస్టులు మాత్రమే ఉన్నాయని తెలిపిందని విమర్శించారు.

ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా కార్యక్రమాలు


దేశంలో ఎమర్జెన్సీ విధించి జూన్ 26 నాటికి 50 సంవత్సరాలు పూర్తవుతాయని, అప్పట్లో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన సిపిఎం దాని ప్రమాదాన్ని ప్రజలకు వివరించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా సభలు సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించిందని తెలిపారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా సభలు నిర్వహించే హక్కు బిజెపికి లేదన్నారు. ఇటీవల కర్నూలు జిల్లాలో దళిత సర్పంచ్ పట్ల వివక్షాపూరితంగా వ్యవహరించిన బిజెపి ఎమ్మెల్యేను బాధ్యతల నుండి తొలగించాలని కోరారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ. కుప్పంలో మహిళను చెట్టుకు కట్టేయడం అన్యాయమని అన్నారు.

ప్రతీకార ప్రకటనలు సరికాదు

రాష్ట్రంలో ప్రజా సంక్షేమాన్ని వదిలిపెట్టి రాజకీయ పార్టీలు ప్రతీకార, రెచ్చగొట్టే ప్రకటనలకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇది రాష్ట్ర భవిష్యత్‌కు ప్రజల సంక్షేమానికి మంచిది కాదని తెలిపారు. టిడిపి, వైసిపి రెండు పార్టీల నాయకులూ పరస్పరం దూషించుకోవడంతోపాటు హత్యా రాజకీయాలకు ఉసిగొల్పే విధంగా ప్రకటనలు చేస్తున్నారని, వీటిని ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. ఈ విషయంలో ప్రభుత్వం, ప్రతిపక్ష పార్టీలు రెండు జాగ్రత్తగా వ్యవహరించాలని, ఇలాంటి దుందుడుకు ప్రకటనల వల్ల ప్రజలకు మేలు జరగకపోగా అరాచకం, అన్యాయాలు పెరుగుతాయని అన్నారు.







బాలల్లారా రారండి!

బాలల్లారా రారండి!
బడికి వెళదాం కదలండి!
చక్కగ స్నానం చేయండి!
చద్దన్నాలను తిని రండి!
పలకా బలపం పట్టండి!
పదములు కలిపి వ్రాయండి!
ఎక్కములన్నీ చెప్పండి!
లెక్కలు మొత్తం చేయండి!
గురువు మాట వినాలండి!
గొప్పగ చదువు నేర్వండి!
ఆటలనెన్నో ఆడండి!
పాటలు చాలా పాడండి!
తుళ్లుతు ఇంటికి రారండి!
మళ్ళీ స్నానం చేయండి!
పాఠములన్నీ వల్లించండి!
నాన్నకు సాయం చేయండి!
అమ్మకు ప్రేమను పంచండి!
అన్నం త్వరగా తినాలండి!
బామ్మ ఒడిలో చేరండి!
కథలు కబుర్లు చెప్పండి!
చల్లని జాబిలి వచ్చింది!
మెల్లగా నిద్దుర పోవాలండి!

- టి. వి. యెల్. గాయత్రి.
పూణే, మహారాష్ట్ర.
8390705200.

దినచర్య



పొద్దునె నిద్దుర లేవాలి
పాఠాలన్నీ చదవాలి
చకచక స్నానం చేయాలి
యూనిఫారం ధరించాలి

అల్పాహారం తినాలి స్వల్పంగా
పాలు తాగాలి వేడి వేడిగా
తయారవ్వాలి వడివడిగా
బడికెళ్లాలి ఎంతో బుద్ధిగా

తరగతిలోకి అడుగు పెట్టు
అల్లరినంతా పక్కన పెట్టు
పాఠాలపై మనసు పెట్టు
మంచి మార్కులు చేపట్టు

సాయంత్రం బాగా ఆడాలి
ఒంటికి చెమట పట్టాలి
వేళకు ఇంటికి వెళ్లాలి
రేపటి హోంవర్క్ చేయాలి

సెల్ ఫోన్ వాడకం వద్దు
పుస్తకాలు చదవడం ముద్దు
ఎన్నటికీ మీరొద్దు హద్దు
నిద్రపోండి పోకుండా పొద్దు!

- చెన్నాప్రగడ శర్మ.
94405 87567.

నేను గీసిన బొమ్మ



సి. ప్రణయ్ కుమార్,
7వ తరగతి,
V.S.N .పాఠశాల,
పీలేరు,అన్నమయ్య జిల్లా



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఇది ఇక జ్ఞాపకం కాదు..



ఇప్పుడంటే సెల్‌ఫోన్‌తో ఎప్పుడుపడితే అప్పుడు, ఎక్కడపడితే అక్కడ ఫొటోలు తీసేసుకుంటున్నాం. మెమరీలో సేవ్ చేసేసుకుంటున్నాం. ఒక తరం ముందుకెళితే, ఫొటో పెద్ద ప్రహసనం. స్టూడియోకి వెళ్లాలి. పెద్ద పెద్ద లైట్ల వంక కన్నార్పకుండా చూడాలి. మంచి మంచి ఫోజులు ఇవ్వాలి. ఇంకా చాలా వుంటుంది. పేదరిక కుటుంబాలకైతే ఫొటో తీయించుకోవడం లగ్జరీకి సంబంధించిన విషయం. అటువంటి కుటుంబంలో పుట్టిన వ్యక్తే కర్నాటకకి చెందిన బిఎస్ శివరాజు. ఆర్టిస్ట్ 'కాప్ శివ'గా సుపరిచితమైన శివరాజు బాల్యంలో తనకు అందని ద్రాక్షగా ఉన్న నాటి జ్ఞాపకాల ఫొటోలని మధ్య వయసు వచ్చాక పదిలంగా భద్రపరుచుకున్నారు. అప్పుడు అమ్మతో దిగాలను కున్న ప్రతి జ్ఞాపకాన్నీ ఇప్పుడు ఫొటో రూపంలో తీసుకొచ్చారు. ఈ ప్రయత్నంలో అమ్మ సహకారం మరువలేనిది. ఈ తల్లీకొడుకుల బంధాన్ని మరింత మందికి చేరువచేసే సదుద్దేశంతో జాషువా మయివా సంస్థ బెంగళూరు 'సుముఖ'లో 'నో లాంగర్ ఎ మెమరీ' పేరుతో ప్రదర్శనకి ఉంచింది. జూన్ 28 వరకు ప్రదర్శనకి ఉంచిన ఆ ఫొటోల వెనుక ఒక్కో కథ ఉంది.

ఈ ఫొటోలన్నీ శివకి, అమ్మతో ఉన్న జ్ఞాపకాలే. కర్నాటక మారుమూల గ్రామమైన బన్నికుప్పే శివ స్వగ్రామం. కన్నడ గ్రామీణ సంస్కృతి, సాంప్రదాయాల్లోని ఎన్నో కథలు, కళారూపాలు శివ బాల్యంలో చెరగని ముద్రవేశాయి. బయట చూసి వచ్చిన ప్రదర్శనలోని పాత్రల్లాగా వేషం వేసి, అమ్మకు చూపిస్తూ, తను నవ్వుతుంటే అమాయకంగా తను కూడా నవ్వేసిన పసితనం శివకి ఇంకా గుర్తే ఉంది. అమ్మతో ఇన్ని జ్ఞాపకాలను పదిలపరుచుకున్న శివకి ఈ వయసులో రకరకాల ఫొటోలు తీయించుకోవాలని ఎందుకు అనిపించింది? దాని వెనుక ఉన్న కథేంటి? ఆయనే ఇలా వివరించారు.

'నేను చాలా పేద కుటుంబం నుండి వచ్చాను. అమ్మ వ్యవసాయ కూలీగా పనిచేసేది. ముప్పై ఏళ్ల ఆమె తన ముగ్గురు బిడ్డలని పెంచడానికే వెచ్చించింది. తను నిరక్షరాస్యురాలు. నాన్న ఉన్నా కుటుంబాన్ని అంతగా పట్టించుకోలేదు. ఈ పరిస్థితుల్లో తను మాకోసం బయట పనికి వెళ్లింది. ఆనాటి గ్రామీణ పరిస్థితులు కూడా మా కుటుంబానికి ఆర్థికంగా చేయూత ఇవ్వలేదు. జీవితమంతా కష్టాలే. మాకు సంతోషాలు, సుఖాలు వంటివి చుట్టంచూపుగా కూడా వచ్చేవి కావు. ఇలాంటి పరిస్థితుల్లో ఒకసారి మా తాతయ్య, నన్ను అమ్మని చన్నపట్న దగ్గర్లోని ఓ ఫొటో స్టూడియోకి తీసుకువెళ్లాడు. ఆ స్టూడియో వాతావరణం చూసి నాకు చాలా ఆశ్చర్యమేసింది. ఫొటో దిగుతున్నా నన్న ఆనందంతో ఊపిరి ఆడలేదు. అయితే తీసుకెళ్లిన డబ్బులు చాలక ఫొటో తీయించుకోకుండానే బయటికి వచ్చేశాం. ఆ తరువాత అమ్మతో నేను ఎప్పుడూ ఫొటో దిగలేదు. నిజానికి నా చిన్ననాటి ఫొటో ఒక్కటి కూడా లేదు. ఇదంతా నా మనసులో ఎప్పుడూ బాధపెడుతూనే ఉండేది. ఆ తరువాత నా స్నేహితుల ఇళ్లకి వెళ్లినప్పుడు వాళ్ల ఇంటి గోడలపై, బీరువాల్లో భద్రంగా దాచుకున్న ఆల్బమ్‌ల్లోని ఫొటోలు చూసినప్పుడల్లా అది మరింత ఎక్కువయ్యేది.



ఈ బాధ నుండి బయటపడాలంటే అమ్మతో నేను ఉన్న ప్రతి జ్ఞాపకాన్ని ఫొటో ఫ్రేములో భద్రంగా దాచుకోవాలి. 'ఇప్పుడు అది సాధ్యమేనా?' అని నేను ఆలోచించలేదు. 'ఎలాగైనా సాధించాలి' అని లక్ష్యం పెట్టుకున్నాను. అలా ఈ ప్రాజెక్టు మొదలుపెట్టాను' అని శివరాజు తన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

ఎగ్జిబిషన్‌లో ప్రదర్శితమౌతున్న ప్రతి ఫొటోలో శివతో పాటు అమ్మ కూడా ఉంది. రకరకాల గెటప్‌లతో ఉన్న కొడుకుతో సమానంగా తను కూడా డ్రెస్ చేసుకుని కనిపిస్తుంది. కొడుకు చేష్టలకు ఆనాడు పగలబడి నవ్విన స్వచ్ఛమైన నవ్వు ఆమెలో స్పష్టంగా తాండవిస్తుంది. 'ఇంత సహజంగా ఈ ఫొటోలు ఎలా వచ్చాయి?' అనే దానిపై శివ ఇలా చెప్పారు.

'ఈ ప్రాజెక్టు 2016-17లో ప్రారంభించాను. మొదట్లో చెప్పినట్లు ఇందులో అమ్మ భాగస్వామ్యం కచ్చితంగా ఉండాలని అనుకున్నాను. నేను ఏం చెబితే అలా చేసేది. ఎంత సేపు నుంచోమన్నా అంతసేపు నుంచోనేది. ఒక్కోసారి రోజంతా పట్టేది. అయినా ఓర్చుకునేది. ఎంత బరువైన, ఇబ్బందికరమైన కాస్ట్యూమ్స్ అయినా చిరునవ్వుతో ధరించేది. ఎక్కడా, ఎప్పుడూ విసుక్కునేది కాదు. అమ్మ లేకపోతే, ప్రోత్సాహం ఇవ్వకపోతే నా ప్రాజెక్టు సక్సెస్ అయ్యేది కాదు.

పౌరాణికాలు, సామాజిక కథలు, నన్ను ప్రభావితం చేసిన వ్యక్తులు ఇలా రకరకాల వేషాలతో అమ్మతో కలిపి ఫొటోలు తీయించుకున్నాను. ఈ ఫొటోలతో మొదటిసారి ఎగ్జిబిషన్ పెట్టినప్పుడు వీక్షకులు అమ్మతో సెల్ఫీలు కూడా దిగేవారు. అప్పుడు తెగ మురిసిపోయేది. తన కళ్లు సంతోషంతో తడిబారేవి' అని శివ చెప్పిన ప్రతి జ్ఞాపకం ఇప్పుడు అతని దగ్గర పదిలంగా ఉంది.

ఈ ఫొటోల్లో కాస్ట్యూమ్స్ ఒక ఎత్తయితే, బ్యాక్‌గ్రౌండ్ ప్రదర్శన మరో ఎత్తు. ఫొటోకి తగ్గట్లు చాలా ఆకర్షణీయంగా దాన్ని తీర్చిదిద్దారు. ఆకుపచ్చ, పసుపు, గులాబీరంగులతో పూలు, చెట్లు, సెలయేళ్లు, కొండలు, గుట్టలు వంటి ప్రకృతిదృశ్యాలు, పురాణకథలకు తగ్గట్లు రాజసభ, గదలు, ఆభరణాలు, పోలీసు పాత్ర వేస్తే దానికి తగ్గట్లు షూస్, బుల్లెట్లు, గన్స్ పట్టుకుని తల్లీకొడుకులు ఇచ్చిన ఫోజులు చూస్తూ కన్ను పక్కకి తిప్పుకోలేం.

బ్యాక్‌గ్రౌండ్ కలర్స్ కోసం శివ తను పుట్టి పెరిగిన ఊరు, ఆ ఇళ్ల, గోడలపై వేసిన రంగులను తీసుకున్నారు. బెంగుళూరు, ముంబయిలో టెక్స్‌టైల్ మార్కెట్లో వాటికి తగ్గ ఫ్యాబ్రిక్‌ని ఎంచుకున్నారు. అందుకే అవి అంత స్వచ్ఛంగా, ఆకర్షణీయంగా కనిపిస్తాయి.

శివరాజు ప్రాజెక్టు ఇంత ఆకర్షణీయంగా రావడం వెనుక ఇద్దరు ప్రముఖ ఫొటోగ్రాఫర్లు కూడా ఉన్నారు. ఆ విషయంపై శివ ఇలా చెప్పారు. 'ఎస్.పుష్పమాల, మల్లిక్ సిదిబి ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్లు. నా పరిజ్ఞానం అంతంత మాత్రమే. నా ఆలోచనలను, భావాలను వారు తమ కెమెరాల్లో మరింత అందంగా చూపించారు. జూన్ 28 వరకు జరుగుతున్న ఈ ఫొటో ఎగ్జిబిషన్‌కి అందరూ రండి. ఇదే మా అమ్మకి నేను ఇచ్చే గొప్ప నివాళి. నేను చేసిన ఈ పనిని చూసి చాలామందికి వారి బాల్యం గుర్తుకురావచ్చు. అందుకే దీన్ని ప్రతి ఒక్కరూ మేధోపరమైనదిగా కాకుండా భావోద్వేగ భరితమైనదిగా గుర్తుంచుకోండి. ఎందుకంటే 'నో లాంగర్ ఎ మెమరీ' (ఇది ఇక ఒక జ్ఞాపకం కాదు)."








ఎఎ22లో సాయి అభ్యంకర్!

అల్లు అర్జున్ హీరోగా కోలీవుడ్ దర్శకుడు అట్లీ డైరెక్షన్‌లో ఓ సినిమా వస్తున్నా సంగతి తెలిసిందే. బన్నీ కెరీర్‌లో 22వ సినిమాగా వస్తున్న ఈ సినిమాలో దీపికా పడుకొనే, మృణాల్ ఠాకూర్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్‌గా అనిరుధ్, సాయి అభ్యంకర్ పేర్లు గత కొన్ని నెలలుగా వినిపిస్తున్నాయి. ఇప్పుడు అందుతున్న విశ్వసనీయ సమాచారం ప్రకారం అల్లు అర్జున్, అట్లీ సినిమాకు కోలీవుడ్ యంగ్ సెన్సేషన్ సాయి అభ్యంకర్‌ను ఫిక్స్ చేసారని తెలుస్తోంది.





సూర్య- ఆర్‌జే బాలాజీ కొత్త సినిమా 'కరుప్పు'

కథానాయకుడు సూర్య 45వ చిత్రం ఇప్పటికే ప్రారంభమైంది. తాజాగా టైటిల్‌ను మేకర్స్ రివీల్ చేశారు. గతేడాదిలో పొల్లాచ్చి సమీపంలోని ఆనైమలై ప్రాంతంలో గల ప్రసిద్ధి చెందిన మాసానీ అమ్మన్ ఆలయంలో పూజా కార్యక్రమాలతో ఈ ప్రాజెక్ట్ ప్రారంభమైంది. నటుడు ఆర్‌జే బాలాజీ ఈ మూవీకి దర్శకత్వం వహించనున్నారు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్ఆర్.ప్రకాష్‌బాబు, ఎస్ఆర్ ప్రభు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నటి త్రిష హీరోయిన్‌గా నటించనున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించనున్నారు. ఈ సినిమాకు 'కరుప్పు' అనే టైటిల్‌ను ఫిక్స్‌చేశారు. ఈమేరకు అధికారికంగా ప్రకటన కూడా వచ్చేసింది. ఇదొక యాక్షన్ అడ్వెంచరస్ చిత్రమని తెలుస్తోంది. సినిమా షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైంది. ఈ ఏడాది ఆఖరులో ఈ సినిమా విడుదల కానుంది.

ఏడేళ్లుగా సాయం



శివ కార్తికేయన్ గురించిన ఓ ఆసక్తికర వార్త వెలుగులోకి వచ్చింది. చాలా కాలం క్రితం ఓ తమిళ రైతు నాయకుడికి ఇచ్చిన మాట మేరకు ఆయన ఇప్పటికీ సాయం చేస్తూ వస్తున్న విషయం బయటకి వచ్చింది. ఇటీవల దర్శకుడు ఐ.శరవణన్ ఈ విషయాలను బయట పెట్టారు. ఆయన మాట్లాడుతూ.. 'నా సోదరుడు నెల్ జయరామన్ మరణించినపుడు తన కుమారుడు శ్రీనివాసన్ విద్యా ఖర్చులను భరిస్తానని శివకార్తికేయన్ మాట ఇచ్చారు. ఆ మాట తప్పకుండా గత ఏడేళ్ళుగా విద్యా ఖర్చులను భరిస్తున్నార'ని తెలిపారు. శివకార్తికేయన్ గత ఏడేళ్ళుగా ఆ విద్యార్థి మొత్తం ఖర్చులను భరించడమే కాకుండా ప్రతి ఏటా పబ్లిక్ పరీక్షల సమయంలో ఫోన్ చేసి అన్ని విషయాలు అడిగి తెలుసుకుంటున్నారని చెప్పారు.

హైదరాబాద్‌లో 'నాగబంధం' షూటింగ్



'పెదకాపు' చిత్రం ఫేమ్ విరాట్ కర్ణ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'నాగబంధం'. 'ది సీక్రెట్ ట్రెజర్' అన్నది ట్యాగ్‌లైన్. నిర్మాత అభిషేక్ నామా ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. నభా నటేష్, ఐశ్వర్యా మీనన్ కథానాయికలు. లక్ష్మీ ఐరా, దేవాన్ష్ నామా సమర్పణలో ఎన్ఐకే స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్‌పై కిశోర్ అన్నపురెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షఉటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ సినిమా కోసం ప్రొడక్షన్ డిజైనర్ అశోక్ కుమార్ ప్రత్యేకంగా తీర్చిదిద్దిన కేరళ అనంత పద్మనాభ స్వామి టెంపుల్ సెట్‌లో పాట చిత్రీకరణ జరుగుతోంది. 'ఈ పాటలో విరాట్ కర్ణతో పాటు 5000 మంది నృత్య కళాకారులు పాల్గొంటున్నారు. బాలీవుడ్ కొరియోగ్రాఫర్ గణేశ్ ఆచార్య పర్యవేక్షణలో ఈ పాటను చిత్రీకరిస్తున్నాం. ఈ ఒక్క ఎపిసోడ్‌కే రూ.10 కోట్లు బడ్జెట్ కేటాయించాం. ఈ అద్భుతమైన సీక్వెన్స్ ఎప్పటికీ గుర్తుండి పోయేలా ఉంటుంది' అని చిత్రయూనిట్ పేర్కొంది. జగపతిబాబు, జయప్రకాశ్, మురళీ శర్మ, బిఎస్ అవినాష్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా సౌందర్ రాజన్ ఎస్, సంగీతం అభే.

జైలర్ 2లో ధనుష్!

రజనీకాంత్, ధనుష్ సిల్వర్ స్క్రీన్ షేర్ చేసుకోనున్నారనే చర్చ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. కథానాయకుడిగా రజనీకాంత్ టైటిల్ రోల్‌లో నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో 'జైలర్' సినిమా వచ్చిన సంగతి తెలిసిందే. 2023లో విడుదలైన ఈ చిత్రం సూపర్‌హిట్‌గా నిలిచింది. దీంతో రజనీకాంత్‌తోనే 'జైలర్ 2' తీయాలని ప్రస్తుతం స్క్రిప్ట్‌ను దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తయారు చేస్తున్నారు.

ఈ ఏడాది చివర్లో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది. కాగా 'జైలర్ 2'లోని ఓ కీలకపాత్ర కోసం ధనుష్‌ను నెల్సన్ సంప్రదించారు. దానికి ధనుష్ కూడా అంగీకరించారు. ప్రస్తుతం చెన్నైలో 'కూలీ' సినిమా చిత్రీకరణలో రజనీకాంత్ బిజీగా ఉన్నారు. ఈ సినిమాలోని యాక్షన్ సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ ఏడాదిలోనే ఈ సినిమా విడుదల కానుంది.



శుభ్‌మన్, జైస్వాల్ సెంచరీలు

- భారత్ 359/3
- పంత్ అర్ధసెంచరీ
- సాయి సుదర్శన్ అరంగేట్రం
- భారీస్కోర్ దిశగా టీమిండియా



లీడ్స్: టీమిండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సెంచరీలకి తోడు వికెట్ కీపర్ రిషబ్ పంత్ అర్ధసెంచరీలతో మెరిసారు. దీంతో హెడింగ్లీ వేదికగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలిటెస్ట్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా భారీస్కోర్ దిశగా దూసు కెళ్తోంది. తొలిరోజు ఆట ముగిసే సమయానికి 85 ఓవర్లకు 3 వికెట్లు కోల్పోయి 359 పరుగులు సాధించింది. టీ విరామ సమయానికి పటిష్టంగా ఉన్న భారతజట్టు ఆ తర్వాత యశస్వి జైస్వాల్(101) వికెట్‌ను కోల్పోయింది. ఆ తర్వాత కెప్టెన్ శుభ్‌మన్(127 బ్యాటింగ్), వికెట్ కీపర్ రిషభ్ పంత్ (65 బ్యాటింగ్)లో రాణించారు.

టాస్ గెలిచిన ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ ఫీల్డింగ్ ఎంచుకోవడంతో బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు శుభారంభం దక్కింది. ఓపెనర్లు జైస్వాల్-కెఎల్ రాహుల్ తొలివికెట్‌కు 91పరుగులు జతచేశారు. ఈ జోడీని కర్సే విడదీశాడు. టెస్టుల్లో అరంగేట్రం చేసిన సాయి సుదర్శన్(0) డకౌటయ్యాడు. ఆ వికెట్‌ను బెన్ స్టోక్స్ పడగొట్టాడు. ఈ క్రమంలో వికెట్ల పతనాన్ని జైస్వాల్-శుభ్‌మన్ కలిసి అడ్డుకున్నారు. ఇంగ్లండ్ గడ్డపై శతక గర్జన చేశాడు. నిరుడు వెస్టిండీస్, ఆస్ట్రేలియా పర్యటనల్లో సెంచరీతో చెలరేగిన ఈ యంగ్ సంచనలం.. ఇంగ్లండ్ బౌలర్ల భరతం పడతూ ఐదోసారి మూడంకెల స్కోర్ అందుకున్నాడు. పేసర్ బ్రాండన్ కార్సే ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు, ఆపై సింగిల్ తీసిన యశస్వి టెస్టుల్లో వంద నమోదు చేశాడు. మరో ఎండ్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్(127 నాటౌట్) కూడా చెలరేగి ఆడాడు.. దాంతో, టీమిండియా భారీ స్కోర్ దిశగా సాగుతోంది. టీ విరామం తర్వాత ఓపెనర్ జైస్వాల్(101) వికెట్‌ను ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్ పడగొట్టాడు. ఆ సమయానికి భారత్ 221 పరుగులు చేసింది. రిషబ్ పంత్ క్రీజ్‌లోకి వచ్చి ఆచి తూచి ఆడాడు.

కెప్టెన్‌గా గిల్ తొలి సెంచరీ

శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా రాణించాడు. పేస్, స్వింగ్‌తో బెంబేలెత్తించాలనుకున్న ఇంగ్లండ్ బౌలర్ల వ్యూహాన్ని తిప్పకొడుతూ తొలుత అర్ధ శతకం, ఆ తర్వాత సెంచరీని పూర్తి చేశాడు. క్రీజులోకి రావడమే ఆలస్యం బౌండరీలతో విరుచుకుపడిన గిల్.. జోష్ టంగ్ ఓవర్లో మిడ్ వికెట్ బౌండరీతో ఫిఫ్టీకి చేరువయ్యాడు. 56 బంతుల్లో 8 ఫోర్లు బాదిన అతడికి ఇదే ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీని, 140 బంతుల్లో సెంచరీని పూర్తి చేశాడు. దీంతో టీమిండియా కెప్టెన్ హోదాలో సెంచరీ కొట్టిన నాల్గో బ్యాటర్‌గా శుభ్‌మన్ నిలిచాడు.

నల్లరిబ్బన్లతో భారత్-ఇంగ్లండ్ ఆటగాళ్లు

టాస్ అనంతరం భారత్-ఇంగ్లండ్ ఆటగాళ్లు అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతులకు నివాళు లు అర్పించారు. హెడింగ్లే మైదానంలోకి దిగడానికి ముందు 2 నిమిషాలు మౌనం పాటించారు. అంతేకాదు నల్లబ్యాడ్జీలు ధరించి ఆటకు సిద్ధమయ్యారు. జూన్ 12న జరిగిన ఎయిరిండియా బోయింగ్ 171 డ్రీమ్‌లైనర్ విమానం ఘోర విమాన ప్రమాదంలో వందలాది మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

స్కోర్‌బోర్డు...

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (బి) స్టోక్స్ 101, కెఎల్ రాహుల్ (సి)రూట్ (బి)కర్సే 42, సాయి సుదర్శన్ (సి)స్మిత్ (బి)స్టోక్స్ 0, శుభ్‌మన్ (బ్యాటింగ్) 127, పంత్ (బ్యాటింగ్) 65, అదనం 23. (85 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 359 పరుగులు. **వికెట్ల పతనం:** 1/91, 2/92, 3/221 **బౌలింగ్:** వోక్స్ 17-2-80-0, కర్సే 14-4-58-1, టోంగే 16-0-75-0, స్టోక్స్ 13-1-43-2, బషీర్ 21-4-66-0.

డ్రా దిశగా బంగ్లాదేశ్-శ్రీలంక టెస్ట్

గాలే: బంగ్లాదేశ్-శ్రీలంక జట్ల మధ్య జరుగుతున్న తొలిటెస్ట్ డ్రా దిశగా పయనిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో ఇరుజట్లు భారీస్కోర్ నమోదు చేసినా.. పర్యాటక బంగ్లా జట్టు 10పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యతను సంపాదించింది. నాల్గోరోజైన శుక్రవారం శ్రీలంక జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 485పరుగుల వద్ద ఆలౌటైంది. కమిందు మెండీస్(87) అర్ధసెంచరీకి తోడు రత్నాయకే(39) బ్యాటింగ్‌లో రాణించారు. బంగ్లాదేశ్ బౌలర్లు నయీమ్ హసన్‌కు ఐదు, హసన్ మహమూద్‌కు మూడు వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాజట్టు 495పరుగులు చేసిన విషయం తెలిసిందే. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లాజట్టు నాల్గోరోజు ఆట నిలిచే సమయానికి 3వికెట్ల నష్టానికి 177పరుగులు చేసింది. ఓపెనర్ షాద్మన్ ఇస్లామ్(76)కి తోడు కెప్టెన్ నజ్ముల్(56నాటౌట్) అర్ధసెంచరీలతో రాణించారు. నజ్ముల్ శాంతోకి తోడు ముష్ఫికర్ రహీమ్(22) క్రీజ్‌లో ఉన్నారు. దీంతో బంగ్లాజట్టు ఇప్పటికే 187పరుగుల ఆధిక్యతను సంపాదించింది.

హాకీ క్రీడాకారులకు రూ.25వేలు గౌరవ వేతనం



భువనేశ్వర్: అంతర్జాతీయ స్థాయిలో ఆడుతున్న భారత హాకీ కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ రూ.25వేలు గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఈమేరకు శుక్రవారం ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. జాతీయ క్యాంప్‌లకు ఎంపికైన పురుష, మహిళా ప్లేయర్లకు ప్రతి నెల అదనంగా రూ.25వేలు చెల్లించనుంది. గురువారం జరిగిన మిషన్ ఒలింపిక్ సెల్స్ నెలవారీ సమావేశంలో హాకీ ఇండియా అభ్యర్థనను అంగీకరించిన మంత్రిత్వ శాఖ.. టార్గెట్ ఒలింపిక్ పోడియం పథకం కింద ఈ అలవెన్స్ అందజేస్తామని మంత్రి మన్సుఖ్ మాండవీయ తెలిపారు. ఈ స్కీమ్ ద్వారా మొత్తంగా 80 మంది (40 మంది పురుషులు, 40 మంది మహిళా క్రీడాకారులు) లబ్ది పొందనున్నారని హాకీ ఇండియా(హెచ్ఐ) శుక్రవారం వెల్లడించింది. హాకీ ప్లేయర్లకు అదనపు భత్యం ఇవ్వాలని హాకీ ఇండియా పలుమార్లు విజ్ఞప్తి చేసింది. ఈ విషయంపై గురువారం జరిగిన మిషన్ ఒలింపిక్ సెల్ సమావేశంలో చర్చ జరిగింది. ఆటగాళ్లను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నెల నెలా రూ.25 వేలు ఇవ్వాలని నిర్ణయించాం. ఫామ్, ఫిట్‌నెస్.. ఈ రెండు అంశాల ఆధారంగా ఆటగాళ్లను ఎంపిక చేస్తాం అని మంత్రి మాండవీయ వెల్లడించారు. అలాగే కోర్ గ్రూప్ అథ్లెట్లకు ప్రతి నెల రూ.50 వేలు ఇవ్వాలని తీర్మానించామని ఆయన తెలిపారు. క్రికెటర్ల మాదిరిగానే తమకూ సెంట్రల్ కాంట్రాక్ట్ ఇవ్వాలని హాకీ ఆటగాళ్లు ఎప్పటినుంచో కోరుతున్నారు. తాజా ప్రకటనలో హాకీ ఆటగాళ్లకు ఊరట లభించినట్లయ్యింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68